# ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ

## ( ఉభయకుశలోపరి )

**ఆత్మకథ**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**

**యోగ మిత్రులు**
**శ్రీ కొత్త వేంకటేశ్వరరావు చౌదరిగారు**
**కూర్చిన లేఖాంశములు-టిప్పణితో**

**ప్రచురణ**
**తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి**
**2011**

# PRAJNA PRABHAKARAMU-GURU POOJA

Auto - Biography
by
**Sri Veturi Prabhakara Sastri**
**Ubhayakusalopari**

T.T.D. Religious Publications Series No.811

© All Rights Reserved

2008/2011
Copies : 1000

Published by
**I.Y.R. Krishna Rao,I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

"శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"

## నామాట

**శ్రీ.కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్.,** 28.01.2009

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు,

తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు ప్రజల్లో ఎంతో భక్తిధార్మిక చైతన్యాన్ని కల్గిస్తున్నాయి. శ్రీవారి యందు అచంచల భక్తినీ, ప్రగాఢ విశ్వాసాన్నీ దృఢతరం చేస్తున్నాయి. వీటికితోడూ ప్రాచీనసాహిత్యంలో ఆణిముత్యాలైన రామాయణ భారత భాగవతాదిగ్రంథాలను సరళసులభవివరణాత్మకంగా ప్రజలకు అందిస్తున్నారు.

ఏ దేశంలో ఉత్తమసాహిత్యం విశేషంగా వ్యాప్తిజెంది, ప్రజాహృదయాల్లో చెరగని ముద్ర వేస్తుందో, ఆ దేశంలో ధార్మికసంస్కృతి, నాగరికత, జ్ఞానం, భక్తి, ఆధ్యాత్మికచింతన, సౌభ్రాత్రం, సౌశీల్యం, సుఖశాంతులూ వర్ధిల్లుతాయి. సంసారం సంస్కారంతో రాణిస్తుంది.

ఈ దిశలో భాగంగా దేవస్థానంవారు "శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని "శ్వేత" లో స్థాపించారు. ఈ పీఠం ద్వారా శ్రీశాస్త్రి గారి రచనలనూ, పరిష్కరణలనూ, సాహిత్యజ్ఞులకు సన్నిహితం చేయడమేకాకుండా – ఉత్తమపరిశోధనలూ జరిపించి, అనేక నూతనాంశాలు – సమాజశ్రేయోదాయకమైనవి వెల్వరించాలనీ ఆశిస్తున్నాము.

శ్రీ శాస్త్రిగారు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో చాలాకాలం పరిశోధకులుగా ఉండి, అనేక అముద్రిత తాళపత్రగ్రంథాలను వెలుగులోనికి తెచ్చారు. ఎన్నో గ్రంథాలు పరిష్కరించి, పీఠికలు



సంతరించారు. వీరి పీఠికలు గ్రంథహృదయాన్నీ, కవి ఆశయాన్నీ ఆవిష్కరిస్తాయి. మొగమోటంకోసం అంతా బాగుం దనే పద్ధతిలో కాకుండా వీరి విమర్శనధోరణి నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా, ప్రామాణికంగా, సహృదయరంజకంగా ఉంటుంది.

అన్నమయ్య సంకీర్తనల విషయంలోనూ, తాళపత్ర గ్రంథాలసేకరణ, పరిరక్షణలోనూ, ప్రాచీనశిల్పసంపదను ఒక్కచోట చేర్చి, 'మ్యూజియం' స్థాపించడంలోనూ, "మాస్టర్.సి.వి.వి." యోగం ద్వారా వ్యాధుల్ని నయం చేయడంలోనూ శ్రీశాస్త్రిగారి నిర్విరామకృషి మహత్తరమైనది.

శ్రీశాస్త్రిగారి అలభ్యరచనలను "1. ప్రజ్ఞాప్రభాకరము, 2.సింహావలోకనము, 3.తెలుగుమెఱుగులు 4.మీగడతఱకలు" అనే నాల్గింటిని పునర్ముద్రించి, సహృదయసాహితీప్రియులకు అందిస్తున్నాము. ఇందలి వ్యాసాలు సాహిత్యానికే గాక, యోగాదివిషయాలకూ, సద్విమర్శనచింతనకూ, ఆటపట్టులు. ఇలాంటి రచనలు చదివి, జీర్ణించుకోవడం ద్వారా సాహితీ ప్రియులు ప్రాచీన సాహిత్యాభిలాషనూ, విమర్శనశక్తినీ, కవితానురక్తినీ, పటిష్ఠం చేసుకోవచ్చు.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు చేస్తున్న ఈ వాఙ్మయ సేవను సాహితీహృదయు లందరూ సద్వినియోగపరచుకోవా లని ఆశిస్తున్నాము.

శ్రీవేంకటేశాయ మంగళమ్

శ్రీవారి సేవలో,



**(కె.వి.రమణాచారి)**

# శుభాశయము

## భూమన్,

సంచాలకులు, ఎస్.వి. ఉద్యోగుల శిక్షణ కేంద్రము,
ఎస్.వి. కేంద్రగంథాలయము & పరిశోధన సంస్థ,
శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠము,
మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు,
శ్వేత భవనము, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానం గొప్పధార్మికసంస్థ. సాహిత్యం భక్తిసంగీతం, ఆధ్యాత్మికం, ధార్మికప్రచారం, కల్యాణమస్తు, శాంతియాగాల ప్రచారసేవలు అందిస్తూ, సమాజాన్ని ధార్మికచింతనమార్గంలోకి తేవడానికి అహర్నిశలూ కృషి చేస్తూంది. ఎంతచేసినా ఇంకా చేయాల్సింది ఎంతో వుందనే తోస్తూంది.

ఈ శుభాశయంతో ఇటీవల క్రొత్తగా శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని "శ్వేత" లో స్థాపించడం జరిగింది. ప్రభాకరశాస్త్రి గారు సుప్రసిద్ధకవిపండితులు. గొప్పవిమర్శకులు. నిరంతరసాహితీ పరిశోధకులు. తిరుమల తిరుపతి దేవస్థానంతో శాస్త్రిగారికి ఎంతో అనుబంధం ఉంది.

పీఠాన్ని స్థాపించకమునుపే వేటూరివారివర్ధంతిని నిర్వహించటం జరిగింది. పీఠాన్ని స్థాపించిన వెంటనే శ్రీశాస్త్రిగారి 120వజయంతి సంధర్భంగా సింహావలోకనం, ప్రజ్ఞాప్రభాకరం, తెలుగు మెఱుగులు, మీగడతఱకలు పునర్ముద్రించి, సాహితీప్రియులకు అందించడం ఆనందంగా ఉంది.

శ్రీశాస్త్రిగారు 120వ జయంతి సందర్భాన 'శ్వేత' భవనం ఎదురుగా – వారి కాంస్య విగ్రహాన్ని స్థాపించడమూ గొప్పస్ఫూర్తిదాయకం! శ్రీశాస్త్రిగారి అలభ్య, అముద్రితరచనలను ముద్రించడం, వారి సాహిత్యం పై పరిశోధనలు గావించడం, వారు వ్యాఖ్యానించిన "ఉత్తర హరివంశాన్ని" (అసమగ్రం) సుప్రసిద్ధ పండితులతో పూర్తి చేయించడం, మున్నగు కార్యక్రమాలతో పీఠం నానాటికీ విస్తృతమవుతుం దని ఆకాంక్ష.

ప్రస్తుతం జయంతి సందర్భంగా ముద్రిస్తున్న పుస్తకాలు, శ్రీశాస్త్రిగారు ఆయా సందర్భాల్లో గావించిన ఉపన్యాసాలూ, సమర్పించిన పత్రాలూ ఒకచోట చేర్చి – అనేకాంశాలపై నున్న వ్యాసాలు. ఇందులో ఆంధ్రసాహిత్యం సారభూతంగా ఆణిముత్యాల్లాంటి శీర్షికల్తో – సాహితీ ప్రియులకు హృదయానందాన్నీ, నూతన ఆలోచనలనూ, విమర్శనధోరణినీ – త్రివేణీ సంగమంలాగా – నింపుతుంది.

ఈ వ్యాసాల్లో శాస్త్రిగారి సంగీత, సాహిత్య, వేదాంత, భాషాశాస్త్రాది బహుముఖీనమైన ప్రజ్ఞావైశిష్ట్యం సర్వత్ర గోచరిస్తుంది. శాస్త్రిగారు కొన్ని గ్రంథాల్లో స్వయంగా రాసుకున్న "చిత్తువ్రాతలు" సైతం పరిశోధకులకు ఎంతో ఉపకరిస్తాయి.

అన్నమయ్య కీర్తనలను వెలుగుకు తేవడంలో శ్రీ శాస్త్రిగారి కృషిప్రశంసనీయం!

శ్రీశాస్త్రిగారి వాఙ్మయపీఠాన్ని నెలకొల్పి, అందుకు తగిన సంపూర్ణసహకారం అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు గౌరవ శ్రీ ఆదికేశవులు నాయుడు గారికీ, గౌరవ పాలకమండలి సభ్యులకూ, కార్యనిర్వహణాధికారి మాన్యశ్రీ కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్. గారికీ, ఇతర అధికారబృందానికీ, శ్రీశాస్త్రిగారికుమారుడు ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారికీ, శ్వేత, కేంద్ర గ్రంథాలయం మరియు పరిశోధనసంస్థ తరపున ధన్యవాదాలర్పిస్తున్నాను.

| విషయము | పుటలు |
|---|---|
| 14 సాహిత్యజీవనము - అరకుడుపు | 78 |
| 15 టైఫాయిడ్ | 83 |
| 16 వేంకటేశ్వరస్వామి దర్శనము | 86 |
| 17 తొలి కలయిక | 89 |
| 18 ఆవేదన | 95 |
| 19 అనారోగ్యము | 100 |
| 20 ఔషధసన్యాసము | 102 |
| 21 వెలుఁగునీడలు | 105 |
| 22 వెలుఁగుబాట | 109 |
| 23 దివ్యదర్శనము | 111 |
| 24 అనుభూతి | 114 |
| 25 దివ్య బోధ | 117 |
| 26 చేకూడుట | 121 |
| 27 శ్రీ మాస్టరుగారు | 123 |
| 28 నవజీవనము | 129 |
| 29 ఇల్లాలి యినిసియేషన్ | 136 |
| 30 నాడీ గ్రంథములు | 139 |





| విషయము | పుటలు |
|---|---|
| పద్యావళి - గీతాంజలి | 149 |
| చిత్రావళి - ఫోటోలు | |
| పరిశిష్టము-ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ -ఉభయకుశలోపరి | 1 -104 |




“ప్రజ్ఞాప్రభాకరము” రెండవ ముద్రణము జరిగినది. వారికడనున్న ఆవేయిప్రతులును నేటికి చెల్లిపోయినట్లు తెలియుచున్నది. పితృపాదులు శ్రీప్రభాకరుల రచనలన్నీ ఒకక్రమమున సంపూర్ణ గ్రంథావళిగా ప్రకటింపబడవలసి యున్నది. ఇప్పటి అంచనాల ప్రకారము అవి అన్నీ కలిసి మొత్తము అచ్చులో ఆరువేల పుటలకు పై పడును. ఇరువది సంపుటములకు అధికమగును. కనుక ఈ ముద్రణ వ్యవహారమును క్రమబద్ధ మొనరించుటకై మిత్రులతో యోచన చేసి, ఒక ప్రణాళికను సిద్ధము చేసి, 1981–82 సం॥లో వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టును ఏర్పరచినాము. శ్రీ ప్రభాకరుల సొంత గ్రంథాలయమునే కాక వారి ముద్రితాముద్రిత రచన లన్నింటి మీది హక్కులను ట్రస్టు ఆదర్శములకే అంకిత మొనరించి చట్టబద్ధము గావించినాము. ఈ ట్రస్టులో మూడు విభాగము లున్నవి. మణిమంజరి పత్రికా ప్రకటనమును, గ్రంథ ప్రకటన కార్యక్రమమును సమీక్షించుటకు “మణిమంజరి ప్రచురణలు” అను విభాగమును, పరిశోధన కార్యక్రమముల నిర్వహించుటకు “శ్రీప్రభాకరపరిశోధక మండలి” అను విభాగమును ; గ్రంథాలయనిర్వాహమునకు“ శ్రీప్రభాకరశాస్త్రి గ్రంథాలయము” అను విభాగమును ట్రస్టులో అంతర్భాగములై పని చేయుచున్నవి.

ఈ యేడు, అనగా 1986లో, ఆవృత్తి ప్రకారము 76 సంవత్సరముల తర్వాత తిరిగీ కానవచ్చిన హేలీస్ కామెట్‌ను పురస్కరించుకొని “మణిమంజరి” 11,12 సంచికలను ప్రజ్ఞాప్రభ – యోగ ప్రభ అను పేర మాస్టర్ యోగ విశేష సంపుటములను జోడు సంచికలుగా వెలువరించు చున్నాము. ఇదే సందర్భమున నేడు అలభ్యముగానున్న “ప్రజ్ఞాప్రభాకరము” ను యోగమిత్రుల కందించుచున్నాము. **గురుదేవులు తలపోసినట్లు “గురుపూజ” అను విభాగముతో కూడిన ప్రజ్ఞాప్రభాకరము. త్వరలోనే విస్తృతి నందుకొని సంపూర్ణ గ్రంథావళిలో భాగముగా మఱియొక బృహత్ సంపుటము వెలువడ గలదు.** గురుదేవుల సంకల్పము ఎప్పటి కెట్లు ఉచితమో ఆ తీరుగానే అనుగ్రహించి మమ్ము పనిగొనుచున్న దని తలచుచున్నాము. ఎప్పటివలెనే ఆంధ్రపాఠక లోకము మాకృషిని మన్నించునని ఆశించుచున్నాము

శ్రావణపూర్ణిమ, విధేయుడు,
19.8.1986, **వేటూరి ఆనందమూర్తి**
హైదరాబాదు

(తృతీయ ముద్రణము 1986 నుండి ఉద్ధరింపబడిన అంశములివి)



# కృతజ్ఞతలు

‘ప్రజ్ఞాప్రభాకరము’ 19–8–1986 తృతీయముద్రణంనాటి మా ‘మనవి’లో తలపోసిన “గురుపూజ అను విభాగముతో కూడిన ప్రజ్ఞాప్రభాకరము” నేటికిట్లురూపుదిద్దుకొన్నది. స్వామిసంకల్పమే కార్యరూపమునుదాల్చితి.తి.దేవస్థానము పాలకమండలి వారి పూనికతో ( 25–7–2007 నాటి269 తీర్మానము) “ శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి వాఙ్మయపీఠము” మేము కోరిన విధముగా ప్రత్యేక ప్రతిపత్తిగల సంస్థగా, తి.తి.దేవస్థానము వారి పాలనా పర్యవేక్షణలో రూపుదిద్దుకోవడము ముదావహము. ఇది గురుదేవుల ఆశయము నెరవేరుట! తెలుగువారు కన్నకలలు ఫలించుట!

శ్రీ వే.ప్ర.వాఙ్మయ పీఠమువారు చేపట్టిన గ్రంథముద్రణా కార్యక్రమంలో భాగముగా తొలుత ‘ప్రజ్ఞాప్రభాకరము’ స్వీకృతమై కొత్తపాతల మేలుకలయికతో సరిక్రొత్తరూపమున ఆవిష్కృతమగుట యోగవాఙ్మయ జిజ్ఞాసువుల కందరకును పరిపూర్ణమైన ఆనందమును కల్గించునని విశ్వసిస్తున్నాము.

ఇదేక్రమంలో శ్రీ ప్రభాకరుల వాఙ్మయరచనలన్నీ తి.తి. దేవస్థానములవారి నిర్వాహమున అనతికాలములోనే త్వరత్వరగా వెల్లడికాగలవని నమ్ముతున్నాము. స్వామివారి కృపకు అంజలి ఘటిస్తున్నాము. విశేషించి తి.తి.దే. పాలకమండలి అధ్యక్షుల వారికిని, శ్రీకార్యనిర్వహణాధికారి గారికిని కృతజ్ఞతాభివందనము లర్పిస్తున్నాము. శ్రమసాధ్యమైన గ్రంథముద్రణా వ్యవహారభారమును అన్య సహాయ నిరపేక్షంగా స్వయంగా సమర్థంగా పర్యవేక్షించిన శ్రీ వే.ప్ర.వాఙ్మయపీఠమువారి శ్రద్ధను కొనియాడుతున్నాము. ప్రత్యేకించి ఇప్పటి తి.తి.దే స్పెసిఫైడ్ అథారిటీవారికి మా కృతజ్ఞతాభి వందనాలర్పిస్తున్నాను.

హైదరాబాదు

**డా॥వేటూరి ఆనందమూర్తి**
శ్రీ.ప్ర.స్మారకట్రస్టు పూర్వాధ్యక్షుడు
శ్రీ వే.ప్ర.వాఙ్మయపీఠం ముఖ్య సలహాదారు

నేను వారి ననువర్తించు చుండెడివాఁడను. వైద్యులకుఁ గుదుర్పరాని రోగములతో బాధపడుచున్నవా రెందఱో శ్రీవారియోగచికిత్సవలన నారోగ్యము పడసి యానందముతో నుండుట నే నెఱుఁగుదును.

వారి యాధ్యాత్మికశక్తి యెంత పటిష్ఠమో తెలుపుట కొక సత్యసంభవము నుదాహరింతును.

అన్నామాచార్యుల ప్రథమ వర్ధంత్యుత్సవము తిరుపతిలో మహావైభవముగా సాగుచుండినది. మదరాసు ఉన్నత న్యాయస్థానమున ప్రధానన్యాయమూర్తులు శ్రీపాకాలవెంకటరాజమన్నారుగా రధ్యక్షత వహించిరి. రెండవదినమున సాయంకాలము శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి పాటకచ్చేరి జరుగుచుండినది. వేలకొలది జనము విఱుగబడి వచ్చియుండిరి. సభాస్థలము క్రిక్కిఱిసి యుండినది. వాతావరణ మల్లకల్లోలముగ నుండెను. కాఱుమబ్బులు క్రమ్ముకొన్నవి. తుఫాను వాయువులు వీవసాగినవి. ఉత్సవ ప్రాంగణ మంతయు దుమ్మెత్తి పోయుచుండెను. వేలకొలఁది జనము, స్త్రీలు, శిశువులు, వృద్ధులు పలువు రుండిరి. ప్రాణభీతి! సభలోఁ బెద్దగగ్గోలయ్యెను. రసాభాసమగు నని శ్రీ శాస్త్రిగారు వెంటనే లేచి మైకుదగ్గఱకువెళ్లి 'వర్షమురాదు! మన మందఱము నేకమనస్కతతోఁ బ్రార్థించుచున్నప్పుడు తద్విరుద్ధముగా వర్ష మెట్లు రాఁగలదు? మబ్బులు విచ్చిపోఁగలవు. గాలిహోరు తగ్గును. కూర్చుండుఁడు! వాన రాదు! రాదు! రాదు!'అని ముమ్మాఱు నొక్కి చెప్పిరి. ఆశ్చర్యము! శ్రీవారిదివ్యసంకల్పబలమేమో కాని వెంటనే మబ్బులు తొలఁగిపోయినవి. గాలిహోరు తగ్గినది. వర్షము రాలేదు. కచ్చేరి జయప్రదముగా సాగినది. వారియాధ్యాత్మికశక్తిప్రభావ మట్టిది! ప్రకృతివిజయ మన నిట్టిదియేకదా! అహో! యిట్టివి శ్రీవారి విషయమున మా యెఱుకలో నెన్నియో!!

అమృతతత్త్వసిద్ధికై సాధనము సలుపు నీయోగముయొక్క మహత్త్వము చెప్పనలవికాదు. యోగ మహిమమును గూర్చియు, తత్స్థాపకులగు గురుదేవుల దివ్యప్రభావమును గూర్చియు శ్రీశాస్త్రిగారు రచించిన యీ



గ్రంథము ముద్రిత మయిన యెడల నెందఱకో యీ యోగవిషయము తెలియగోరువారికి నుపకారముగా నుండు నని దీనిని బ్రకటింప నుత్సహించితిని. యోగవిషయము తెలియగోరువారి కిది మిక్కిలి తోడ్పడఁ గలదని నా విశ్వాసము.

శ్రీవారియోగానుభవములనుగూర్చియు దమకు, శ్రీవారితోఁ గల 'పరిచయ సందర్భములను గూర్చియు ననేకవిశేషాంశములు తెలుపుచు "శ్రద్ధాంజలి" వ్రాసిన శ్రీకొత్తవెంకటేశ్వరరావుగారికి మే మెంతయుఁ గృతజ్ఞులము. ఈ గ్రంథముద్రణ సందర్భమున శ్రీ శాస్త్రిగారి శిష్యులు శ్రీతిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు మాకు మిక్కిలి సహాయపడిరి. వారికి మా కృతజ్ఞత!

అలఁతి కాలములో ససిగా, సర్వాంగసుందరముగా అచ్చొత్తించి, యీ గ్రంథమును శ్రీవారి ప్రథమవర్ధంతినాఁటికి మా కందఁజేసిన 'వెల్డను ప్రెస్సు' వారి నభినందించుచున్నారము.

మదరాసు
ఖర
శ్రావణ బహుళ విదియ **కంభంపాటి సత్యనారాయణ**

*(ఈ గ్రంథము ప్రథమముద్రణమునకగువ్యయమును తామే భరించి, అమూల్యముగా ప్రకటించి, ప్రతుల నుచితముగా పంచి పెట్టెడు అవకాశము కలిగించిన ఉదారులు, శ్రీప్రభాకరుల శిష్యులలో ప్రముఖులు కీ.శే కంభంపాటి సత్యనారాయణగారు. వారి ఔదార్యమును మేమిట శ్రద్ధతో సంభావించుచున్నాము. సం॥)*

ఈ శిలా లోహ విగ్రహములే గాక శ్రీశాస్త్రిగారు కాళహస్తి సంస్థాన పురావస్తుభాండార మంతయు శోధించి, తత్సంస్థానాధీశ్వరుల యుదారానుమతితో ఎన్నో అముద్రిత గ్రంథములు, చిత్రములు, పూర్వపు వీరులు ధరించిన కవచ ఖడ్గాదులు సేకరించిరి. ఆంధ్రప్రభ సంపాదకులగు శ్రీనార్ల వారి సహాయమున బందరునుండి శ్రీకోటసుబ్బారావుగారలు బహుకాలము శ్రమించి సేకరించి, ప్రాణతుల్యముగ భద్రపరచుకొన్న అమూల్యచిత్ర ప్రతిమాదుల మ్యూజియమును తిరుపతికి తరలించిరి.

ఈ పని యంతయు నొక్కప్రక్క – మఱియొకవంక తిరుపతి దేవస్థాన ప్రాచ్యకళాపీఠ యాజమాన్యమున శ్రీఅన్నమాచార్య వర్ధంతి జరపుట, కీర్తనల ప్రచురణ, పావులూరి గణితము, ఉత్తరహరివంశము, లక్షణోద్ధారము, నన్నయకు పూర్వపు ఆంధ్రభాష ఇత్యాదుల పరిష్కరించుట, వ్యాఖ్యానించుట, సమకూర్చుట, పరిశోధించుట జరపుచు, నన్నిచోడుని కుమారసంభవమునకు వ్యాఖ్యానము రచించుటగూడ ప్రారంభించి, యీ కార్యముల నన్నిటిని నేకకాలమున సవ్యసాచివలె శ్రీశాస్త్రిగారు నిర్వహించిరి.

మ్యూజియము వస్తుసేకరణలో పెక్కు చిక్కు లుండెడివి. దారి డొంక లేని యొక కుగ్రామములో నొక చారిత్రాత్మక సుందర శిలావిగ్రహము కల దనియు, దానికై యెవరో బొంబాయి నుండి ధనవంతులు వచ్చిరనియు, ఆలస్యమైనచో తెలుగునాడు దాటిపోవు ననియు తెలిసెడిది ! సరి! అంతటితో శరీరశ్రమను లెక్క సేయక ఏదో రీతి నటకు చేరెడివారు శ్రీశాస్త్రిగారు. ఆ విగ్రహ మేపుంతలోనో పడియుండెడిది. పసులకాపరులు కత్తి నూరుకొనుటకో, బాటసారులు కాలిబాడి వదల్చుకొనుటకో అది ఉపయోగపడుచుండెడిది. త్రవ్వి తీయుటకు తోడుదొరకరు. వెలికితీసి దాని ప్రాముఖ్యమును దెలిపిన పిమ్మట ఊరివారు ఆ విగ్రహము నుంచుకొని మేమే ఆరాధించుకొందు మని యడ్డగింతురు. వారిని సమాధానపఱచి ఆయా వస్తువులను తిరుపతి చేర్చుట యన లక్క యింటినుండి ఏకచక్రపురము నకు చేరునంతటి కథ! ఈ పని నంతయు శ్రీశాస్త్రిగారు తమప్రియాంతేవాసులను, అందును ఉదయగిరి శ్రీనివాసాచార్యులను నూతగట్టిగా గొని ఏ డెన్మిది నెలలలో బహు స్వల్ప వ్యయముతో నిర్వహించిరి. వేరొకరైనచో మంది సిబ్బందులతో గూడియైన, ఎంత ధనమో వెచ్చించియైన, నిరువదేండ్లలోపున నైన ఈ పనిని సాధింప గల్గుదురా యని యెఱుకగలవార లచ్చెరువుఁజెందిరి.



ఈసందర్భమున నొకవిషయము స్ఫురణకు వచ్చుచున్నది. గుంటూరులో నొక నూత్న పరిచయునికడ శ్రీశాస్త్రిగారు కొన్ని గంటల కాలము వ్యయించి, ఒక చిన్న పాలరాతి ముక్కను తెచ్చిరి. దానిపై నేదో చెక్కడపు భాగము గలదు. ఆ రాత్రికే వారు తిరుపతి ప్రయాణము. సామానుల సర్దుగడలో దానిని మఱతు రేమో యని పలుమారులు సరిచూచికొనిరి. గాజుకుప్పెలను భద్రము చేసినంత జాగ్రత్తతో దానిని సర్దించిరి. మా కీయాందోళన బోధపడలేదు. “ఇది యమూల్య శిల్పము. దూబ్రేలు అయినచో దీనికి పదివేల రొక్క మిచ్చును’ అని రైలుకడఁ జెప్పిరి. ఈ చిన్న వస్తువు మాటయే యిటులుండ వారు సేకరించిన మ్యూజియమునకు విలువ గట్టుట యసాధ్య మని తోచును.

ఇప్పుడీ శిల్పకళాఖండము లన్నియు తిరుపతి దేవస్థానపు మ్యూజియములో మూగవోయి యున్నవి. వానికాలనిర్ణయముఁజేసి, వాని సాంఘిక రాజకీయ ప్రాధాన్యతను, కళాప్రాశస్త్యమును గుర్తించి, వానిని పలుకు బొమ్మలనుగా జేయుగురుతర బాధ్యత దేవస్థానము వారియెడఁ గలదు.

ఇటు మ్యూజియముకై తిరుగులాటతోను, అటు అపూర్వగ్రంథ సంస్కరణ ముద్రణముల యొత్తిడితోను నలిగులియై శ్రీశాస్త్రిగారి యారోగ్యము కొంత చెడినది. ఇంతలో గుంటూరు జిల్లా ఎద్దనపూడి యను గ్రామములో నొక బావిలో నేవో మహత్తరశిల్పములు గుప్తపఱుపఁ బడెననియు, వానిని సేకరింపవచ్చు ననియు, ఆసవెట్టి దుర్విధి శ్రీశాస్త్రిగారి నటకుఁ గొంపోయెను. జడివాన, మోఁకాటిబంటి నల్ల రేగడి బాడి, జోడెద్దులబండి సైతము నడువ వీలులేదు. కాలుదీసి కాలువేయ సాధ్యము గాదు. ఇట్టి మిత్తి యడక త్తెరలోఁజిక్కికొని అఱువదేండ్ల వృద్ధు, సుకుమార శరీరి, భారపుమానిసి యగు శ్రీశాస్త్రిగారు తీవ్రజ్వరముతో నింటికిఁ జేరుకొనిరి. అప్పటికే వారి యారోగ్యము పూర్తిగా చెడినది. దానిని లెక్కచేయక నిరంతరము మంచముమీఁదనుండియే చివరివఱకు వారిమామూలు కార్యముల నిర్వహించుకొనుచుండిరి. వారు తమయోగ మాహాత్మ్యమున పలువురను మృత్యుదంష్ట్రలనుండి వెలికి లాగిరి. అట్టి వార మనేకులము వారి చుట్టునుండియు తుదకు నా మహనీయుని దక్కించుకొన నేరమైతిమి. ఈ హతాద్వార్తవిన్న మహాకవి శ్రీవిశ్వనాథ సత్యనారాయణ గారు చకితులై ఇరువది పౌనుల తూకము

వారి నచట కలియుదు నని నే నెఱుఁగను. ఏదో పనియుండి చెన్న నగరము వచ్చి, ఆ క్రిందటి రాత్రియే వా రిటకుఁజేరిరట!

శ్రీశాస్త్రిగారు నేను వారింటికి చేరుసరికి దంతధావన చేయచుండిరి. అప్పటి కేడుగంటలు దాటియుండును. ఆసరికి వారు స్నానజపాదులను ముగించి యుందు రని తలచిన నా కిది క్రొత్తగా నుండెను. వారితో పరిచయము పెరిగిన పిమ్మట తెలిసికొంటిని. సాయంకాలమందు యోగచికిత్సకై వారికడ కేతెంచు నార్తులతో వారికి పెందలకడ తెమలదు. అందఱు వెళ్లినపిమ్మటగూడ చాలా ప్రొద్దు పోవువఱకు వారి వారి రోగ కారణాదుల నాత్మోద్బోధమున తెలిసికొనుటతో నిదుర యుండదు. ఒకప్పు డొక నిదురపోయి లేచి తెల్లవారు లాచింతతోనే కాలము గడపుదురు. ఇందుచే ప్రొద్దెక్కి లేచుట జరిగెడిది. వేకువనే ఆచారపరాయణుల వలె వేషము సవరించుట కెక్కడ? అన్ని ఆచారములను వారు జీవకారుణ్యయజ్ఞాగ్నిలో వ్రేల్చిరి.

దంతధావన చేసీ చేయుటతో నేఁదెచ్చిన కమలా ఫలములను రుచి జూచి, "బాగున్నవి! కాని లోన డొల్ల జాస్తి, రసము తక్కువ" యనిరి. ప్రతివస్తువును పరిశీలించి నాణ్యము తేల్చుట వారి కొక పరిపాటి.

ఆపిమ్మట నాకు యోగచికిత్స నిచ్చుటకు వారు సమ్మతించిరి. కాని ముందు నా భోజనవసతి యెట్లని యడిగిరి. హోటలులో నుందు ననఁగానే వారి కతృప్తి కలిగెను. హోటలులో ఆహారము ససిగా నుండదని వారి బెంగ. మామూలు సాంబారు మెతుకులు గాక మంచి నేయి, కూరలు, పాలు, పండ్లు తీసికొనవలె ననిరి. "ఈ యాహారముతో నీ జబ్బు కుదురుననుకొనవద్దు. కుదుర్చునది సర్వకర్త యగు నీశ్వరుడే! నీ శరీరపుష్టికి ఈ తిండి కావలయును" అని చెప్పిరి. నర్సింగుహోము సంగతి చెప్పగా అందు చేరవల దనిరి. వారి మాటజాడను బట్టి నా యనారోగ్యము చక్కబడు నని వారి తలంపుగా నేను గ్రహించి సంతసించితిని.

నా కంఠస్వరము బలహీనముగా నున్న దని వా రనిరి. ఆ మాట నాకు క్రొత్తగా తోచెను. కాని పూర్ణారోగ్యము బడసినపిమ్మట పోల్చి చూచికొనఁగా వారి మాట సత్యమని తెలిసికొంటిని. ఇది యెందులకు వ్రాసితి ననగా శ్రీశాస్త్రిగారు యోగచికిత్సకు వచ్చువారిని మొదటి చూపులోనే నిశితముగ పరీక్షింతురని చెప్పుటకే! వచ్చెడివారి ఆకారము, ముఖవైఖరి, మాటతీరు, కంఠస్వరము, అంగవిన్యాసము, వారు తెచ్చెడి కానుకలు మొదలగువానినిబట్టి వారివారి స్వభావములను, అనారోగ్యముతీరును శ్రీశాస్త్రిగారు గ్రహింతురు. వారియూహ తప్పగుట నే నెన్నఁడు చూడలేదు. ట్రీట్మెంటులలోనే గాక ఈ కుశలతను వారు నిత్యజీవితములో నొక వినోదముగా నవలంబించెడివారు. దస్తూరినిబట్టి స్వభావమును తెలిసికొనుట, జాబులపై పోస్టుమార్కులను చూడకుండ చిరునామా వ్రాసిన తీరునుబట్టి ఆ కవరు ఎచటినుండి వచ్చినదో చెప్పుట, ఒకప్పు డాజాబు చదువకయే అందలి విషయమును చెప్పుట మొదలగు చిన్ని చిన్ని వినోదవిమర్శలతో వారిచుట్టు నొక చల్లని ఆశ్చర్యకరమైన వాతావరణము కల్పించెడివారు.



ఆ తొలిపూట ట్రీట్మెంటులో నాశరీర మంతట ఒకశక్తి ప్రవహించిన ట్లుండెను. చెమట యోడికలు గట్టెను. హోటలుకు పోయి చక్కగా భోజనము చేయుమనిరి. సాయంత్రమువరకు కాల మెట్లు గడపెదవని యడిగిరి. క్రొత్తచోట నేమి చేయుటకు తోచక విసుగు చెందుదునని వారి యాందోళన! ట్రీట్మెంటుకు వచ్చినవారి శారీరక, మానసిక సౌకర్యములను గూర్చి అంత శ్రద్ధగా విచారించెడి వారు శ్రీశాస్త్రిగారు ! చికిత్సాకాలములో చీకాకులు లేకుండ ఆనందముగ నుండవలె నని వారి తలంపు, "ఏదో పుస్తకములతో కాలక్షేపము చేయుదు" నని నేనంటిని. శ్రీలక్ష్మీనారాయణగారు ఈయన మంచి చదువరి. అందుచే ఉబుసుపోక కేమి చిక్కులేదు" అని చెప్పిరి. దానికి శ్రీశాస్త్రిగారు "పుస్తకాలన్నీ కట్టిపెట్టు, భోంచేసి కమ్మగా నిద్రపో" యనిరి. శ్రీశాస్త్రిగారు బహుగ్రంథ పరిశోధకులు. కాని పుస్తకపాండిత్యముపై వారి కభిమానము లేదు. మన మనశ్శరీరములే సర్వరహస్యములను వెల్వఱించు పుస్తకములు. వానిని పఠించు తీరు అలవర్చుకొనుట మేలు అని వారి అభిప్రాయము. సాహిత్యమును గూర్చిన వారియూహలను తరువాత స్పృశించెదను.

సాయంత్రము తిరిగి నేను వచ్చినపుడు నా యాకలిని గూర్చి, భోజన పదార్థములనుగూర్చి, నిద్రనుగూర్చి, వచ్చునపుడు తీసుకొన్న పాలు, పండ్లను గూర్చి, శరీర స్థితిని గూర్చియు వివరము లడిగి తెలిసికొనిరి. నేను వారు చెప్పినట్లే నడచుకొనుటయు, నిద్రాహారము లమరుటయు గుర్తించి, బండి త్రోవను నడచుచున్న దని వారు తృప్తి చెందిరి.

జూచి యడలు గోమాతవలె క్షోభించిపోయిరి శ్రీశాస్త్రిగారు. ఇటు బాలునియవస్థ, అటు శాస్త్రిగారి యవస్థ చూడలేక పోయితిమి. ఆ బాలునికి లోని కాహార మేమియు ఇవ్వలే దని తెలిసికొని వాని తల్లిదండ్రులపైనను. వారి దరిద్రముపైనను కటకటపడి ఇంటిలోనుండి ఒక కప్పు కాఫీ తెప్పించి స్వయముగా చిన్ని చెమ్చాతో వానినోటఁ బోసిరి. ఆ పిమ్మట వాని యారోగ్యమునకై ధ్యానము చేసిరి. ఈసరికి ఆ బాలుఁడు ప్రక్కయానుదుతో ఒక విధముగ కూర్చుండ గలిగెను. అంతట శ్రీశాస్త్రిగారు వానిశరీర మంతయు నిమిరి సర్దిరి. వాడు సరిగా కూర్చుండ గలిగెను. చుట్టునున్నవారి మొగములు వికసించెను. ఇక వానిని నిలుచుండఁ జేసి నడిపింపవలెను. వానిని లెమ్మని చెప్పిరి. కాని వాఁడు తడువుకొనునే గాని లేవలేఁడు. డ్రిల్లు చేయువారి నాజ్ఞాపించు సార్జంటువలె నధికార గర్జనతో లెమ్మని తిరుగ ఆజ్ఞాపించిరి. అంతట వాఁడు లేచెను. అప్పుడు శ్రీశాస్త్రిగారి తీరు చూచి తీరవలెను! ఒక ప్రక్కయానందము ! మరొక ప్రక్కయాందోళనము! వాడు నడచిననే గాని వారికి తృప్తిలేదు. వాకిలివఱకు రెండు మార్లు వాడు నెమ్మదిగా నడచెను. తరువాత వాని నింటికి గొంపొ మ్మనిరి. వెనుకటి వలెనే తండ్రి వాని నెత్తుకొనఁబోయెను. శ్రీశాస్త్రిగారు వల దని వానిని నడిచియే ఇంటికి పొ మ్మనిరి. మే మందర మాశ్చర్యముతో చూచుచుండగా వాడు నడచి యింటికి చేరెను.

ఈ రీతిగా వ్రాయ మొదలిడినచో ఆ నలువది నాళ్లలోని ముచ్చటలే ఒక గ్రంథమగును. తరువాత నాల్గు సంవత్సరములకు నేను తిరుపతిలో శ్రీశాస్త్రిగారి పునర్దర్శనము చేసినపు డచటి సంరంభ మింతటికంటె మిక్కిలి హెచ్చుగా నుండెను. తిరుపతిలో ట్రీట్మెంట్ల పద్ధతి కొనసాగినతీరు చూడఁగా మానవకోటికి అమృతత్వసిద్ధి యబ్బనున్నది గాబోలు ననిపించెడిది. తిరుపతిలో నున్నపుడు జబ్బులను 'పో' యన్న పోవునట్లు తోచెడిది. కాని మదరాసులో చూడనిదుర్ఘటనలుకూడ తిరుపతిలో జరుగక పోలేదు. డాక్టరు లాస వదులుకొన్న చివరి ఘట్టములలో కొందఁ అచ్చటికి చేరినవారు కలరు. అట్టి వారినిమాత్రము మృత్యువున కేల వదలవలె నని శ్రీశాస్త్రిగారు సాహసించి ట్రీటు చేసెడివారు. వారిలో కొందఱు సురక్షితులై నేఁటికిని సుఖజీవనము నెఱపుచున్నవారు కలరు. కాని కొన్నింట ట్రీట్మెంటు వలన నుపయోగము కన్పించుచునే ఆయువు తీరెడిది. నూటికి నూరుగురను సాధ్యాసాధ్యదశలయం దన్నింటను రక్షించుటే



జరిగినచో నిక సాధన పూర్తియయినట్లే కదా! అట్టి శుభముహూర్త మిప్పటికి రాలేదు. ఎప్పటికి వచ్చునో!

ఆధ్యాత్మికశక్తివలన శారీరకరుగ్మతలు మాన్పనగు నని పలువురు విశ్వసింపరు. నమ్మకుండుటయే న్యాయ్యము. బలవత్తర ప్రమాణము లున్ననే గాని విశ్వసింప వీలుగాని క్రొత్తవిషయ మిది! తొలుత టెలిఫోను పద్ధతిని ప్రదర్శించినప్పుడు అచ్చటనున్న ఒక గొప్ప రాజకీయవేత్త దాని నొక గారడీ యని నిరసించె నట! తాను మాటాడుచు, ఆ కంఠధ్వని మఱొకరినుండి వచ్చుచున్నట్టు చేయు కళ అనె నట! పాశ్చాత్యభౌతికశాస్త్ర పరిశోధకులు. క్రొంగ్రొత్త విషయములను కనిపెట్టినప్పుడు పలుమారులువారి నప్పటి పండిత ప్రపంచము నిరసించుటయో, హింసించుటయో జరిగెడిది. గెలీలియో నుండి జగదీశబోసువఱకు శాస్త్రపరిశోధనాచరిత్రలో నిట్టి సన్నివేశములు పెక్కుగలవు. కాని అభూతజ్ఞాతములగు విషయములను సునిశితముగను, పలుమారులును సంశోధింపకయే యొప్పుకొనుటవలనగూడ ఒప్పమి గలదు. ప్రత్యేకించి ఆధ్యాత్మిక ప్రపంచమునకును, భౌతిక ప్రపంచమునకును నిచ్చెనలు వేయుపని చాలా ప్రమాదభూయిష్ఠమైనది. మార్గమా క్రొత్తది. దారి చూపువారా లేరు. ఈ దారి యెటకు గొంపోవునో తెలియదు. మన యాయుష్కాలములో గమ్యస్థానమును చేరగలమో లేదో తెలియదు. అందుచే నీ రంగములోని యన్వేషకునకు

"అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతి ర్గమయ
మృత్యో ర్మామృతం గమయ" (బృహ. ఉ. 1-3-28)

అను నిత్యపథికుని ప్రార్థన మొక్కటే తోడు.

క్రీస్తు ప్రభువుగూడ ఆత్మశక్తిచే అనేకులను నిరామయుల నొనర్చె నని విందుము. క్రైస్తవులలో నిట్టి నమ్మకమును, అనుభవములును నేఁటికినిగలవు. సెంటు బొర్నాడొటే గీతము (The Song of St. Bernadotte) అను నవలలోని వాస్తవిక కథయంతయు నిట్టిదే. ఫ్రాన్సులోని LOURDES అను పట్టణములోని మఠమువద్ద నిత్యము అనేకదేశములనుండి రోగులు వచ్చి, ప్రార్థనలో పాల్గొని నీరోగు లగుదురట! అచట ప్రవేశము బడయునపుడే

తుదకు సాహిత్య విమర్శయందును, చరిత్రపరిశోధనమందును కల్గు ఈర్ష్యాద్వేషాదులను రోసి, వారు వానిని వదలి, తమ జీవితమును మానవసేవకే అంకితము జేసిరి. ఆ సందర్భమున వారు చెప్పిన పద్యములు

*"కవితాశిల్పము సల్పఁగాఁ దొలుత వేడ్కల్ రేగె నాకున్, గృతుల్*
*చివురెత్తెన్, వెస మోము మొత్తె, నిఁక నాచేఁ జెల్ల వీకల్ల బొ*
*ల్లి వినోదంబు, లవే జరామరణముల్ చీడల్ హతంబార్చి పు*
*ట్టువు చెట్టున్ సఫలీకరించుకొని యంటుల్ గట్టెదన్ మాలినై.*

*త్రికరణశుద్ధిగా భవదధీనుఁడనై యితరప్రవృత్తి వీ*
*డికొని పరార్థలాభ మొకటే గమనించుచు నుందు, నింక మా*
*యికము ధనాదికమ్ము గణియింపను, సత్యదయోపకార సా*
*ర్థక మగునాత్మచింతన పథంబునఁ దప్పి చరింప నీశ్వరా!"*

శ్రీశాస్త్రిగారు కల్పనాసాహిత్యమును నిరసింతు రనియు, సాహిత్యమున సైతము కరుణను, నీతిని ప్రధానముగా నెంతు రనియు, సాహిత్యకృషియే వీడి రోగులను ట్రీట్మెంట్ చేయుటతో కాలము గడపెద రనియు వ్రాసిన దానినిబట్టి వారి సాన్నిధ్యమున నుండుట యన శుష్క వేదాంతములతో నీరసజీవనమును గడపుట యని తలపోయరాదు. ఆయన నిజముగా సత్యాన్వేషి! కళారాధకుఁడు! ఉత్సాహజీవి! వారిప్రతిపనియందును ఈ గుణములు కన్పించుచుండెడివి. రకరకముల రంగుపెన్సిళ్ళు, కలములు, చేతికఱ్ఱలు, వింతవింత వస్తువులు సేకరించుట యందు వారికి ప్రీతి యెక్కువ. ఈ పెన్సిళ్ళను సేకరించుటే వారి వంతు గాని వాడుకొనుట యందఱివంతు! ఇట్లే ఫౌంటెన్ పెన్నులు. దేనితో వ్రాసిన దస్తూరి సొంపుగా నుండునో యని చూచెడి వారు. చుట్టునున్నవారు తమతమ పెన్నులతో పోటీపడెడువారు. చిటికెన వ్రేలంతటి కొబ్బరికాయల నెచటి నుండియో తెప్పించి వానికి వెండి పొన్నులు, మూఁతలు చేయించి స్వయముగా మెఱుఁగు వెట్టి స్నేహితులకు బహూకరింతురు. ఇట్టిది నాకొకటి ఇచ్చిరి. నేను నశ్యము వాడనుగదా యని సందేహించితిని. నశ్యమునకైనచో వా రాపనిచేయరు. ఆకాయలో దూదిపెట్టి అందుమంచి యత్తరు గాని యూడికొలోంగాని వేసి, వాసన చూచుకొనవచ్చు నని వారు సలహానిచ్చిరి. ఇట్లే అనేకరకముల చేతికఱ్రలను వారు స్వయముగా మెఱుగుపెట్టి స్నేహితుల కిచ్చెడివారు.



తాటిచేవతో చేయబడి గుర్తింపరానివి, పామువలె ఏ డెనిమిది వంకరలు తిగినవి, పెద్ద పెద్ద వెండిపొన్నులతో మెఱయునవి యగు రకరకముల కఱ్రలు వారికడ నుండెడివి. ప్రార్థనా మందిరములో కూర్చుండుటకు రకరకముల పొడల జింకల చర్మములు, పెద్దపులిచర్మములు తెప్పించెడివారు. వారికడకు తెలఁగునాటి నాలుగు మూలలనుండి అన్ని వర్ణములవారును, అన్నితరగతుల వారును వచ్చెడివారు. వీరందఱిని తమవచశ్చమత్కృతితో నలరించెడివారు. మరియువారు వారు వాడిన క్రొత్త మాటలను గూర్చియు, వాని ఆనుపూర్విని గూర్చియు అప్పటికప్పుడే ఫైలాలజీని నిర్మించెడి వారు. దోసె అనగా రెండు చేతుల వెడల్పుగల దనియు దో=రెండు+సెయ్= చేతులు, అరసె యనగా అరచేతి వెడల్పుగల దనియు (అర +సెయ్) అనియు నా భక్ష్యములకు క్రొత్త రుచి కలుగునట్లు చెప్పిడివారు. ఇఁక పండ్లుకోయదగిన పరువములు, వాడఁదగిన రీతులు, కూరల రుచులు బహుపరిశీలనతో చెప్పెడివారు. గుంటూరు, కృష్ణాలలోని గోగుపచ్చడిని గూర్చి 'కడుపుతీపు' అను చిన్న పద్యకావ్యములో వారు ఇట్లు వ్రాసిరి.

"పయరకూర వేచి పచ్చి మిరెపపండ్ల నుక్కళించి పోసి యూరనిచ్చి ,
కొంత గొంత పొగిపికొను గోఁగుఁబచ్చడి చవికి నింక నోరు చివికితీరు."

ఈ యోగసాధకులకు పుష్టికరమైన యాహారము అవసరము. ట్రీట్మెంటు చేయువారికి ఈ సౌకర్యము మిక్కిలి యవసరము. కాని మదరాసులోనున్న ఆరోజులలో శ్రీశాస్త్రిగారికి ఏఁబదిరూకల వేతనము, పెద్ద కుటుంబము. ఆపైన వచ్చిపోయెడివారు. సగము పైగా యింటి అద్దెకే ఖర్చు. ఇక బియ్యము, పప్పు,కూరలు,పాలు, నెయ్యి, కట్టెలు, బట్టలు. అహో! నిజముగా నివి యన్నియు శాస్త్రిగారి కుండెడివా? ట్రీట్మెంటుకు వచ్చిన వారివద్ద చిల్లిగవ్వ పుచ్చుకొనరు. ఎవరైన నాలుగుపండ్లుతెచ్చిరో వారికనుమానము!ప్రతిఫలము పుచ్చుకొని ట్రీట్మెంటు చేయుమను చున్నారని, తెల్లవారుసరికి, సాయంకాలమగుసరికి ట్రీట్మెంటు వేళకు దహదహ మని యాకలి! యోగసాధనకన్న నాకు చూడగా వారి సంసారసాధనయే కష్ట మనిపించినది. ఆపేదఱికము గూడ వారిని భగవదభిముఖులనే గావించెడిది .ఇన్ని చిక్కులలోను వారు చలింపక "భారములన్నియు నీపైనవేచి నిర్భయుడనై యున్నానులే" అనియో, "తరముగాని యెండవేళ కల్పతరునీడ దొరకినట్లాయె

శ్రీ శాస్త్రిగారివలెనే పలువురు భృక్తరహిత తారక రాజయోగమున దీక్షబడసిరి. వారెవరుగాని ఇంతటి పట్టుదలతో, విజయవంతముగా నిత్యము ట్రీట్మెంటు చేయుట నేనెఱుఁగను. వారిలో కొందరికి ట్రీట్మెంటు పద్ధతిని గూర్చి వేఱు అభిప్రాయములు గూడగలవు. ఒకటి-ట్రీట్మెంటు చేయు వారాపదల పాలగుదురు. రెండు-ఈయోగము ట్రీట్మెంటులకై ఏర్పడలేదు-అని వారి మతము. ఈవిషయమై శ్రీ శాస్త్రిగారి వలన తెలిసికొన్న దేమనఁగా:

**ఒకటి:-** ట్రీట్మెంటు పద్ధతికి మూలసూత్రము పరుల యార్తినిగూర్చి ఆపుకోలేని యనుతాపము. ఆ బాధ తనకే కల్గినదా యన్నంత వగపు. ఆ యనుతాపమే బాధితుల యార్తిని దీర్చును. ట్రీట్మెంటు సలుపువాఁడు "ఇదిగో! చూడు ! నేనొక మంత్రము వేయుచున్నా " ననుదృష్టితో నున్నచో నది సాగదు. ట్రీట్మెంటు పడయువాఁడు " ఏదీ! నాపై నీమంత్రము ప్రయోగింపు చూత" మను తీరున నుండరాదు. అట్టిచో నేమియు జరగదు.

ప్రథమమున శ్రీ శాస్త్రిగారితరుల బాధను గూర్చి తపించుటేగాని, అందువలన ప్రయోజనముండుననిగాని, రోగనివారణ జరిగినదని గాని గమనించలేదు. కాని కొన్నిమారులు తీవ్రానారోగ్యముచే బాధపడువారిని జూచి శ్రీ శాస్త్రిగారు దుఃఖితు లగుటయు, అతిశీఘ్రముగ వ్యాధి నివారింవబడుటయు గమనించి, నిర్హేతుక జాయమానమగు అనుకంపమే సర్వరోగనివారక మని తెలిసికొనిరి.

మఱియు స్వపర భేదములను పాటించినచో ట్రీట్మెంటు పని చేయదు. మానవుల నందఱను నేకకుటుంబముగ జూచు సమత్వబుద్ధి యేర్పడినకొలఁది ఈ ట్రీట్మెంటు విధాన మద్భుత ఫలితముల నిచ్చును. ఈ యోగము ననుసరించు వారు పలువురున్నను నీ ప్రత్యేకార్హత శ్రీశాస్త్రిగారికే యబ్బుటకు కారణము వారి అపారకరుణాస్వభావమే! కాని ట్రీట్మెంటు చేయువారికి ఆయారోగులబాధలు శారీరకముగా ఛాయామాత్రము కల్గుటయు, నిజమే! 1926 ప్రాంతములో శ్రీశాస్త్రిగారు బాహాటముగా, నిత్యకృత్యముగా ట్రీట్మెంటు నవలంబించినపుడు పలువురుమిత్రులీకారణమును జూపి వారింపఁజూచిరట! ఆనాఁటిధ్యానములో శ్రీశాస్త్రిగారు తమ గురుదేవులతో నీరీతి విన్నవించిరట- "నిజముగా పరులబాధ తొలఁగి ఆ కారణమున నాకు బాధ కల్గినను సమ్మతింతును. ఆతొలఁగించనది నేను కాదు. నా వెనుక నీవే దాగియున్నావు. సర్వ దయామయుఁడ వైననీవు నావలన పరులబాధలను తొలగించి నన్ను బాధలో ముంతువని నేను వెరతునా? నీ వెనుక నేను దాగనేరనా?" ఈ విషయమునే దెలుపుచు శ్రీ శాస్త్రిగారు రచించిన పద్యములు:



*"స్వామీ ఆంతరనిలయా స్వయం వ్యక్తమై వెలయ*
*నాయజ్ఞానావరణము నాశముఁ జేయు మహాత్మ*
*నే నను నాయధమాధమ నిర్వాహము తొలగించి*
*నీలో నను గలుపుకొని నెగడగదే పరమాత్మా,*
*నాలో గల వని యెఱుగక నానాబాధల పడితిని*
*త్రో వెతిగితి నిప్పటికి దుఃఖము తొలగెను దేవా.*
*దేవర నా కీదేహము దేవళమై వెలసినది*
*చక్కగ నెలకొని విశ్వస్వామిత్వము నెఱపగదే!*
*అద్దమువలె దేహం బిది యమలినముగ జేసికొని*
*నిద్దపునీతేజము జగదుద్దీప్తము చేయగదే !*
*అనుక్షణము త్వన్మయతాహ్లాదము హెచ్చెడువిధమున*
*క్షణక్షణము మన్మయమై జ్వలియింపగదే దేవా!*
*అహంకార మమకారము లడగార్చి క్రమక్రమముగ*
*కరగజేసికొని నీలో కన్నతండ్రి! గడతేర్చుము.*
*నాచాటున డాగియె దోబూచులాడు చున్నావా?*
*చూచితి నిక నే నేమఱ నీచాటున డాగెదను.*
*వెను కదుగిడ నిక నాథా! వెఱపు జెంద నిక నాథా!*
*కడ తేఱెద నిక నాథా! కల్యాణం బిక నాథా"*

ఆ నాఁటి నుండి శ్రీ శాస్త్రిగారు దేహమును వీడు తుదిక్షణము వఱకు నేక దీక్షతో ననేక భయంకర జాడ్యములను మాన్చిరి. నిజముగా ట్రీట్మెంటువలన నెట్టి యపకారమైన జరగియే యున్నచో వారు భౌతిక కాయము నెన్నడో వీడి యుండవలసినది. క్షయ, జలోదరము, ఉబ్బసము, మెనింజైటిస్, గుండెజబ్బు, పాముకాటు మున్నగు ఉపద్రవముల నెన్నింటినో వారు చక్కబరచిరి. ఈ యోగ చికిత్సావిధానమున వారికి పాతిక సంవత్సరములకు మించిన యనుభవము గలదు. అందు వారే పరమ ప్రామాణికులు!

నమస్కరించిన వారికి బ్రహ్మజ్ఞాన మిత్తు నని వారిప్రతిన. బ్రహ్మైక్యమును పడయవలసినది ఏదో సమాధిదశలోనో లేక దేహము విడచిన పిమ్మటనో గా దనియు, ఈ ప్రజ్ఞతోనే ఈ లోకముననే ఈ దేహముతోనే యనియు వారి మతము. వీరు చెప్పిన వానిని బోలినకొన్ని విషయములు పూర్వగ్రంథము లందుండవచ్చును. కానీ వీరు ఏ గ్రంథముపైనను ఆధారపడి యీ యోగమును ఆరంభింపలేదు. అది కేవలము నూతన సృష్టి! వీరు సర్వస్వతంత్రులు ! మిగుల మహిమాన్వితులు! వీరి నీ మండలి వారు సాక్షాత్పరబ్రహ్మముగా తలంతురు.

పూజ, భజన, హారతి మొదలగు బాహ్యచిహ్నము లేవియు వీరు వల దందురు. వీరిని తలంచి నమస్కరించినచో శరీరములో యోగక్రియ ఆరంభమగును. సాధకునివంతు సాక్షిమాత్రముగ తనలో జరుగు మార్పులను గమనించుటయే. ముద్రలు గాని, ఆసనములు గాని, ప్రాణాయామముగాని, హఠయోగాభ్యాసము గాని అక్కఱ లేదు. వానిని నిషేధింతురుగూడ! అభ్యాసకాలమున ప్రజ్ఞ సాధకుని స్వాధీనములోనే యుండును.

ఆహారవిషయమున కఠిననియమము లేవియు లేవు. శరీరమునకు చల్లదనమును, పుష్టిని కల్గించు సాత్త్వికాహారము తీసికొనవలెను. సాధనకై ఇల్లు వాకిలి వదలరాదు. సన్యాసము పనికిరాదు. ఎవరివృత్తి వారు సాగించుచునే సాధన చేయవలెను. సాధకులు త మ్మితరులు గుఱితించుటకై ఎట్టియార్భాటమును ప్రకటింపరాదు. ఈ సాధనవలన అనేక మహత్తులు లభించును. వీని నెన్నఁడును దుర్వినియోగము చేయరాదు. మఱియు అవి ప్రధానములును గావు. ఈ యోగ గౌరవమునకు తగినట్లు సాధకులు తమ ప్రవర్తనను నీతి మార్గమున నడిపించుకొన వలెను.

ఇంకను ఈ యోగమును గూర్చి వ్రాయఁదగిన దెంతయో కలదు గాని ప్రస్తుతమున కింతయే చాలునని విరమించుచున్నాను.

గుంటూరు **కొత్త వెంకటేశ్వరరావు**
ఖర
శ్రావణ శుద్ధ బహుళ

# మలిపలుకు

మీది విషయ మంతా 30 ఏళ్ళ క్రిందట వ్రాసినది. అప్పుడు నా వయసుముప్ఫైయెనిమిది. ఆధ్యాత్మిక మార్గాన నన్ను తీర్చిదిద్దిన పూజ్య గురువర్యుల సంతాపకరమైన హఠాన్మరణ సన్నివేశము నేను దగ్గర ఉండగా జరిగినదే. కనుక అప్పట్లో చకితుడనై నేను వ్రాసిన వ్రాతలో ఎక్కడైనా ఒకటి రెండు పంక్తులు కొద్దిగా అతిశయోక్తులేమో అనుకోదగిన రీతిని దొరలితే దొరలి ఉండవచ్చునేమో గాని మొత్తం మీద ఈ ముప్పది యేండ్ల తర్వాత నా అరవై యెన్మిదవయేట దీనిని తిరిగి చదివి చూచుకొన్నప్పుడు అంతా చాలా మట్టుకు యధార్థమే అని ఇప్పుడూ తోస్తున్నదని వినయపూర్వకంగా నివేదించుకొంటున్నాను. నా ఆధ్యాత్మిక గురువులై న శ్రీవారి యోగచికిత్సా విధానపు మహిమకు, అది నేటికి కొనసాగుతున్న దన్న యాథార్థ్యమునకు, వారి శిష్యగణములో తిరుపతిలోని శ్రీనివాసాచార్యులు గారిని, గుంటూరులో రామకోటయ్యగారిని ప్రమాణముగా ఉదాహరింప వచ్చును.

శ్రీ శాస్త్రిగారనుసరించిన ఈ నూతన యోగ విధానమును గూర్చి మరి కొంత యేదైనా వ్రాద్దామనే ఉబలాటాన్ని నేను ప్రయత్నపూర్వకంగా అణచుకొంటున్నాను; ఎందుకంటే ఈయోగం అతీత కాయ కల్ప సిద్ధిని, ఐహిక అమృతత్వాన్ని, పరిపూర్ణప్రజ్ఞను ప్రసాదించడమే లక్ష్యంగా కలదని యెరుగుదుము గాని అంతకన్నా అధికంగా మాకెవ్వరికీ తెలిసినవిషయం కాదు. అంతేకాక ఈ నవ్య యోగ మార్గ ప్రవర్తకులు కూడా సంపూర్ణావగాహన లేనిదే దీనిని గూర్చి ఏమీ వ్రాయవల దని ఆదేశించారుట కూడా! ఆ మార్గాన సాగుతున్న సాధనకన్నా మించిన అభివ్యక్తి ఆవిషయమై మరొకటి ఉండబోదు.

చివరగా ఇక్కడ శాస్త్రిగారి సహధర్మచారిణి జీవిత భాగస్వామిని, అయిన మాతృశ్రీ మహాలక్ష్మి అమ్మగారికి కృతజ్ఞతా భక్తి పూర్వకమైన శ్రద్ధాంజలి నర్పించి నా ఋణమును తీర్చుకోవలసి యున్నాను.

రేయింబవళ్లు శ్రమించి ఆ యిఁటి నొక ఆశ్రమంగా చేరవచ్చిన విభిన్న ప్రకృతులు గల శిష్య గణాన్ని మాతృప్రేమతో అదరించి అన్నమిడి ఆదుకొని నలుబదియేండ్లకు పైగా శాస్త్రిగారికి సహధర్మచారిణియైన మాతృమూర్తి ఆ తల్లి. ఒడుదుడుకులైన ఎన్నో అనుభవాలను నిబ్బరంగా

ప్రజ్ఞా ప్రభాకరము మాస్టర్ యోగోపదేశాన్ని, మాస్టర్ యోగాను భూతిని సాధకుని హృదయక్షేత్రంలో అక్షరరూపాన నిక్షేపించడాని కవతరించిన సాహిత్యసర్వస్వము.

*"నన్నున్ వర్ణన సేయఁగా వలవ దన్నా! కన్నయందాఁక; మీఁ*
*ద నీ వర్ణన మెందు; కిందులకుఁ గొందాఁకం బ్రతీక్షింపు; మం*
*చు న్నన్గూర్చిన యుష్మదాజ్ఞకు నెదుర్పూపై గృహద్వారమం*
*దున్నాఁడం గనరాఁగదే కనుట కర్హున్ నన్నుఁ జేయంగదే"* (వే.ప్ర)

అన్న తీరున ప్రభాకరులు ఆ " ఎదుర్పూపు" తోనే తమ ముప్పది యేండ్లకు పైపడిన యోగసాధన కాలంలో మాస్టర్ యోగాన్ని గూర్చి వ్రాయడం గాని, యోగోపదేశాన్ని ఇతరులకు చేయడంగాని తాము చేసియుండలేదు. 1948లో తమ షష్టిపూర్తినాడు శ్రీ ప్రభాకరులకు ప్రాతరుపాసన సమయమున గురుదేవుల యాజ్ఞ తెలియనయ్యెను. "నన్ను గూర్చి వ్రాయగల యోగ్యత నీకు గలిగినది" అని శ్రీవారుద్బోధించిన విషయ మనుభూతికి వచ్చినది.

*"వచ్చెను నేఁటి కర్వదగు వర్షము పుట్టువుఁదొట్టి, గర్భముం*
*జొచ్చుట దొట్టి నాకరయఁ జూచిన నేఁటికె షష్టిపూర్తి యీ*
*వచ్చినయేడు నిండిన ధ్రువంబుగఁ గాఁగల షష్టిపూర్తితో*
*నిచ్చుట నాకుఁగావలయు నిష్టికిఁబూర్తియు సృష్టిపూర్తియువ్"*

అని విశుద్ధముగా తలపోసి ప్రజ్ఞాప్రభాకర రచనకు వారు తొడగినారు.

*"సీ.వీ.వీ కరుణాకటాక్షములు రక్షించున్ సదా తన్మయం*
*బై వర్తిల్లెడు భక్తి యున్న యెడ నిత్యానంద మారోగ్యమా*
*హావుట్టించెడు ప్రజ్ఞ యీ త్రయము లభ్యంబౌను; తార్కాణ నే*
*నే! వేయేటికి? మీర లిందఱును దీనిం జక్క గుర్తింపరో!"*

అని సప్రమాణముగా వారీ ప్రజ్ఞాప్రభాకరమున తమ అనుభూతిని ఉపదేశమును సీ.వీ.వీ కరుణాకటాక్షమున సమన్వయించి చూపినారు. 'మీర లిందఱును దీనిం జక్క గుర్తింపరో' అని ఆదేశించినారు. గ్రంథరచనము 'నాడీగ్రంథము' అను ప్రకరణము వఱకును సాగినది.



అయ్యో! ఈ గ్రంథమసమగ్రముగా నాగెను గదా అని పైపాటున చదువరికి తోచవచ్చును కాని 'దీనిం జక్కగుర్తించి' నపుడు గ్రంథ మసమగ్రమగు ముగింపుకలది కా దనియు, సర్వసమగ్రమగు మాస్టర్ యోగ మార్గమున ప్రవేశార్హత (Initiation) ను ప్రత్యక్షముగా కల్పించు నీ "ప్రజ్ఞాప్రభాకరము" సాధకుని హృదయమున గలుగవలసిన ప్రజ్ఞా సమున్మేషమునకొక యుపక్రమము మాత్రమే అనియు తెలియుచున్నది.

మాస్టర్ యోగ మిది యొక నూతన ప్రయోగము. పరబ్రహ్మాంశ రూపులగు మాస్టర్ సీ.వీ.వీ ఈ యుగమున ఈ రాజయోగము నుపదేశించిరి. వారి వాక్కు స్వతఃప్రమాణమై, వారి సాధనానుభూతి యోగమై, వారి యునికి లోకతారకమై నెగడినది. "సీ.వీ.వీ" అను శ్రీవారి నామాక్షర త్రిపుటియే సర్వ మంత్రరాజమై విరాజిల్లినది. జరుగ వలసిన లోక కల్యాణమున కామంత్రమే ఆదిమూలము. తార్కాణగా నిలచి సాధకులకు పథము నిర్దేశించి ఉపదేశ మొసగుట కవతరించిన ప్రజ్ఞాప్రభాకరము తన్మూలము ననుసరించిన వ్యాఖ్యానము.

"నా మాటలు స్వతః ప్రమాణములుగాని పరతఃప్రమాణములు గావు."

"నేను సదా నీలో నుందును. నీకు కావలసిన సహాయమును నీలోనుండి జరపుచునే యుందును."

"బండి నడచు చుండగానే రిపేరు సాగవలెను. బండి ఊడదీసి చేయుచో బండివాని జీవిక చెడును. అట్టిది నా యోగ మార్గము."

"ఈ యోగమున నెవడుగాని ప్రత్యేకముగా కడతేర జాలడు. తాను, తన చుట్టుపట్టులవారు, తన యాప్తులు ననుక్రమమున ప్రేమ వ్యాపకమగు తీరు ననుసరించి తాను తన చుట్టుపట్టులవారు, తన యాప్తులు ననుక్రమముగా లోకము నంతను బ్రేమించి లోకమునంతను గడతేర్చువాడు కావలె. తన ప్రేమ సర్వలోక వ్యాపకము కానంత వఱకు నెవ్వడుగాని కడతేరజాలడు. ఆఖండము, సర్వవ్యాపకమునగు తత్త్వమును బడయుటకు తాను నఖండుడు,

# CVP's Test

## TEST

Test on prabhakara Sastry by C R. 23. 6.1916 ; 9,17 A.M. Boring No.2. Breathing No.31. From 11.9.13 by Planet Sukra in its ray during its breathing 41.

The figure appears in its own natural colour and with a little healthy constitution in erect sittng posture with smiling face. His penial gland is greenish and is marked by 2 diagonally passing yellow lines. It is often suppressed by a strong vapour emanating from Hithu portion with green mixed yellow tint and rose border with such a force as to cause sudden shaking to the penial gland and this occurs occassionally. A rainbow coloured light with a candle flame like light in the middle which is internally pierced by white sparks which eminate upwards to come from his para Nirvanic Centre. His Hithu is not yet formed. His whole skeleton is not yet condensed and is yet dim white in colour and flexible. Two sets of wasted nerves of sympathetic chains with fever ganglia at the neck portion uvevenly distributed and the whole spinal nerves with such growths as to appear to be temporarily wasted from natural condition. The ganglia at mental and astral are also very unevenly distributed and very small in size. The chief centre of the nervous system at the Medulla has some of its epithelial cells at the motor generating centre, by the radiation of the above mentioned vapour from Hithu, has semi paralysed and displaced from their original position. Hence it has lost all sensory and motor control over the whole body which has more of sensory portion in actual work than of motor by the above wastage and has become very sensible to all kinds of vibrations and when affected by any sort of mental anxiety of thought working, it upsets the whole system causing a melting at the chief nervous centre which causes a shaking throughout the main system producing temporary giddiness, semi unconscious state, fear and failure of auditory and optic nerves, and he loses all control of thought and becomes as if a new man during such hours which continued for a short period only but occurs very often.

It makes him unfit for any work and even for taking his meals and thus a feeling of apprehension prevails and he thinks his life is a burden is in a position not knowing how to act. By this nervous debility, heaviness at chest and hard breating, improper circulation even in ordinary meals are caused. By the failure of the Motor nerves on the muscular walls of the stomach bile is produced in large quantity and constipation is caused.

Urine too will be uneven in quantity and number varying from a large number of even less than minimum. This affect will also cause pain and swelling in the seed nerves also causing much anxiety and unbearable condition. The interior of his spinal column is filled with yellow tinged semi liquid mucus.

This soul is an ordinary type of the first sort and has passed 1731 births and is in the ladder acquiring gnana with Bhakti and though studied much in this birth and able to argue in bits in philosopy he has no practical knowledge of any theories nor does he like to go in for any. He was a prey to his present disease for the last three years which has grown up very gradually and he was seeking relief for his complaint at this stage being informed of the existence and curative power of this society he was advised to seek help since which only can give him remeady and with this idea he was brought up here. From this first idea, the second thought extended that after being relieved from his ailments and seeing the result to request afterwards if there is any way for salvation. With this idea he joined the society and if he finds any relief even minutely, he will work with faith and will follow instructions.

***C.V.V***

నమస్కారము

# ప్రజ్ఞాప్రభాకరము

*శ్రీ నిరంతరానందనిశ్రేయసార్థ*
*సాధకము, సర్వకిల్బిషబాధకము, స*
*మగ్రవిజ్ఞానదము, మహామహిమఘనము*
*శరణ మగు మాకు సద్గురుచరణయుగము.*

## 1
## ఉపక్రమము

సత్యజ్ఞానానందాత్మకమగు పరతత్త్వము తత్ప్రతికూలగతితో అవివేక జీర్ణారణ్యమున జిక్కి చీకాకు పడుచున్న యనదను నన్ను త్రోవకు దెచ్చి కాపాడిన తీరును మిత్రగోష్ఠిలో విన్నవించుకొనుటకొఱకే నా యీ గ్రంథ రచన ప్రయత్నము. దీని రచనమున నాకు పురుషోత్తముఁడగు గాంధి స్వచరిత్ర రచనా విధానము దారిదివ్వె. గులాబి మొగ్గను గడుపునఁ బెట్టుకొని దాని గ్రమ్ముకొని కఱకు నూగు తొడిమ ఱేకే తొలుత గానవచ్చినట్టుగా ఉపక్రమమున నిందు ప్రభాకరనామకుఁడ నగు నేనే కానవత్తును గాని, నాలోని దివ్య తత్త్వపుఁ బూవు వికాసము చెందిన పిదప, నది సువాసనను సౌకుమార్యమును వన్నెలను వెలార్పఁ జొచ్చిన పిదప, దాని గొని యానందింపఁ గోరువారికి నేను తత్ప్రదర్శకుడను గానే, యంగుళీగ్రాహ్య మగు తొడిమనుగానే యడుగునఁ బడియుండి కానవత్తును. అప్పుడిది ప్రజ్ఞా చరిత్రమే కాని ప్రభాకర చరిత్రము గాదు. ప్రభాకర చరిత్ర మయినను ఆ ప్రభాకరుడు తొల్లింటి నేను గాక వేఱొకఁడే.

*పరుషము నిష్ప్రయోజన మబద్ధ మనార్యము చేరరాదు నా*
*విరచనలందు, డెందము పవిత్రముగా విలసిల్లి సత్యసుం*
*దరము పరార్థయుక్త మగుతత్త్వమునే వెలయింపఁగావలెన్,*
*గురుచరణారవిందములకుం బ్రణమిల్లెద నట్టి నేర్మికై.*

# 3
# బాల్యస్మృతులు

ఒకనాఁడు తోడిబాలురతో గోచికూడ లేక వీధిలో చింపిరి కాగితముల నేతియేదో పిచ్చిచదువు చదువుకొనుచుండఁగా నన్నుఁజూచి పుణ్యమూర్తి కొట్టరుపు సుందరరామయ్య పంతులుగారు (వారు మా యూర నేఁబది యేండ్లకుఁబైపడిన కాలము బడి పంతులుగా నెలకొని యూరి వారి కందఱకు ప్రాథమిక విద్య నేర్పిన సచ్చరిత్రులు)నా చేయి పట్టుకొని ఇంటికి గొనివచ్చి మా మాతృశ్రీ నడిగి గోచిగొని తానే మొలత్రాటికి దాని దగిలించి బడికిఁ గొని పోయి రెండు మూడు నాళ్ళలోనే అక్షరజ్ఞాన మలవరిచిరి. తర్వాత వారిచేతనే మా తండ్రిగారు నా కక్షరాభ్యాసము జరపించిరి. నన్ను నే నెఱుగుటకు ఇది నా తొలిగుర్తు.

బడిలో నేదో చదువు సాగినది. అన్నింట నేనే మొనగాఁడను. లెక్కలు మాత్రము నిండుసున్న. తెలుఁగన్న వెఱ్ఱి తీపు. బడిలోని యుపాధ్యాయులు నాచే పద్యముల జదివించుచు సంతోషించుచుండెడివారు. సంగీతముతోడి చదువు నాఁటికి నేఁటికిని గూడ నాకు ఁ గొఱుకఁబడని మెతిక బియ్యమే ! సంగీతము లేకున్నను సందర్భస్ఫూర్తి గలుగునట్లు పసినాట లెక్క కెక్కుడుగ పద్యములు నేను చదువఁ గల్గుట యుపాధ్యాయులకు ముచ్చట గొల్పెడిది. మా చుట్టుపట్టు గ్రామము లన్నింటికంటె మా యూరనే మా యింటనే సంస్కృతాంధ్రనిఘంటువులు ధర్మశాస్త్రాదిగ్రంథసంచయము నధికముగా నుండెను. గ్రంథములకై యనేకులు మా యింటికి వచ్చెడివారు. అర్థ మయినంతవఱకు మా యింటఁగల గ్రంథముల నెడతెగక నేను చదువుచుండెడివాఁడను. మా తండ్రిగారు తెలుఁగు మఱుఁగులు కొన్ని తెలియఁ జెప్పుచుండెడివారు. ఈ ముచ్చటలఁబడి నేను ఇంగ్లీషు చదువు నిరాకరించితిని. సంస్కృతాంధ్రములగుచో స్వగ్రామముననే కొన్ని గఁటలే చదువఁదగుట, ఇంగ్లీషుకు తల్లిదండ్రులను, సుఖభోజనమును విడిచి పెద్దయూరు బందరు పోవలయుట, పదొకొండు గంటలనుండి అయిదు గంటలదాఁక స్కూలుకు పోయి చదువవలయుట, ఊరిలోని మిత్రగోష్ఠిని విడువ వలయుట దుః ఖకరములుగా నా కపుడు తోఁచినవి. నిర్బంధించి మా తల్లిదండ్రులు నన్ను గ్రామాంతరమునకుఁ బంపఁజాలరైరి. పుత్రవాత్సల్యమును, భోజనాది సౌకర్యములు గ్రామాంతరమున కల్గింపఁ గల ధనసంపత్తి లేమియు దానికిఁ గారణములు.

స్వగ్రామముననే బ్రహ్మణ్యులయిన మద్దూరి రామావధానులుగారి దగ్గఱ సంస్కృతము, నింట తెలుఁగు చదువ సాగితిని. పుణ్యమూర్తులు, ప్రాతస్స్మరణీయులు మద్దూరి రామావధానులుగారు మా తండ్రిగారు నాబాల్యమిత్రులు. సమవయస్కులు. బ్రాహ్మముహూర్తమున నిద్రలేచి సరిగా వేళకు సంధ్యావందనాగ్నిహోత్రాది ప్రాతరాహ్నికములు నిర్వర్తించుకొని ఒక గంటసేపు ఉంఛవృత్తి నెఱపి, తొమ్మిది గంట లగుసరి కింటికి వచ్చి, మాధ్యాహ్నికము నిర్వర్తించుకొని పది కొట్టక పూర్వమే సుఖముగా భోజనము చేసి, విశ్రాంతితో విద్యార్థులకు పాఠములు చెప్పుటతో శ్రీవారు సత్కాలక్షేపము జరుపుచుండిరి. పదిగంటలలోగా భోజనము కానిచో వారి కొంటికణత తలనొప్పి వచ్చును. వారతిసుకుమారశరీరులు. వారిని గూర్చి మా తండ్రిగారిని గూర్చి నాఁడు మా యూరి వారిట్లు వాకొనుచుండువారు. రామావధానులు గారికి తన కనార్యోము కలుగుట ఊరి కంతకు అనారోగ్యము కలుగుట– సుందరశాస్త్రిగారికి తన కుటుంబమున కనారోగ్యము కలుగుట యూరికంతకు ననారోగ్యము కలుగుట –అని తమ, తమ కుటుంబపు టనారోగ్యములకు వీరు గజిబిజి పడునంతగా ఇతరుల యనారోగ్యముల గూర్చి వీరు గజిబిజి పడువారు కా రనుట దీని తత్త్వము.

మా యింటి దగ్గఱనే సాలెవీధిలో సాలెవారు వారి గురువగు భావనఋషికి ఉత్సవము జరుపుచుండిరి. నా వయస్సప్పటికి ఎనిమిదో తొమ్మిదో ఉండును. సంజవేళ 7,8 గంటలప్పుడు భోజనము చేసి అక్కడ జరుగుచున్న యుత్సవమును జూచుట కేగి యట్టట్టే నేను మైమఱచి నేల వ్రాలి పోయితిని. అక్కడివారు మైమరుపాటు కలుగుచుండుట నా వల్ల విని నన్నింటికి గొనివచ్చిరి కాబోలను ! ఎంతసేపయినదో ! మా తండ్రిగారు దగ్గఱ శివకవచము పారాయణ చేయుచుండగా మెలకువ వచ్చెను. నా కేమియు బాధ గోచరింపలేదు. అంతే. అటుపై సాధారణముగా జాతర్లకు, దేవోత్సవములకు నే నంతగా వెళ్ళ నుత్సహింపకుండుటే జరుగుచు వచ్చినది. పై సందర్భమున నాకు మైమఱుపాటేల కలిగెనో అప్పు డెవ్వరికిని నెఱుక కందలేదు. పెక్కేండ్లకుఁ దర్వాత నాకే అది తెలియ వచ్చినది. అర్హసందర్భమున దాని చెప్పుదును.

ఒక శివరాత్రినాఁడు–జగజ్జ్యోతి వెలిగించువేళకుఁ జాల ముందుగానే నే నక్కడకు జేరితిని. కొన్ని మణుగుల నేతికుండులో గొప్ప జ్యోతి వెలిగించిరి. నేను తిరిగి వచ్చుటలో గోపుర ద్వారమున జనసమ్మర్దములో నలిగి పోయి క్రింద పడితిని. నామీది నుండియే జనము నన్ను చింపిరిగుడ్డను దొర్లించుకొనుచు నడిచినట్లు నడవజొచ్చిరి. చచ్చితి ననుకొంటిని. ఊపిరాడదు. ఎట్లో నన్ను కాళ్ళతోనే దొర్లించుచు గోపుర ద్వారము వెలికిపో పడదన్నిరి. బయటకు వచ్చిన తర్వాత నెమ్మదిగా ఒంటరి పట్టుకు దొరలి చాలసేపు విశ్రాంతిగొన్నపై చక్కబడితిని. నాటినుండి గుళ్ళు గోపురములు జాతరలు నాకు దూరమయినవి.

మఱొకప్పుడు మాచుట్టుపట్టుల యూళ్ళ నెల్ల ఒకానొక యలజడి రేగినది. అది యిట్టిది–ఒకానాఁడుదయముననుండి సాయంకాలము దాఁక ఊరివా రెల్లరు ఊరివెలుపల వసించి అక్కడ వంటలు చేసికొని దేవతలకు నైవేద్యము చేసి భుజింపవలయును. ఇంటి వాకిటితలుపులమీద శ్రీ వైష్ణవనామ మంటించవలెను. మెడలో సొరకాయ పెంచిక కట్టుకోవలెను. అట్లు చేయకున్నచో మహానర్థము వచ్చును. ప్రతియింటి వాకిటి తలపులమీద నామములు వెలయించిరి. ఎక్కడివోయెందు సొరకాయ బిళ్లలు (అమ్మిరి గాబోలును) వచ్చినవి. జందెములకు, మెడహారములకు, మొలత్రాళ్ళకు నందఱు వానిని కట్టుకొనిరి. ఊరివెలుపల వంటలకు పయనమగుచుండిరి. మా నాయనగారిందుకు ప్రతికూలురు – ఊరివెలుపల కందఱును వెళ్ళిన పిదప దొంగ లూరు దోచుకోగలరని. మునసబు కరణాలు దైవభీతితోనే జాగ్రత్త వహింతు మని మాట యిచ్చిరి. కొంద ఱెవ్వరైన నూరు విడువ కున్నచో తర్వాత నేదేని యాదృచ్ఛికముగానే ఆయెను – గ్రామమున కీడు దాపరిల్లినచో దాని తాకిడి ఊరు విడువని వారిమీఁద పడగలదు. కాన మాఱు మాటాడక యూరువిడిచి వెళ్ళవలసినదే యని యందఱు తీర్మానించుకొనిరి మేము మాత్రము యింట పులిహోర చేసికొని యది మూట గట్టుకొని ఊరివెలుపలకు వెళ్లి అక్కడ దేవతకు దాని నివేదించి భుజించి, యింత మజ్జిగ త్రాగి యింటికి రాదగు ననుకొంటిమి. న న్నందుకై కరివేపాకు తెచ్చి పెట్టు మనిరి. ఊరిలోనివా రందఱు నాహారసామగ్రులతో నూరివెలుపలకు వెళ్లుచుండిరి. దొడ్డిలో కరివేప చెట్టుగల బ్రాహ్మణుల యింటికి



వెళ్ళి కరివేపాకు నడిగితిని. వారు నూరివెలుపలికి పయనమగు చుండిరి. 'కరివేపా కీయ వీలులేదు. మేము వెళ్లుచుంటి' మనిరి. నేను దొడ్డిలోనికి వెళ్ళి కోసికొని పోవుదు నంటిని. 'తలుపులు తాళములు వేసినాము. వల్లగా' దనిరి – దొడ్డివైపునకు వెళ్ళి చెట్టు కేసి చూచుచుంటిని. కొందఱు నన్ను జేరవచ్చిరి. కరివేపాకు కావలె నంటిని, ఎందుకనిరి? ఈ దేవతకు ద్వారమున కరివేపమండ కట్టవలెనట! అందుకుగావలెనంటిని! అంతే, నా కొక మండ గోసి యిచ్చిరి. తర్వాత ఒకరొకరే ఒక్కొక్కమండ చొప్పున విఱుచుకొని కొనిపోయి ద్వారతోరణముల కెక్కించిరి. చెట్టున ఒక ఆకేని మిగులలేదు. మరునాఁ డింటి వారు వచ్చి ఆ దుండగము నేను చేసినదని గుర్తించి నన్ను దండించినంత నిందించిరి. నే నబద్ధమాడినందుకు ఫల మనుభవించితిని.

దైవము పేర సంఘమున అలజడి పుట్టించుట సుకరమనీ, అది దిద్దు టంత సుకరము గాదనీ, సంఘము విద్యా విజ్ఞానవంతమై మొత్తము మీఁద వర్ధిల్లిననే గాని యిట్టి చెట్టలు దొలగింప సాధ్యము కాదనీ విన్న వించుటకే ఈ విషయముల నిక్కడ వ్రాసితిని. మతము, వైద్యము, జోస్యము, ధర్మము, ఆచారము ఇత్యాది సంప్రదాయ సంకేతములతో చెడుగు లెన్నెన్నో సంఘమున దిద్దఁగుదరనివై మొద్దువారి కదల కున్నవి. వ్యాపించుచున్నవి. మూఢవిశ్వాసముతో వాని ననువ ర్తించులోక ముండుటచేఁ దత్ప్రచారకులు వానిని స్వయము విశ్వసింపక పోయినను వాని వలన లాభముచే పలుకుబడి సాగించుకొనుచున్నారు. కొందఱు నగ వెఱుకతో నన్నింటిని బాటించుచున్నారు.

ఇటీవల జరిగిన విషయ మొకటి.

నా మిత్రున కొకనికి ముక్కులో పెద్దకురుపు లేచినది. ఆతని కాయుర్వేద వైద్యమునఁ గొంత నమ్మకము. మిత్రుఁ డొక ఆంగ్లవైద్యుడు దానిని ఆపరేషన్ చేసి సులువుగా దొలగింతు ననుచుండెను. వ్యాధితుఁడు పిరికివాఁడు. కూరగాయ దేశీయ వైద్య మెఱిగినమిత్రుఁ డొకఁడు నఖమును అనగా చేతిగోటిని నువ్వుల నూనెతో గాచి గోర్వెచ్చగా ముక్కులో రెండు బొట్లు వేసిన నది మాను ననెను. తోడనే ఆతని తల దన్నిన మిత్రుడు ఇతరుల గోటికంటె తనగోరు కత్తిరించి వేసికొనిననే మఱీ మంచిదనెను. నాకు వెఱ్ఱులు

# 4
# పురోహితత – సదనుష్ఠానము

పురోహితవృత్తి నాకు మిక్కిలిరోఁత గొల్పినది. అది శాస్త్రగర్హితమన్న కారణమునఁ గాదు. ప్రాచీన ధర్మశాస్త్ర ప్రకారము చూచినచో నేఁడు బ్రాహ్మణులవలంబించుచున్న వృత్తు లనేకములు శాస్త్రగర్హితములే! భృతకోపాధ్యాయత్వము, వైద్యము, గాయకత్వము, వడ్డివ్యాపారము మొదలయిన యింక నెన్నో యింత కంటె నీచము లగువృత్తులు ధనలబ్ధికై బ్రాహ్మణులు చేయుచున్నారు. అయినను అవి నిందితములు గాకున్నవి. అట్టిచో నిక బ్రాహ్మణులే చేయవలసినవి పూజరితనము, పురోహితత గర్హితము లేల కావలెను? సంఘమున కావశ్యకమైన కులవృత్తి యేది గాని గర్హితము గారాదు. అయినను పూర్వులెల్లరు నవలంబించిన దైనను పురోహితత నాకు సమ్మతము కాలేదు. అది నేఁడు వట్టిబూటకముగా సాగుచున్నది. నూటఁ దొంబది పాళ్ళు పురోహితులను గోరువారు వారియం దాదరము గౌరవము లేని వారు. వా రేదో యలవాటును బాటించుచున్నా మన్న తృప్తికై కర్మలాచరించుచున్నారే కాని పరమార్థబుద్ధితోఁ గాదు.

ఆ యాచరించుకర్మలును ప్రయోజనమును, స్వరూపమును సన్న సన్నగాఁగోల్పోవుచు వచ్చి యర్థరహితములైన బాహ్యాడంబరములుగాఁ బర్యవసించినవి. నిజముగా వాని యెడ శ్రద్ధగలవారు స్వయము వాని నభ్యసించి నిర్వర్తించుకో గలరు. అట్టివారు స్వయము పరమార్థబుద్ధితో నాచరించుచుండువారినే పురోహితులనుగా వరింపఁగలరు. పురోహితత వంశాచారముగా వచ్చుచుండుటచేనం దెన్నో భ్రంశములు చేరినవి. బ్రాహ్మణులలో వేయింటి కొక్కరయినను సరిగా నగ్నిహోత్రముల నుంచుకొనువారు నేఁడు లేరు. శ్రౌతసంప్రదాయమే యుత్సన్నప్రాయమైనది. ఉపనయనమునాఁడు, వివాహమునాఁడు మాత్రము చేయునగ్ని కార్యము, దానిని సరిగాఁ జేయనందుకుఁ బ్రాయశ్చిత్తములు, హోమములు పురోహితుని వింత పాటలు నాటలు నయిపోయినవి. కాళిదాసు నాటకము లందు విదూషకుఁడెట్టి పూజ్యత బొందినాఁడో నేఁడు వివాహోపనయనాది కర్మలందు



పురోహితుఁడు నట్టి పూజ్యతనే పొందుచున్నాఁడు. "అశ్రద్ధ పితాళ్ళకు ఆకతాయి తర్పణ' మన్నట్టు అశ్రద్ధధానుఁ డయినగృహస్థుకుఁ దగినట్టే యవాకుల పురోహితు లేర్పడినారు. కనుక నీయవహేళిత వృత్తిలో ప్రవర్తింపరాదని, సంభావనలకు, బిక్షములకు నేనిది నేర్చితి నది నేర్చితి నని యాచనలకుఁ బోరాదని పసినాఁటనే నేను నిర్ణయించుకొంటిని.

నాకుపనయన మయినది. సంధ్యావందనాదికము నిర్దుష్టముగా నేర్చుకొంటిని, సంధ్యాభాష్యము చదివి యర్థము తెలిసికొంటిని. ఇంటిదగ్గఱనున్నచో నిక వైదిక వృత్తికిఁ జొరపడవలసి వచ్చెడిదేమోకాని ఈశ్వరుఁ డనుగ్రహించెను. చల్లపల్లి విద్వాంసులు, మహర్షికల్పులు శ్రీ అద్దేపల్లి సోమనాథశాస్త్రులుగా రప్పుడప్పుడు మా గ్రామమునకు విచ్చేయు చుండువారు. ఎడ్వర్డు పట్టాభిషేకము జరగినపుడు నేనేవో సంస్కృత శ్లోకములు రచించితిని. వారు విచ్చేసి నా రచన విని నన్నుఁ బ్రేమించిరి. వారు విజయనగరమున భీమాచార్యులుగా రను తర్కవిద్వాంసులకడ సంగమేశ్వర శాస్త్రిగారితోఁ గలసి పెక్కేండ్లు తర్క శాస్త్రము నభ్యసించి తొలుత మా గ్రామమున నెలకొనఁగా నేదో తీవ్రానారోగ్యము కలుగఁగా మా నాయనగారు వారి కౌషధ మిచ్చి వ్యాధి కుదిర్చిరఁట! తరువాత వారు చల్లపల్లి చేరిరి. ఆ యనుబంధమున వారు మా యింటికి విచ్చేయు చుండువారు. వారిదగ్గఱఁ జదువుకొనుటకు నేను చల్లపల్లి చేరితిని. లఘుకౌముది చదువ నారంభించితిని కాని వారు పాతంజల యోగ సూత్రములను గూడఁజెప్పిరి. అందుఁ జదివిన విషయములు నాలోఁ జొచ్చుకొనిపోయి వింత యోచనలఁగొల్ప సాగినవి. వారు తెల్లవారు జామున నిద్రలేచి రాత్రి పండ్రెండు గంటలదాఁక ననుష్ఠానముతో తపోమయులుగా విరాజిల్లు చుండెడివారు. విద్యార్థుల మగుమమ్ముగూడ నట్లు చక్కదిద్దఁ జూచు చుండెడివారు. కర్మానుష్ఠానముల మీఁద నా కేటికో శ్రద్ధ కలుగపోయెను. బందరులో శ్రీచెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులు గారు హిందూ హైస్కూలులో తెలుఁగు పండితులుగా నప్పుడుండిరి.

ఇంటివాకిటఁ గూర్చుండి నేను పాఠము చదువుకొనుచుంటిని. లోపల ఇల్లూడ్చుట జరుగుచుండెను. ఆ దుమ్ము వాకిటికి వచ్చుచు నా మీఁ

స్మృతిపథమున మెలగుచునే యుండినది. కాని అది లోఁబాదుకొనిపోయి నాలోనుండి వెడలించిన వివేకజ్వాలలను మాత్రమే నేనిటీవలనే – ఈ విషయము వ్రాయుచున్నప్పుడే – స్పష్టముగా నిరూఢముగా నెఱుఁగగల్గితిని.

పంద్రెండేండ్లకు ముందు మా మాతృశ్రీ దివ్యధామ మందగా ఔర్ధ్వదైహిక కర్మకలాపము మా యన్నగారు చేసిరి. నేను తద్దినము పెట్టువాని తమ్ముఁడనుగా దగ్గఱ నుంటిని. "జ్యేష్ఠేనై వతు కర్తవ్యం" అను శాస్త్రనిర్ణయము చొప్పునే నేను పాటించితిని. వచ్చిన వైదిక బృందము నేను కర్మ కలాపములు చేయ కూరకుంటి నని గర్హింపసాగిరి. శాస్త్ర నిర్ణయమును మా యింటి ప్రక్కనే ఉన్న సాంబశివశాస్త్రిగా రను విద్వాంసులు నిరూపించి యా వైదికగోష్ఠిని నోరెత్తకుండఁజేసిరి. అప్పుడు కర్మకలాప మంతయు ముగిసిన తర్వాత అన్నాతురులగు ప్రజలకు వర్ణవిభేదము లేకుండా ఒక నాఁ డెల్ల నేడెనిమిది వందలమందికి సంతర్పణము గావించితిమి. సంకల్పము నాది గాని నిర్వాహమెల్ల మా తమ్ములు చేసిరి. వీధి యెల్ల శుభ్రపఱచి విస్తళ్లు వేసి భోజనములు పెట్టితిమి. కొందఱు వీధి యెల్ల చండాల భోజనముతో నంటైన దని గర్హించిరి. చుట్టుపట్టుల యూళ్ళ నలజడి రేగెను. మా నిర్ణయము నిర్వక్రముగా సాగెను. ఇట్టి సంకల్పము నాలో పొడముట నా బాల్యమున నాలోఁ గుదుర్కొన్న యవ్యక్త భావ కారణమున నుండి వెడలిన కార్యవికాసమే యగుట నిటీవల గుర్తించితిని.

మరియు ముక్త్యాలలో జరిగిన నా కుమారుని వివాహమున గూడ నక్కడి సర్వజాతుల వారికిని, పాకీ వారికి గూడ ఒక్కొక్క నాఁడొక్కొక్క జాతివారికిఁగా మృష్టాన్నసంతర్పణము జరుపు టయ్యెను. ఈ సందర్భమునఁ గూడ మా తమ్ములే నిర్వాహకులు. ఆ వివాహ సందర్భములో మా కాప్తమిత్రులు, శ్రీ ముక్త్యాల ప్రభువులు తమ యింటి వివాహముగా వివాహసర్వవ్యయము ఎన్ని వేలయ్యెనో తామే భరించిరి. ఇట్లు జరుగుటకు గూడ బాల్యమున నాలోఁ గుదుర్కొన్న యవ్యక్తభావమే కారణము.

భూమిలోఁ బడవేసిన విత్తనము కొంతదాఁక ఏమయినదియుఁ దెలియరాక యుండి యుచితకాలమున నంకుర రూపముగా బహిర్వికాసము



చెందినట్లు మానవ హృదయములలోఁ జొచ్చు కొనిపోయిన యనుభూతులు కూడ నుచిత కాలమున వానికిఁ దగిన పరిపాకముతో వెల్వడి విరివిసెందును. కాని యివి బీజరూపముగా నెన్నడో లోనికిఁ జొచ్చు కొని పోయిన యా యనుభూతులవల్ల నేర్పడినవే యని గుర్తించుట మాత్రము సర్వత్ర జరుగదు. లోతయిన సంస్కారములు కొన్ని కాలమెంతో గడచి యనుకూలసందర్భము సమకూడినప్పుడు గాని కార్య పరిణామము సెందఁజాలవు. ఆ చెందిన కార్యపరిణామము నాఁటికి కారణజ్ఞప్తి మఱుగుపడి పోవుట సంభవింపవచ్చును. ఈ బీజరూప సంస్కారములు లో సొచ్చుటయుఁ దర్వాత నవి బహిర్వికాసము సెందుటయు నొక్క జన్మములోనే జరుగ ననఁగాదు. పూర్వక్షణపు బీజ రూపసంస్కార ముత్తరక్షణముననే బహిర్వికాసము చెందునది గాఁ గొన్ని సందర్భములం దుండవచ్చును, కొన్ని సందర్భములం దేడు జన్మముల దాఁకఁగూడఁదేలనిది గావచ్చును. భగవత్ప్రాప్త్యర్థమైన సంకల్పబీజములు భగవత్తత్త్వమును గూర్చి స్పష్టపరిజ్ఞానము కుదురుదాఁక విరివిసెందుచుఁ బెరిగి పెరిగి పారమ్యము పొందిన పిదప నక్కడనుండి బహిర్వికాసమునకు వచ్చుచుఁ బరిపూర్ణతను జెందుటకు గూడ నట్లే యేడు జన్మములదాఁక సాగవచ్చును.

పరిపూర్ణత చెందు టనఁగా మానవసామాన్యము కంటె నెంతో ఉన్నతోన్నతముగా ఎంతో లోతులోతుగా గోచరించిన తత్త్వమును మానవుఁడు తన ప్రేమ ప్రసరించిన చోట్ల నెల్ల వ్యాప్తపఱుపఁగల్గుట. ఉన్నతోన్నతము, లోతు లోతు నయిన భావ మదాటుగా అకారణముగా అసాధనముగా గోచరింపదు. తన హృదయ మెంతెంత ప్రేమమయ మగునో, ఆ ప్రేమ మానవతమీఁద నెంతెంత యధికాధికముగాఁ బ్రసరించునో మానవుఁ డంతంత ఉన్నతముగా అంతంత లోతుగా పారమ్యమునకుఁ జేరిక చేరికగాఁ బోగల్గును. చెట్లవేళ్లు విరివి సెంది దూరదూరము వ్యాపింపను వ్యాపింపను చెట్లు మీఁదికి పెరుగగల్గును. కూకటివేరు నేల లోఁతుకును జొరగల్గును గదా!

# 7

# శాస్త్రము - అనుభూతి

శ్రీసోమనాథశాస్త్రులుగారి తపస్వితపై నాకు మహాభక్తి! కాని వారి ననువర్తింపవలె నని కాని, అనువర్తించినచోఁ గడతేరఁగల్గుదు నని కాని నాకు తోఁచలేదు. యోగసూత్రములను బాఠము చెప్పునపుడు వారు తాము యోగసిద్ధికై కొంత పాటుపడితి మనియు, దానివల్ల ఆరోగ్యము చెడిన దనియు, ఆపద్ధతుల ననుభూతికిఁ దెచ్చుకొనఁజాలమయితి మనియుఁ జెప్పిరి. వారికే సాధ్యము కానిచో మమ్ము దీనిఁ జదివించు టేల యని నాకుఁదోఁచెను. కాని కోపింతు రని వారి నడుగనయితిని. మఱొకనాఁడు నా ప్రశ్నమును వారే వేసికొని "మీలో నెవరయిన వీనిని సాధింపగలరేమో యత్నించి చూడండి. సరియయినగురువు దొరకునేమో చూడండి. నా కనుభూతి కలుగనంతమాత్రాన శాస్త్ర మప్రమాణ మనుకోకండి. మీరుగా సాహసించకండి" అనిరి. ఆ మాట నాలోఁ జొచ్చుకొనిపోయినది. వారు మంత్రయోగమయులు. అనుష్ఠానమున గాఢతత్పరతయే కాని వారికి దాని ఫలితమేమి అన్న యోచనమే యుండెడిదికాదు. చేయవలసినది గనుక చేయుచుండుటయే. ఇటీవల వారితపః ప్రయత్నమునుగూర్చి యోచించుటలో నేతదర్థకమగు నుపనిషద్వాక్యము సమాధాయకముగాఁ దోఁచినది.

నేను నా యిర్వదియెనిమిదవవత్సరమున భృక్తరహితతారక రాజయోగమునఁజేరి యబ్బురపు టనుభూతులను బడయుచుండఁగా వారు సజీవులుగా తపోమయులుగా విరాజిల్లుచునే యుండిరి. తఱచుగా నేను స్వగ్రామమునకు వెళ్లి నపుడు చల్లపల్లి వెళ్లియు, వారు వారి యల్లుఁగూతుళ్లు వర్ధిల్లుచున్న మా స్వగ్రామమగు పెదకళ్లేపల్లికి విచ్చేసినపుడు సందర్శించియు, నా విషయము వారికి నెఱింగించుచునే యుంటిని. వా రెంతో కుతూహలముతోఁ దాము గూడ నాతో నొకతూరి కుంభకోణము వచ్చి, శ్రీవారిని దర్శించి సంభాషించి యేమేమో పడయువలయు నని యుత్సాహపడుచు వచ్చిరి. వారి కీయోగసంపర్కము కలుగఁజేయ వలె నని కోరిక నాకును నుండెడిది. కాని యది యట్లు జరుగలేదు.



వారు భౌతిక శరీరము విడిచిన పిదప నాముప్పది యెనిమిదవయేట నొకనాఁడు నాధ్యానసమయమున శ్రీవారును, మా నాయనగారును, మా మామగారును, నాతోపాటు ధ్యానానుభూతిలో నుండుట కొన్ని నిమిషములపాటు గోచరించెను. ఈ ముప్పురకు నిట్టి యనుభూతి కలుగుఁ గా కని బహువారములు నా ప్రార్థనమున గోరుకొనుచుండెడివాఁడను. కాన యా యనుభూతి నాకు ముదము గొల్పినది.



బందరులో చదువుకొనుచుండుకాలమున నేను శ్రీకొండ వెంకటప్పయ్యపంతులుగారియింటను,శ్రీవల్లూరి సూర్యనారాయణరావుగారి యింటను వసించుచుండువాఁడను. వారి కప్పుడు నాపైఁ జాలవాత్సల్యము. శ్రీసూర్యనారాయణరావుగారు వారి జీవితావసానము దాఁక నా యోగ క్షేమములు కనుగొనుచుండువారు. వారిప్రేరణముననే నేను మద్రాసు చేరితిని. అప్పటికి నాకు పదునెనిమిదవ యేడు. వారు శ్రీరెంటాల సుబ్బారావుగారికి నన్నుగూర్చి జాబు వ్రాసిరి.

# 9

# ధూమకేతు దర్శనము

మద్రాసులో మా బావగారు శ్రీరామేశంగారిదగ్గఱ గుమాస్తా శ్రీకాజా వెంకటశేషయ్యగా రుండిరి. వారియండతో నేను మద్రాసులో నెలకొంటిని. మద్రాసు చేరగానే నాకు శ్రీపండిత గోపాలాచార్యులుగారు, శ్రీపురాణం నాగభూషణముగారు మిత్రు లయిరి. గోపాలాచార్యులుగారి ద్వారా నాకు శ్రీపనప్పాకం అనంతాచార్యులుగారితోను, వారికుమారుఁడగు శ్రీనివాసాచార్యులుగారితోను మైత్రి యేర్పడెను. మద్రాసుచేరగానే వెస్లి మిషన్ హైస్కూలులో తెలుగు పండితుఁడనుగా నేను గుదుర్కొంటిని. రెండేం డక్కడ నుంటిని. ఆ నాళ్ళలో తఱచుగా ప్రాచ్యలిఖిత పుస్తకశాల కరుగుచు నక్కడి గ్రంథములు చదువుచు నుంటిని.

శ్రీవేపా రామేశముగారితో నేను దఱచుగా విద్యావినోద మనుభవించు చుండువాఁడను. రామేశంగారు విద్యారాశి. గణిత చరిత్రాదిశాస్త్రములందు నిష్ణాతులు. వారికడ ఖగోళశాస్త్రరహస్యము లెన్నో తెలిసికొనుచుండెడివాఁడను. వారికొక టెలస్కోపు కలదు. వారి ధర్మపత్ని యంతర్వత్నిగా నుండి పురుటికై పుట్టినింటికి వెళ్ళుచుండు సందర్భములలో నెలల తరబడి రాత్రులందు వారితో చాలసేపు నక్షత్రగ్రహ మండలములను బరిశీలించు చుండువాఁడను. ఎన్నో ఖగోళశాస్త్ర రహస్యములు వా రెఱుఁగఁ జెప్పుచుండు వారు. నేర్చుకొనుచుండెడివాఁడను. ఎపిగ్రాఫియా ఇండికా, ఇండియన్ ఆంటిక్వరీ, ఎపిగ్రాఫికల్ రిపోర్టులు మొదలగు చరిత్రాధారగ్రంథము లెల్ల వారిదగ్గఱఁగలవు. వాని నెల్లఁ జదువఁ దెచ్చుకొని చదువుచుండు వాఁడను.

1910 వ సంవత్సరము. హాలిస్కామెట్టు వచ్చినప్పుడు – ఇంకా కొన్నాళ్ళ కది స్థూలదృష్టికి గోచరించుననఁగా టెలస్కోపుతోను, బైనాక్యులర్ తోను తెల్లవారుజామున లేచి ఆకాశభాగమును మే మిర్వురమును బరిశీలించుచుండువారము. ఆ ధూమకేతువు తొలుత అరుణోదయ మగుచుండగా తూర్పుదిక్కున గోచరించెను. అది యుదయించునంతలో ఉదయారుణకాంతులు క్రమ్ముకొనఁగా కానరాక పోయెడిది. ఒకనాఁడు బైనాక్యులర్ చేతనుంచుకొని మేడ దిగి రోడ్ మీఁదికి పోయి పరిశీలింపఁగా నా కది వెల్తురు

గల్గినచో, సౌకర్య మున్నచో నటుతర్వాత పెండ్లాడిన నాడదగును గాని యిప్పు డేమి పెండ్లి? విద్యావివేకములు లేని యాడుపడుచులను బెండ్లాడి ఏడాదికి, రెండేండ్లకు బిడ్డలు పుట్టుచుండుట, ఈదురో దేవుడా అనుచున్నట్టు చాలినంతగా గృహాది సౌకర్యము, శిశుపోషణసౌకర్యము లేకపోగా చాలీచాలని జీవితాయతితో నిరుత్సాహనిహతములై బాధపడుచున్న కుటుంబముల నెన్నింటిని జూచుట లేదు? అందులో నీవును జేరి దిగనాసిల్ల నభిలషింతువా, అని ఇంక నిత్యాదివిధముల తీవ్రభాషతో వారు నన్ను మందలింపసాగిరి. నేను దలవాల్చుకొని తినుచున్న యన్నపుముద్ద మ్రింగుడుపడక మాటాడ నేరక సిగ్గుతో చిదికి వదవదలాడుచుంటిని. శ్రీపార్వతమ్మగా రందుకొనిరి. 'ఇటు వినండి! యూరపుదేశము వారి బ్రహ్మచర్యము మాట యెత్తకండి. ఆ బ్రహ్మచర్యము మనవారి కెందుకు గాని, వీరిని బాగుగా ధనార్జనము చేసిన తర్వాత, ప్రౌఢవయస్సు వచ్చిన తర్వాత పెండ్లాడు మనుచుంటిరే! మన దేశపు సర్వైశ్వర్యమును జుఱ్ఱుకొనుచున్నారు గనుక యూరపువారు ఏవిద్యచేతనైన నెంత ధనమునైన నార్జింపఁ గల్గుచున్నారు. కట్టుబట్ట, కుట్టుసూదికూడ వారే తయారు చేయుచు మనదేశమువారి కమ్ముచు ధనప్రవాహము తమ దేశముమీఁద పాఱుచుండఁబట్టి లోకోపకృతి చేయగల్గుచున్నారు. నిజమే! అంత ధన మార్జించుటకు మనదేశమువారికి సౌకర్యము లేవీ? ప్రౌఢవయస్సు వచ్చిన తర్వాత పెండ్లాడుట యూరపువారికి చెల్లవచ్చును గాని మన వారికి చెల్ల నేరదు. ఆ దేశమున యేఁబది యఱువది యేండ్ల వరుని బ్రహ్మచర్యమును, ముప్పది నలువది యేండ్ల వధువు కన్యాత్వమును మనకు విశ్వసింపరానివి. చల్లని యూరపు దేశములో నవి చెల్లు నేమో నే నెఱుఁగను. మనదేశము వారి కావయస్సు యించుమించుగా వార్ధకకాలము. ధనార్జనము చేయునేకాక! అప్పుడు వివాహ మాడుట మనదేశమువారికి గతజల సేతుబంధనమే!

మొన్న వింటిరి గదా ! యధికవిద్యావతిని బెండ్లాడు భర్తల గోడును! హైద్రాబాదులో నొక గొప్ప డాక్టరు విద్యావతిని బెండ్లాడి యాయె తఱచుగా యూరపు మొదలగు ఖండాంతరములకు వెళ్లి వచ్చుచు నెలలు, వత్సరములు దేశాంతరములం దుండుటయు, తన యార్జన యెల్ల నావె యాత్రావ్యయములకై పంపవలసి వచ్చుచుండుటయు, తన బంగళాలో గోడలు



బూజుపట్టి చిత్రరచన లెన్నో సంస్కారము లేక తార్మారై చెడుచుండుటయు, దనకు గార్హస్థ్య సౌఖ్యము దుర్లభముగా నుండుటయు నొక మిత్రునితో జెప్పి వాపోవఁగా నామిత్రుడు మీతో చెప్పుట నీ నడుమ మీరు వినియుంటిరిగదా ! ఏ యెండ కాగొడు గన్నట్టుండ వలెనేకాని తనకు మించిన విద్యావతిని బెండ్లాడుటలో చిక్కులేకాని సేమ ముండుట యసాధారణము.

చూడండి! ఆరంభముననే తనకు దగినపడుచును బెండ్లాడి రోడ్డు రిపేరు చేయుచున్న యుప్పరివాడు పగలెల్ల మట్టిపనిచేయుచున్నాడు. సంజకడ ఉడుకు నీరు కాచి, యిల్లాలు వీఁపు దోమి స్నానము చేయించగా భర్త సుఖస్నాతుఁడై భార్యతో గంజి యన్నము, ఉప్పు, పచ్చిమిరపకాయ నంజుకొనుచు కడుపార నారగించి, తమకు గలిగిన చిన్నబిడ్డ నక్కడి చెట్టుకొమ్మకు వ్రేలగట్టిన చీరయుయ్యెలలో నూగించి, చల్లగాలిలో నా బిడ్డ సుఖనిద్ర పడయగాఁ జెట్టు క్రింద సుఖశయిత లగుట చూచుచుంటిమి గదా! వారి దాంపత్యమున హృద్యత గోచరించుట లేదా?

ఏకైక వ్యక్తిగా మీరు మిగిలిన మీకుటుంబమున నన్నుఁ బెండ్లాడుటచే వంశవృద్ధి గలిగి మీరు సుఖించుచుండుట గుర్తునకు వచ్చుట లేదా? నే నుండుటచే గదా మీ కిట్టిసుఖభోజనము దొరకుట? వంటవానిని గుదుర్చుకొని వానివంటతో భోజనము జరపుకొనుటలోని యిక్కట్టులను గుర్తించుచునే యుంటిమిగదా! మీకు ఆరోగ్యకరములు, ప్రియములు నయినకూరగాయలను నేను దెప్పించి మీకు ప్రియ మయిన తీరున వంట చేయించుచుండుటచేతఁ గాదా మీ యారోగ్యము ససిగా నుండుట, ప్రియముగా భోజనము సాగుట, ఇంటికి వచ్చిన మీకు కోర్టులోని పరిశ్రమపుఁ బరిహారము మావినోదముతో జరగుట యగుచున్నదిగదా! ఇంతేల! ఈ యెండ యుమ్మదములో చెమటలు దిగజారుచుండఁగా నే నుండి విసనకఱ్ఱతో విసరుచుండుటచే గాదా శ్రమ మెఱుఁగకుండ మీరు హాయిగా నారగింపఁగల్గుట? నేఁటి యీ వంటకములు వంటాతఁడే చేసినను నేను దగ్గర నుండి మీకు ప్రియమయిన కూరలు తెప్పించి తఱిగి యిచ్చి మీకు వండించుటచేతఁ గాదా యవి యాస్వాద్యములుగా మీకుండుట!

# 12

## బండిపాటు

మాయూరి కాఱుమైళ్ళ దూరమున అవనిగడ్డ యని గ్రామము గలదు. అది తాలూకా ప్రధానస్థానము. మాయన్నగార క్కడ పోస్టుమాస్టరు. వారి కుటుంబమును జూచుటకై నే నాయూరికి వెళ్లి తిరిగి వచ్చుచుంటిని. మాయూరివారే, మహనీయులు, గొప్పవేదవేదాంగవేత్తలు, నాపై నమితవాత్సల్యము గలవారు, వృద్ధులు శ్రీయడవల్లి అప్పావధానులుగారు కడువృద్ధ యయిన వారియత్తగారితో బండిమీఁద అవనిగడ్డనుండియే మాయూరికి విచ్చేయుచు నన్నుఁగూడ బండిలోఁ గూర్చుండ నిర్బంధించిరి. నేనేవేవో మద్రాసు పుస్తకశాలలోని గ్రంథములఁగూర్చి ముచ్చటించుచు వారిని వినోదపఱచుచుంటిని. బండి యొకటిన్నరమైలు సాగివచ్చెను.

అవనిగడ్డకు మాయూరికి నడుమ కృష్ణానది కలదు. అది వేసగి కనుక పాటిరేవు గలదే. బండి దానిలో నుండి సాగి పోవచ్చును. కాని గట్టుననుండి యేటిలోనికి కొన్ని నిలువులలోతు దిగవలెను. బండి తోలుచున్న రైతు (మాయూరివాఁడే) చుట్ట కాల్చుకొనుట కంతకు ముందే బండి దిగెను. గట్టుననుండి పల్లమునకు బండి గాడిలోనుండి వడిగా దిగజాఱునాసమయమునకు సరిగా నాతఁడు మూత్రోత్సర్గమునకుఁ బోయి వెనుకబడెను. బండిచక్ర మొకటి బండి గాడిపల్లపుజాలులో నుండఁగా మఱొకచక్రము గట్టుమీఁది కెక్కెను. ఉపక్రమమున నా యెగుడుదిగుడు కొంచెముగానే యుండెను. కాని రెండు మూఁడు గజములు సాగునప్పటి కొడ్డగెడవుగా నయ్యెను. ఎడ్లు వడిగా దిగిపోవుచుండెను. బండి కడయంచున నేను గూర్చుంటిని. ఇఁక నొక క్షణములో నా జీవిత మటో యిటో ఏదో అగుదశ దాపురించినదిసుమా యనుకొనుట నే నెఱుఁగుదును. ఈయెఱుక బండితుదిపట్టున నుండి యెడ్ల దిగుడు దూకుడును, చక్రముల యొడ్డగెడపును–వెలుపలికి చూడ్కి పాఱుచున్నది గాన–నేను గుర్తించితిని గాని బండి లోతట్టున గూడులో నొదిగి యున్న యాయిర్వురు నంతగా గుర్తింపరయిరి. ఇహలోకప్రజ్ఞ యీ శరీరమున నుండుటో, ఊడుటో– ఈ లోకముతో సంబంధము



తీరనున్నదేమో అన్న తలఁపు నాలో కలిగినక్షణమే యెఱుఁగుదును గాని తర్వాత న న్నెఱుఁగను. నా యునికి నెఱుఁగను.

ఈ స్థితిలో కొన్నిక్షణములో నిమిషము లొకటి రెండో కడచియుండఁ బోలును! 'చండాలుడా! లక్షరూపాయల విలువ చేసే మనిషిని చంపి వేస్తివిరా! చండాలుఁడా!' అన్న యవధానులుగారి యేడ్పుటఱపుతో ప్రజ్ఞ గాంచితిని. 'బ్రతికి ఉన్నానండీ బాబూ! యేడ్వకండి' అంటిని. అప్పావధానులు గారు నా యెదుట నిరపాయముగా నిలిచియుండిరి. నా కైహిక ప్రజ్ఞ కలిగినందుకు, అప్పవధానులు గారు నిరపాయులుగా నున్నందుకు తనిసి 'సోమిదేవమ్మ గా (వారి యత్త గారు) రేమైరండీ' అంటిని. 'బ్రతికున్నావా నాయనా!' అనుచు నామె పర్వెత్తి వచ్చెను. 'మా కిద్దఱికీ మొండిఘటాలకి. ఏమీ దెబ్బ తగులలేదు. నాయనా! నీ చెయ్యి యిదేమిటి?' అని ఆమె యేడ్వసాగెను. అప్పుడు నేను నా చేతులను జూచుకొంటిని. కాని అందాఁక నేను బాధ నెఱుఁగను. నా దక్షిణ బాహుమూలము నా కడుపు మీఁద వ్రేలాడుచుండెను. ఆ వికృతి చూడఁగా నాకు వాంతి, మైకము, కంపము కలుగఁజొచ్చెను. ఇం కేమేమి యంగ వికృతి కలిగెనో, ముం దేమగునో అన్న కంగారుతో అవధానులుగారి నిట్లు ప్రార్థించితిని. 'నా పూర్వకర్మానుభవమేదో నే ననుభవించుచున్నాను. నా స్థితి యేమగునో! మా తల్లిదండ్రులకు నెమ్మదిగా నా స్థితి తెలుపండి. ఈ బండివానికి ఏ మాత్రము క్లేశము కలుగరాదు. నా ప్రాణమున్నా, పోయినా వీనిని నన్నుగా భావించి కాపాడండి! కాని నిందాదులు చేయకండి. దప్పి, దప్పి' యనుచు మైమఱుపాటు చెందితిని.

కొంత సేపటికి చల్లని మంచినీరు, మజ్జిగ దగ్గఱిఁ క్రొత్తపేట బ్రాహ్మలు తెచ్చి యీయఁగా, చన్నీటి గుడ్డతో మొగము తుడిచి, ప్రజ్ఞ రప్పించి యిచ్చిరి. మాయూరి కరణముగారు, మానాయనగారి బాల్యమిత్రము శ్రీకొడాలి వెంకయ్యగా రింతలో నక్కడికి బండిమీఁద వచ్చిరి. న న్నాదరించి తన బండిమీఁద నెక్కించి నన్ను వెనుకకు అవనిగడ్డకే – ఆస్పత్రి కలదుగాన, మా యన్నగారు కలరుగాన – త్రిప్పిపంపి నాకొక మిత్రుని తోడిచ్చి, బోల్తాకొట్టిన బండిని లేవనెత్తి, దాని మీఁద నా బండిలో వారినిగూడ జేర్చుకొని కళ్ళేపల్లికి వెళ్లిరి. బండి

# 13
# శకునపరిగణనము

అజ్ఞాననిహతమై యుండుటచే దేశమంతట నిట్టి యపభ్రంశపు తలఁపులు నిండారి యున్నవి. పెద్దపెద్దలు, కొమ్ములుదిరిగిన విద్వాంసులు, మహోన్నత పదవులం దున్నవారు గూడ నింటనుండి యేదేని పనిమీఁద బయటికి వెడలునపు డెదురుగా నెవ్వరు వచ్చుచున్నారో యని పరిశీలింతురు. కుగ్రామములో నట్టి పరిశీలనము తగునేమో, అర్థవంతమగు నేమో కాని వేలకొలఁది ప్రజలు గల నగరములలో నట్టి పరిశీలనము చికాకు గొల్పును. సమకాలముననే వీథులలో 'పంచ శుభం పంచాశుభమ్' అన్నట్టు కలసికట్టుగానో, ముందువెనుకలుగానో సభర్తృకలు, అభర్తృకలు, ఒంటి బ్రాహ్మణులు, పల్వురు బ్రాహ్మణులు తారసిల్లుచునే యుందురు. ఇందు పౌర్వాపర్యములు పర్యాలోచించుచుందురు. మఱియు ఫలాని వితంతువు. ఫలాని బ్రాహ్మణుఁడు ఎదురుగా వచ్చినప్పుడు కార్యము నిర్వక్రముగా నిర్వహణము చెందు నని వారు విశ్వసించుశకునశాస్త్రమున కపవాదముగా విశ్వసించుట కలదు. వా రట్లు వచ్చినపుడు మంచిజరుగుట కేవో కారణములు, యుక్తులు నసందర్భముగా నుపాంశువుగా గణించుట కలదు.
తాము ప్రయాణ మగువేళకు బ్రాహ్మణుఁడేని, అతఁడు - కుమారుఁడో, అన్నో, తమ్ముఁడో అయినను నెదురుగా వచ్చినచో వ్యంగ్యముగా మొగము చిట్లించుకొని గర్హించుటో, వాచ్యముగానే తెగడుటో జరగుచుండును. తనయింటిలోనివారే అయినను, పరాయివారే అయినను వితంతువులు వచ్చినచో గర్హించుటయు, ప్రయాణము నిలుపుటయు జరగుచుండును. మఱీ వింత - ప్రయాణ మయిన వ్యక్తి వితంతువే అయిననుగూడ తనకు వితంతు వెదురుగా వచ్చిన గర్హించును. ఈ శకునపరీక్షలవల్ల ప్రయాణముల నాపుకొనువారును, ననివార్యముగా పయన మయినను నిరుత్సాహనిహతిచే నసిగా సాగించుకొనలేక ఎదురు వచ్చిన వారిని గర్హించుటచే వారితోను, వారికుటుంబముతోను దీర్ఘవైరము తెచ్చుకొనువారును నెందఱో ఉన్నారు. రైలు ప్రయాణములకు శకున ముహూర్త పరిగణను చేయుచు అనుకూల శకునముహూర్తాదులకై కొంతసే పాగి పోవుటో, చాల ముందుగానే పయన మగుటో చేయు వారున్నారు.

మన మంచిచెడ్డలకు మనమే ప్రవర్తకుల మనీ, మన సత్కార్యసత్సం కల్పబలముచే మన మంచిని మనమే సాధించుకొనఁగల్గుదుము గా కనీ లోఁతయిన పట్టుదలతో వర్తించు వా రిట్టి చిలిపి చీకాకులకు పాల్పడరు. మంచి శకునముల కెన్నింటికో దుష్ఫలితములు గలుగుచుండుట, దుశ్శకునముల కెన్నింటికో సత్ఫలితములు గల్గుట గుర్తించుచున్ననుగూడ శాస్త్రము ప్రమాణ మని ప్రామాణ్యనిశ్చయము లేకున్నను దానినే విశ్వసించుచుండవలె నని దాని కేవో శ్లోకము లుదాహరించుచు సమర్థించుకొనుచుండుట యజ్ఞానపుఁ బిరికితన మనవలదా? గర్భవతులు గ్రహణములఁ జూఁడరా దనుట, ఆదివారమునాఁ డుసిరికపచ్చడి తినరా దనుట, రాత్రులందు లవణము పేరు - ఉప్పు - అన్న తెలుఁగు పేరే - పేర్కొన రాదనుట (లవణము - బుట్టలోనిది - చెప్పరానిది ఇత్యాది విధములఁ దెలుప వచ్చును.) మొదలయిన విట్టివే.

మన తలఁపులలో, పలుకులలో, పనులలో మంచి చెడుగులు పెనవేసికొని సాగుచున్నవి. చెడుగు లేని యచ్చ మంచితనము మానవత కింకను నంద లేదు. జన్మము లెత్తఁగా నెత్తఁగా సత్త్వము హెచ్చి, కీళ్ళను దొలఁగించుకొని మేళ్ళను పెంపొందించుకొనవలయు నన్న కోర్కె పుటములు పడగా పడగా బంగారుకు వన్నె హెచ్చినట్టు మానవునిలో హెచ్చఁ జొచ్చెను. సద్భావప్రాబల్యము కలిగినప్పుడు ప్రపంచము నాలుగంచుల ప్రజాసంఘము నెల్ల పాఱజూడఁ గల్గినప్పుడు దేశజాతి కులాశ్రయము లయిన నిరర్థకాచారములు తొలఁగి పోగలవు.

స్వీయు లందరు నానాఁడు నా వివాహమునుగూర్చి వివాహిత యగు కన్యనుగూర్చి యతృప్తి చెందిరి గాని, కొంత నాకుగూడ వెఱపు గల్గుస్థితివలె నేర్పడెనుగాని కాలము కొంతగడచినతరువాత నందఱ నిశ్చయములును దల్లక్రిందులై పోయినవి. అవి ముందు తెలియఁగలవు. అట్టిశుభపరివర్తనము కలుగుటకు వివాహమయిన తర్వాత సంవత్సరము లెనిమిది గడవవలెను.

* * *.

ఇంత జరగినతర్వాత డొక్క చెదరి యందాఁక నాకు ప్రతికూలముగా నున్నవా రొకరు లైబ్రరీ వ్రాఁతప్రతుల పాఠముల నెల్ల శశిలేఖ పత్రికలో ప్రకటించిరి. అవి నా ప్రకటించిన తీరునే నిరూపించెను. మఱియు కాకినాడలో కార్చెర్లశ్రీనివాసరావుగా రనువారు పావులూరి గణితపు తాటాకు ప్రతుల సంపాదించి యందలి పాఠములను శ్రీపోలవరంజమీందారుగారు, దురుసేటి శేషగిరిరావుగారు వగైరాల సంతకములతో ప్రకటించిరి. అవియెల్ల నేఁ జెప్పినట్లే యుండెను. అంతతో నా వివాద మడఁగారెను.

ఒకనాఁడు – "నార్తరన్ సర్కార్సు అసోసియేషన్ మీటింగు (యూనివర్సిటి కాన్వకేషన్ తర్వాత) జరగుచుండఁగా నే నక్కడి కేగితిని. అచ్చటికి వచ్చియుండిన వీరభద్రరావుగారు నాయెడ వర్తించిన తీరునకు పశ్చాత్తాపము వెల్లడించిరి. మిత్రుల మయితిమి. ఆనాఁటి సభలో నా పద్యములు పదింటిదాఁకఁ జదువుటయ్యెను. ఆ యేడే శ్రీశొంఠిరామమూర్తి గారు గొప్పగా పరీక్షలో కడతేరి యింగ్లండుకు వెళ్లు యత్నములో నుండిరి. నా పద్య మొకటి –

*ఆంధ్రు లత్యంతదేహబలాఢ్యు లనెడు*
*కీర్తి హెచ్చెను మన రామమూ ర్తివలన*
*ఆంధ్రు లత్యంత బుద్ధిబలాఢ్యు లనెడు*
*కీర్తి హెచ్చెను మన రామమూర్తివలన॥*

వీరభద్రరావుగారు నాఁ డట్లు పశ్చాత్తాపము వెల్లడించిరే కాని కొన్నేళ్ళ తర్వాత మరల నాయెడ వికటముగానే వర్తిల్లసాగిరి. శ్రీనాథుని గూర్చి, ఇం కేవేవో విషయములగూర్చి సత్యదూరము లయినవే కాక ధూర్తములు నయిన రచనముల నాయెడ జరపిరి. వాని కెన్న ఁడు గాని వారికి నేను బదులు వ్రాయఁ దలఁపలేదు. శ్రీవీరేశలింగముపంతులుగారు పరమపూజ్యులు, మహనీయులు నయ్యు నహమిక, మమకారము నధికముగాఁ గల వారని తర్వాత తలఁపనయ్యెను.

నిరుపమానమహామహిమోపేతులు పురుషోత్తములు గంధిగారు పేర్వెలసిన పిదప మానవమర్యాదయే యసాధారణయోగ్యత నందుకొనఁ



గల్గెను. వారి శీలజ్యోతిముం దంతకు ముందు పేర్వెలసిన పెద్దల ప్రకాస్తు లెన్నో వెలవెల లాడవలసిన వయ్యెను.

శ్రీలక్ష్మణరావుగారు వీరేశలింగముపంతులుగారి నొకనాఁడు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు గొనివచ్చి–వా రప్పుడు కవులచరిత్రను సంస్కరించి ప్రకటింపఁ బూనియున్నారుగాన–వారి కస్మదాదుల సహాయము లభింపఁ జేయుటకై జతనము సాగించుటలో న న్నెఱుక పఱచిరి. పావులూరి మల్లనచరిత్ర విషయములు వీరేశలింగముగారి దగ్గఱ, నా దగ్గఱ చర్చించి తత్త్వము నిర్ణయింప నభిలషించిరి. అన్ని వ్రాఁతప్రతులను జూపి, నావాద మెఱిఁగించితిని. వీరేశలింగముగారికి వేఱు విధముగా, పూర్వము తాము వ్రాసినతీరుగా సమర్థింప నయితి గాదయ్యెను. లక్ష్మణరావుగారు జాగ్రత్తగా నెల్లవిషయము మరల ననువదించి వివరించి 'మీరిఁక నిట్లు మార్చుకోవలసినదే. మీరు తొలుత వ్రాసినదియు, మిమ్ము సమర్థింపఁ బూని యితరులు వ్రాసినదియు సరికా దని స్పష్టపడినది' అనిరి. పంతులుగారు 'నాదగ్గఱ వ్రాఁతప్రతి యేదో ఉండుటఁబట్టియే యట్లు వ్రాయుటయ్యెను. రాజమహేంద్రము వెళ్లి నాదగ్గఱి గ్రంథములఁబట్టి మరల పర్యాలోచించి నిర్ణయింతును' అనిరి. లక్ష్మణరావుగారు 'ఇన్ని ప్రతులలో నున్న దానికి విరుద్ధముగా మీ వ్రాఁతప్రతి యుండదు. ఉండినచో సరిగా సమర్థముగా మీ వాదము నిర్వహించుకోవలసి యుండును' అనిరి. 'పంతులుగారి పట్టుదలను పరిభావించుచు వీరేశలింగముగారికి మన మందఱము సహాయము చేయుదము. వారి చేతనే కవులచరిత్ర సంస్కరణము జరపింతము' అని లక్ష్మణరావుగారు చెప్పిరి. నా చేతనయినంత తోడ్పాటు జరపుదు నంటిని. వా రిర్వురు నింటికి వెళ్లిరి.

అటనుండి వీరేశలింగముపంతులుగారు బెంగుళూరు కొలఁది దినములకే వెళ్లిరి. కవులచరిత్ర ప్రథమభాగమున మాత్రము చేయవలసిన సంస్కరణములు నే నెఱిఁగినంత బెంగుళూరికి వ్రాసి పంపితిని. అది యొక పెద్దకట్ట. పంతులుగారు వాని నుపయోగించుకొనిరి. కాని వాని నాయాపట్టు లందు పేర్కొననే లేదు సరికదా! గ్రంథపీఠికలో – 'శాస్త్రి గారును...తమ

నాకు నాల్గయిదు విరేచనము లయ్యెను. దొడ్డిలోనుండి యింటిలోనికివచ్చుట యెఱుఁగుదును. స్మృతి తప్పి పడిపోతిని. కొంతకు స్మృతి వచ్చిన ట్లయ్యెను. నాడి చూచుకొంటిని. నిమిషమునకు రెండు వందల దాపుగా కొట్టుకొనుసంఖ్య యుండెను. గుండె యెగసి పోవుచుండెను. దగ్గఱగా నున్న రామేశం గారిని పిలుచుకొని వచ్చిరి. వారు నాడిచూచి అపాయస్థితిలో నున్నట్లు గుర్తించి వెంటనే డాక్టరు నంజుండరావుగారికి చీటీ వ్రాసి మనిషిని బంపిరి. నాస్థితి గందరగోళముగా నుండెను. అప్పుడే కాచిన పాలు రెండళాకులు గబగబ త్రాగివేసితిని. పదినిమిషములకు ప్రాణ మందుకొను చున్నట్టు తోఁచెను. అంతలో నంజుండరావుగారు వచ్చి పరీక్షించిరి. 'తీవ్రమయిన టైఫాయిడ్ జ్వరము. వెంటనే యీక్రింది మందులు తెచ్చియియ్యండి' అని చీటి వ్రాసి యిచ్చిరి. గుడ్విన్ కంపెనీవారు మందు లిచ్చిరి. ఆ మందులు త్రాగిన పదినిమిషములకే ప్రాణము ససిగా చేరుకొనెను. జ్వరము 22 దినములకు తగ్గినది. ఈ నడుమ కొన్ని యొడుదుడుకు స్థితులును గలిగినవి. ఏమి కలిగినను వారిచ్చిన మందులు వెంటవెంటనే నాకు గుండె నిబ్బరము కలిగించుచు వచ్చెను.

ఒకనాఁడు విరేచనము లగుట కేదో కొంచెము మందిచ్చి మామూలు మందులు పుచ్చుకొనవలదనిరి. ఆనాఁడు నాకు నిస్త్రాణ హెచ్చెను. డాక్టరు రాగానే 'దినము త్రాగే మందు నేడు త్రాగవ ద్దంటి రట! అవి త్రాగగానే నాకు పుష్టి కలిగెడిది. నే డట్లు లేదు' అంటిని. ఆయన నావీపు చఱచి, నవ్వి 'మరల వానిని తీసుకొనుడు' అనిరి. జ్వరము తీసిన తర్వాత అవి చికిన్ బాతు బ్రాందిలో కలిపిన దొకటి, ద్రాక్షాసవమువంటి దింకొకటి యగుట తెలియవచ్చెను. ఆతర్వాత రోఁత గొంటిని. కాని యప్పటిదాఁక నా కవి యమృతకల్పములుగా దోఁచెను.


ఆ జ్వరతీవ్రతలో నా జీవితమునుగూర్చి సంశయ మేర్పడి మా బావగారు జాబు వ్రాయఁగా నా మిత్రులు శ్రీసుసర్ల కుమారస్వామిశాస్త్రిగారు, మా మామ గారు, మా తలిదండ్రులు, అన్నగారు మద్రాసు వచ్చిరి. ఆ తీవ్రానారోగ్యపు నాళ్ళలో తమకుమార్తె రజస్వల యయ్యె నని మామామగారు జాబు వ్రాసిరి. ఆ స్థితి మావారికి మఱింత వ్యాకులత గొల్పెను ఎట్లో జ్వరము తగ్గినది. ఆరోగ్యవంతుఁడ నయితిని. నాస్థితి విని విచారించి నంజుండరావుగా



రార్నెల్లు లీవు పెట్టి యింటికి పోవలసిన దనియు, ఇతర వ్యాధులేవి లేవుగాన వడివడిగా ఆరోగ్యము కోల్కోగల దనియు, ఆ టైఫాయిడ్ జ్వరం తగ్గినతర్వాత నూట తొఁబది మందికి సహజముగా సంపూర్ణారోగ్యము పెంపొంది జ్వరమునకు పూర్వ ముండిన యనారోగ్యవాసనలుకూడ తొలఁగి విజృంభణముతో నుండ గల్గుదు రనియు, సంపూర్ణారోగ్యము బలము పడసి మూన్నెల్ల తర్వాత గార్హస్థ్యసుఖస్థితిని బడయుదుగా కనియు, ఆర్నెల్ల తర్వాత మద్రాసుకు సకుటుంబముగా వచ్చి వేయుదువు గా కనియు ననిరి.

వాని కేవో యపవాదములు తోఁచసాగెచు. ఏమి తోఁచినను స్వామి గోచరింపఁ డయ్యెనే కదా యన్న యారాటము నన్ను వీడలేదు.

ఈ సందర్భ మీ గ్రంథము రచించునాఁటి కిందుమించుగా నల్వదియేండ్లకు పూర్వము జరిగినది. 1910వ సంవత్సరము నాఁటి దీ వృత్తాంతము. తర్వాత 1930 నుండి తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని గూర్చి కొంత యెఱుక నాకుఁ గలుగసాగెను. 1949 నాఁటికింక నెన్నో విషయములు గోచరించెను. వాని నాయాసందర్భములలో సక్రమముగా వివరింతును.



# 17

## తొలి కలయిక

నాకు టైఫాయిడ్ తగ్గి యారోగ్యము లభించునాఁటికి జీవితవాంఛలు రెండుగలవంటిని. తొలిది శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనము. అది తొలుత నగమ్యగోచరముగా నుండుట, యీనాఁటికిఁ జాల విషయములు దెలియనగుట రేఖామాత్రముగాఁ జెప్పితినిగదా! రెండవది వివాహ మాడితిని గనుక అచుంచిత ప్రక్రియ యగు స్త్రీసుఖము ననుభవింపగోరుట అదియేదో వేంకటేశ్వర దర్శనమువలె నపూర్వాద్భుతాతి లోకానందము గొల్పునదిగా నుండఁగలదనుకొనుచు నువ్విళూరుచుంటిని. ఈ రెండు నెఱవేరినచో నా జీవితప్రయోజనము లభించినట్టే యనుకొంటిని.

తిరుపతి నుండి యింటికి వెళ్ళిన తోడ్తో నారోగ్యవృద్ధి క్షణక్షణ విజృంభణము గాఁజొచ్చినది. మా తలిదండ్రులు వగైరాలు మద్రాసు నుండి వచ్చుదాఁక ఇంచుమించుగా పదునైదునాళ్ళు నా మిత్రులు శ్రీ సుసర్ల కుమారస్వామిశాస్త్రి గారి యింటనే యుంటిని. వారును, వారి కుటుంబిని శ్రీమతి రామమ్మగారును నన్ను బిడ్డనుగాఁగాపాడిరి. ఆకలి నా కమితముగా రేగుచుండెను. కుమారస్వామి శాస్త్రిగారిని నేను నా భృక్తరహిత తారకరాజయోగానుష్ఠానమున తర్వాత 1917వ (03.02.1917) సంవత్సరమున చేర్చితిని. కాని వారు దుర్బలమయిన చిత్తవృత్తి కలవారు గానయిందు శ్రద్ధాళువులు కారయిరి. దుస్సహవాసముల మరగి సంపదారోగ్యములను సంపూర్ణమగాఁ జెడగొట్టుకొనిరి. వారి భార్యగారు ముందుగాను, 1928 ప్రాంతముల గాబోలు వారును చనిపోయిరి.

కుమారస్వామిశాస్త్రిగారు చనిపోయిన పదవనాఁడు నేను ధ్యానము చేసి కొనుచుండఁగా నా కన్నుల యెదుట స్పష్టముగా గోచరమై చిఱునవ్వు నవ్వుచు 'నీ మంచి సహవాసమును దూరస్థుఁడనుగా నుండుటచే కోల్పోయి నీమాట వినక దుస్సహవాసముల జిక్కి చెడితిని. శారీరక వాంఛలు నన్నట్టుగా నాకట్టుకొని పెడమార్గము బట్టించినవి. చక్కబఱుప సాధ్యముకాని

సంతోషము గాని సంతాపము గాని యంతరంగమును కలవరపఱచుచున్నప్పుడు దాని చేష్ట యకృత్రిమముగా, స్పష్టముగా నున్న దున్నట్లు కొందఱ ముఖమున గోచరించును. కొందఱు లోని సంతోషము దాఁచి యుంచుకొని ముఖమున సంతోషమును దోపనీయకున్న మానెగాని, యేవో ప్రయోజనములర్థించి పైగా విచారమునే వెలయించుకొనఁ గల్గుదురు. ఎంత దుఃఖకారణము కల్గినను దాని బలమును వివేకముచే తగ్గించుకొని దానిని లోనగూడ భావింపకుండుట మంచిది గాని లోన కుములుచు బైటికి నవ్వు దెచ్చుకొనుట రోఁతయే. ఆ నవ్వు వెడన వ్వగును కాని తియ్యని నవ్వుగా తెరలు వాఱదు. స్మిత ప్రయత్నమే కాని దాని సత్ఫలితము కలుగదు.

తాను ప్రేమించువా రెవ్వరు గాని తప్పు చేసినట్టు తాను భావించునప్పుడు వారిని సరిదిద్దఁగోరునపు డాయా వ్యక్తుల వివేకపరిపాకము ననుసరించి కోపసూచనలు చేయుట, గర్హించుట, తిట్టుట, కొట్టుట గూడ జరగుచుండును. అందులో నంతరంగమున నవ్యక్తముగా, స్థాయిగా అనురాగమే కుదుర్కొనియుండును. అట్టిచో చివ్వన కోపము రేగును. కోపసూచన మొదలుగా కొట్టుటదాఁక వివేక పరిపాకానుసారముగా నొక చేష్ట జరగుచుండ అంతరంగమున కేసి చూడఁగా నక్కడ అనురాగ రేఖలు నవ్వుచుండుట, అవి తన్నేకోపించుట,తిట్టుట,కొట్టుట,జరపినట్లయి యిఁక నిట్టి చేష్టలు చేయకుమా యని మందలించుట అంతరాత్మా వేక్షణానుభూతి కలవారికి గోచరించును. రేగిన యా కోపోద్రేక మా మానవుని యంతరంగము తనలో హాయిగా నున్న యనురాగము శరీరాణువులం దంతటను నిండారుటకు చేయు జతనములో తనకు విరుద్ధమయిన, తనతో లోనుండ గూడని కోపపు బండాలము నదనుచూచి బైటికి వెడలగొట్టునప్పుడు చెలరేగి బయట బడినదిగా గుర్తింపనగును. శరీరమును జుట్టియుండు నావృతి దాకఁ నది యెఱ్ఱని పొగలతో చెలరేగి దిద్దుబాటు చెందవలసినవారిని దాఁకి వారి యానుకూల్య ప్రాతికూల్య, సౌమనస్య, వైమనస్య, ప్రాబల్య, దౌర్బల్యా ద్యనుగుణముగా దాను చేయఁగల మంచిని జేసి యుపరత మగును. ఈ విధముగా నప్పు డప్పుడు లో నిల్వయున్న కోపపు సరకులో నెంతో కొంత



అసత్పదార్థ మగుటచే నిలువ వీలులేనిది కాన కర్పుపడి పోగా పోగా లో స్థాయిగా నున్న ప్రేమ సత్పదార్థము గాన శాశ్వతమై పెంపొందుచుండును. దీని నాత్మావేక్షణ పరులు గుర్తింపఁగల్గుచుందురు. అంతరంగమున స్థాయిగా ననురాగము, ప్రేమ ఉన్న సందర్భములను గూర్చి వ్రాసినది.

ఆత్మావేక్షణపరులు లోనికి బోగా పోగా ఇఁక పోవ నెడము లేకుండ కడపటి హద్దుగా గుర్తింప నగు నెలవు ప్రేమైకమయముగానే ఉండును. ప్రేమ సత్పదార్థము.కాన నిత్యము. ఆ స్థలమున ప్రేమేతర (ద్వేష) వాసన కూడ నుండదు. అద్దానిని జేరుకొనుటకై లోనికిబోను పోను, ప్రేమేతర పదార్థము పలుచబడుచు సన్నసన్నగా దిగనాసిల్లుచుఁడును. ప్రేమపదార్థము చిక్కనగుచు దాని విజృంభణము అంతరంగముననే కాక బహిరంగమునఁగూడ 'అంత ర్బహిశ్చ' క్రమక్రమముగా నిండారును. అసలు తత్త్వాన్వేషి సముద్రమథనకథగా సత్సంకల్పపు మందర పర్వతమును శరీర సముద్రమున దింపి శరీరము మథింపగా లోనుండి మంచిచెడ్డలు రేగుచుండును. చెడుగులను దొలఁగఁ ద్రోసికొనుచు మంచిని గుర్తించి స్వీకరించి యనుభవించుచు బోవఁగాఁ దుదకు అమృతలాభము కలుగును. ఇందు మూలాధారము కూర్మ మగును.

అప్పుడే గార్హస్థ్యము నందిన మా బావగారిని నా దుఃఖకారణము విచారింపఁగోరిరఁట! ఒకనాఁడు నిద్రలేచి యూరి నంటియున్న మా పొలమున కరిగి అక్కడి మా మంచినీటిబావికడ కాలకృత్యముల దీర్చుకొని స్నానోన్ముఖుఁడ నగుచు తాటిచెట్టు చాటుల కరిగి దుఃఖ కారణము ప్రశ్నించిరి. ఏమి లేదంటిని. విన్నను, అది చెప్పినను మీరు దాని విలువగుర్తింప లే రంటిని. ఆతఁ డేదో గొప్ప దోషము నాలో నున్న దనుకొని తీవ్రముగా చకితుఁడయి పదింబదిగా ప్రశ్నింపఁ దొడఁగెను. నా కేదో యోగ్యతాలో పభీతి కలదని యాతఁ డనుమానపడుచున్నట్టు తోఁచెను. ఇఁక డాపరాదని యున్న దున్నట్టు చెప్పితిని, మా తలిదండ్రుల పతనము గోచరించుచున్నట్టున్న దన్న మాట, మా తలిదండ్రులతో చెప్పరా దని యాన వెట్టితిని. అంతా విని యాతఁ'డయ్యో యిదా నీ యేడుపు!' అని పగలబడి నవ్వఁ జొచ్చెను. 'లోకసాధారణమయిన భావములను నీతలనే విఱిగిపడిన వానిగా భావించి

వారము చదివి యిచ్చుటకు వా రింటికి దెచ్చుకొనిపుస్తకము లేమాత్రము చెడకుండ చదివి వారి కిచ్చవేయుచుండెడివారు. ఆ గ్రంథ విషయముల గూర్చి మిత్రుల కందరికి తెలియజెప్పుచుండెడివారు. వారు గ్రంథములను జదువుట పుస్తక విక్రేతల కధికలాభాపాదక మగుచుండెడిది. వారి గ్రంథపఠనోత్సాహము నాకును జక్కిలిగింత గొల్పినది. లైబ్రరినుండి ముద్రిత గ్రంథముల దెచ్చుకొనుచుండెడి వాఁడను. ఒకటే చదువు! అప్పటి నావయ స్సిరువదియాఱు.

అప్పుడు తెలుగుదేశమున పెక్కుచోట్ల కలరా వ్యాపించియున్నది. మద్రాసులోను కలరా ఉన్నది. బందరులో మా బావగారి తల్లి కలరా వచ్చి మృతి చెందెను. మద్రాసునుండి మా బావగారు, మా తోబుట్టువు ఆమెగారి యౌర్ధ్వదైహికమునకు బందరు వెళ్ళిరి. వారు తిరిగివచ్చు నప్పుడక్కడ నుండి కొన్ని మొక్క జొన్నకండెలు తెచ్చిరి. వారి రాక తెలిసి ఆఫీసునుండి యింటికి వచ్చిన తర్వాత వారి యింటికి వెళ్ళి అక్కడి కష్టసుఖములు విచారించి వచ్చితిని. వచ్చునప్పుడు మావా రీయఁగా మొక్కజొన్న కండెలు తెచ్చితిని. రాత్రి మే మందఱము వానిని భుజించితిమి. నిద్రలో రాత్రి రెండుగంటలవేళ నాకు మెలఁకువ, శరీరమంతా అలజడి. కలరా వ్యాధి క్రమ్మి ఆ మొక్కజొన్న కండెలతో అంటి వచ్చి నాలో చొచ్చినట్టు, నాకు కలరా వచ్చినట్టు భావన బహిర్భూమికి వెళ్లవలసెను. రాత్రి గనుక నేనున్న చోటు (తిరువళిక్కేణి సాతానివీధి తుదిమేడ) కొబ్బరితోటలు గలది గనుక యిల్లు విడిచి బైటికే వెళ్ళితిని. వట్టి గాలియే అమితముగా వెళ్లెను, గాని విరేచనము కాలేదు. ఇంటికి వచ్చి యీజిచైరులో కూర్చుంటిని. ఒడలెల్ల కంపించి పోవుచుండెను. నాల్గు మూఁడు గజముల దూరమున–బందరులో కలరాతో చనిపోయిన మా బావగారి తల్లిగారు అఱువది యేండ్ల వృద్ధ ధూమ్రదుఃఖితాగ్రహా విష్టాననముతో ప్రత్యక్ష మగుచుండెను. చీకాకు కలిగెను.

అంతకు ముందట్టి దుర్దర్శనము నే నెన్నఁడు నెఱుఁగను. నిద్ర రాక చీకాకుతోనే ఆ రాత్రి గడపితిని. ప్రొద్దుట శరీర మంతయు కీలుకీలు విఱిచినట్టు



నొప్పి. పదిగంటలవేళ ఆఫీసుకు పోవలెను గాన భోజనము చేయబోయితిని. ఒక ముద్ద మ్రింగితినో లేదో ఒడలెల్ల అదరి చల్లబడి పోయి మృత్యుముఖమున నున్నట్లయితిని. తమ్ములు స్కూలుకు వెళ్ళిరి. నేఁడు హైకోర్టు జడ్జిగా నున్న చింతకుంట రాఘవరావుగారు నేను నొక యింటనే యుంటిమి. డాక్టరు నారాయణ స్వామినాయనిగారిని రాఘవరావుగారే పిలుచుకొని వచ్చిరి. ఆయన వచ్చి పరీక్షించి విరేచనములకు మందిచ్చి జబ్బేమి లే దని వెడలి పోయెను.

అప్పటికే మొదటిమహాసంగ్రామ మారంభ మయి సాగుచున్నది. ఆ యుద్ధమునుగూర్చి క్షోభ నాలో తీవ్రముగా సాగజొచ్చినది. నా యనారోగ్యము దుర్భరముగా నుండెను. డాక్టరు నంజుండరావుగారు మందిచ్చుచుండిరి. అట్లు నాల్గయిదురోజులు గడచినతర్వాత నొకనాఁడు నా దేహ మెల్ల చిమ్మచీకట్లు క్రమ్ముచున్నట్లయి ఒడలెల్ల ధారలుగా చెమటలు దిగజారి లోననుండి తీవ్రబలము ప్రజ్ఞ పొంగారుచున్న ట్లయ్యెను. నంజుండరావుగారు నరములకు, గుండెకు బలము గలుగుటకు మందిచ్చు చున్నారు గాన దానికార్యమది యనుకొంటిని. ఆనాఁడు తీవ్రోత్సాహముతో నుంటిని. నంజుండరావుగారు కొన్నాళ్లు సెలవు పెట్టి స్వగ్రామమునఁ గొన్నాళ్ళుండి రమ్మనిరి. నెల కాఁబోలు సెలవు పెట్టితిని. ఇంటికి నేనొక్కఁ డనే పయన మయితిని. తమ్ములు, భార్య మద్రాసులోనే యుండిరి.

బందరులో గురువర్యులగు శ్రీ వెంకటశాస్త్రి గారికి కాబోలు నేదో బంగారు వస్తువు వారు సొమ్ము పంపగా చేయించుచుంటిని. దానిని తీసికొని వచ్చుటకై ఆఫీసునుండి సాయంకాల మారుగంటలవేళ టౌనులోని కరిగితిని. చెన్న కేశవ స్వామి గుడిప్రాంతముల నున్నది యా సెట్టిగారియిల్లు. నేను వెళ్ళి సొమ్మిచ్చి వస్తువులను దీసికొని, మీసోదరుఁడేడి యని యా సెట్టిగారి నడుగగా నేఁటికి పదునైదు రోజుల క్రిందట ఆతఁడు శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయమునకు రాత్రి పదిగంటలవేళ వెళ్ళి యక్కడ పూజోత్సవాదులు దర్శించుచుండగా ఎమ్డెన్ గుండు దెబ్బ వినవచ్చెను. ఒక గుండులోని తునుక

# 19

# అనారోగ్యము

అప్పటికి ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నాకు మంచి వేతనాభివృద్ధి యేర్పడెను. మదరాసు రాష్ట్ర మంతటను ప్రాచీన గ్రంథములను సంపాదించుటకై కొంద ఱుద్యోగులను ప్రభుత్వమువారు నియమించిరి. అందు న న్నొక ముఖ్యునిగా నియోగించిరి. నే నందు ప్రవేశించితిని. కాని యీ యనారోగ్యముచే సెలవు పెట్టవలసినవాఁడ నయితిని. ఆ గ్రంథార్జనకార్యము పెక్కేండ్లు సాగునదే యయినను ఆ యుద్యోగములు టెంపరరీగానే యేర్పాటు చేసిరి. ఆ టూరింగు పార్టి కార్యకలాపము తోడ్తో ప్రారంభింపవలసినదిగా నుండెను. నేను దీర్ఘానారోగ్యగ్రస్తుడనగు చుంటిని. కావున నన్ను తొలగించి, నాయుద్యోగము నింకొకరి కిచ్చిరి. నేను పర్మనెంటు పోస్టుకే రివర్టయితిని. సెలవు గయికొంటిని గనుక యింటికి వెళ్ళితిని. మూఁడేండ్లు బాధపడితిని.

మదరాసులో నుండఁగా మార్చిమార్చి నంజుండరావుగారు పెక్కుమందు లిచ్చిరి. ఎన్ని యిచ్చినను గుణము కనుపడదయ్యెను ప్రత్యుత ఔషధము గయికొన్న యాపూటనే అది యనారోగ్యము నధికపఱచునదిగా నగుచుండెను. ఔషధము లట్టెవలదు. 'శానిటోజన్' మాత్రము ఆహారముగ తీసికొనుచుండు' మని నంజుండరావు గారు చెప్పిరి. ఇంటికి. వచ్చిన తొల్తటి దినములలో నది కొన్నాళ్ళు తీసికొనసాగితిని.

ఒకనాఁడు రాత్రి భోజనానంతరము శానిటోజన్ పాలతో తీసికొన్న కొంత సేపటికే శరీరమున నరము లెల్ల క్రమము తప్పి యెక్కువగా బిట్టు బిగించి యాడించి విడిచిన ఫిడేలు, వీణతంత్రులవలె కదల్చితే కదలితే త్రుటితములయిపోవున ట్టదరుపాటుతో సంకట పెట్టసాగెను. మంచము మీఁద నుండి యదలించి ఎగురఁగొట్టి క్రింద పడవేయుచున్నట్టు కాఁజొచ్చెను. ఆ రాత్రి యెల్ల నిద్రలేక చాల బాధపడితిని. శానిటోజన్ మానివేసి చల్లని భోజనము చేయుచుంటిని. రాత్రులందు క్రమముగా కొంతసేపు నిద్ర పట్టసాగెను.

అప్పటికే రెన్నెల్లో మూన్నెల్లో కయికొన్న సెలవు ముగిసెను. దినదినము ఆంధ్రపత్రిక చదువుటలో నందు చదివిన యుద్ధతీవ్రతలు నన్నల్లకల్లోలపఱచుట చెలరేగుచునే యుండెను. అయినను మా వాళ్ళలో కొందఱు జ్వరమా, తలనొప్పా, ఆకలి లేకపోవుటా, ఏ జబ్బులేదు. పిఱికితనముతో ఇంటఁ గూర్చున్నాఁడని నిందించుట నాకు దుస్సహముగా నుండెను. మా తల్లిదండ్రులు. అక్కగారు, భార్య ఏమియు ననఁజాలక దుఃఖించుచుండిరి, సాహసించి నేనొక్కఁడనే మద్రాసు వెళ్ళి డ్యూటిలో చేరుదును గాకని బండిమీఁద బందరు వచ్చితిని. ఒక మిత్రునింట నానాఁడుంటిని. గురువులగు శ్రీ వెంకటశాస్త్రిగారిని దర్శించితిని. వారితో, వారికి నాకు మిత్రుఁడును, డిగ్రీలు లేకున్నను ఆంగ్లవైద్యము చేయుచు ప్రఖ్యాతుఁడుగా నున్నవాఁడును నగు నొక వైద్యుని జూడ నరిగితిమి. అతఁడు నంజుండరావుగారి మందుల ప్రిస్క్రిప్షన్‌లు చూచి 'ఇవి చాలా తేలిక డోసులో నున్నవి' యని వానిలో ప్రధానౌషధ మొకటే నరములకు బలము గొల్పు ననీ, అది యొక సీసా పుచ్చుకొమ్మని చెప్పెను. అప్పుడే దానిని గొని కయికొని మద్రాసు వచ్చితిని.

అది పుచ్చుకొన నారంభించి డ్యూటిలో జాయిన్ అయితిని, రెండుపూటలకే అది యొడలెల్ల మంట లెత్తించి నిద్ర పట్టనీయక నరముల బిఱ్ఱబిగించి యదరి పడున ట్లెగురఁ గొట్టసాగించెను. 'భ్రష్టస్య కా వా గతిః' అన్నట్టు అది మాని నంజుండరావుగారిని మరలఁ జూడజాలక ఇంకెవరెవరి దగ్గఱనో మంచి డాక్టర్ల దగ్గఱనే మందులు గయికొననారంభించితిని. అవి మఱి మఱీ గగ్గోలు పఱచెను. తిరువలిక్కేణిలో నాకు పరిచితుఁడగు నొక డాక్టరు 'ఫాస్ఫరస్' ప్రధానముఁగా గల మాత్రలు పది యిచ్చి 'ఈ పదీ నిస్సంశయముగా కడముట్ట దినమునకు రెండు చొప్పున పుచ్చుకొని మఱీ యగపడు' మని చెప్పి పంపెను. మద్రాసులోని మావారు పుచ్చుకొని తీరవలసినదని నిర్బంధించిరి. పుచ్చుకొన నారంభించి నప్పటి నుండియు నోరు తడియారిపోవుట, రేయుంబవళ్ళసలే నిద్రలేకపోవుట, ఒడలెల్ల నెఱ్ఱబాఱిమంటలెత్తుట, కడుపులో, ప్రేగులలో మంటలు మఱీ యెక్కు వగుట యయ్యెను.

క్షణికం క్షణికమ్" "సర్వం స్వలక్షణం స్వలక్షణమ్" అనువాని యర్థము సదా అనుభూతి కందు చుండెడిది. ఆ పలుకు నాల్కమీఁద మెదలు చుండెడిది.

చిన్ననాఁటనుండియు భవభూతి యుత్తరరామచరిత్ర మన్న నాకు పరమానందము. అందులోని పలుకులు, 'జగజ్జీర్ణారణ్యమ్... కుకూలానాం రాశౌ తదను హృదయం పచ్యత ఇవ' అన్నవి సదా నాతలఁపులో మొదలు చుండెడివి. 'జగజ్జీర్ణారణ్యమ్' అనుటకు గొప్ప వివరము కానవచ్చెడిది. అరణ్యమేని, అందు ఛాయాఫలపుష్పవృక్షములు, లతాగుల్మములు, జలాశయములు, పక్షికలకలములు, దృశ్యజంతు విహారములు, మనుష్యసంచారములు నుండును. ముండ్లపొదలు. వ్యాఘ్రాది ఘాతుక జంతువులు, సర్ప, వృశ్చిక, వృక్షాదులు నున్నను నుండును గాని పుష్పఫలాదులకై యందు ప్రవేశించువారు–కంటకాద్యపాకరణ సాధనములఁ గొని నిరపాయముగా కార్యము నిర్వర్తించుకొని రాఁగలరు. జీర్ణారణ్యమున ఛాయా ఫలపుష్పవృక్షము లుండవు. జలాశయము లుండవు. లతాగుల్మము లుండవు. ఎండుటడవి, రక్కెసమట్టలు, చీకిరేనుపొదలు, పాములు, తేళ్లు, తోడేళ్లు మొదలగు నవి మాత్రమే ఉండును. కర్మవశమున త్రోవదప్పి యెవఁడే నందుఁ జేరెనా వాఁడక్కడ కడతేర వలసినవాఁడే యగును. జగత్తొక జీర్ణారణ్యముగా, దుర్విధిచే నే నందు చేరినట్టుగా భావించెడివాఁడను.



# 21

## వెలుఁగునీడలు

భవభూతి పునరుక్త మయిన యీశావాస్యోపనిషద్వాక్యము "అసుర్యా నామతే లోకా అంధేన తమసావృతాః తాం స్తే ప్రేత్యాభిగచ్ఛన్తి యేకే చాత్మహనో జనాః" అన్నది యాత్మహత్యా సంకల్పజ్వాలలను జల్లార్చి వేయు చుండెడిది. కడు పసిప్రాయమున కనులు మూసికొని బోరగిల పడుకొని చూచుచుండినపుడు "నేనునే" నని నాలో గోచరించిన మినుకు మినుకు గ్రుడ్డివెలుఁగే దూరమున గోచరించి జీవితాశోచ్ఛ్వాస మాడించుచుండెడిది.

మందులు మానితిని గనుక మావారు మంత్రములకేసి దృష్టి సారించిరి. వారిని వీరిని పిలిపించి మంత్రజపము చేయింప నుద్దేశింపఁగా నేను వారింపఁ జొచ్చితిని. ఆ మంత్రప్రయోక్తల యోగ్యతలు నే నెఱిఁగినవే. కనుక వారిని బిలిపింప నొల్లనయితిని. నా యనారోగ్యమును నన్నడిగి విద్వాంసుఁడు గదా యని నేను చెప్పఁగా విని వేద శ్రౌత విద్యావిశారదుఁ డొకఁడు 'ఏఁబది రూపాయలు తెచ్చుకొని నాకిచ్చితివేని నీకు మోహిని పట్టినది. దానిని తొలఁగింపగలను' ఇత్యాదిగా నేదో చెప్పెను, ధిక్కని తెగడితిని, అనుదినము సహస్రగాయత్రీ మంత్రజపము చేయుచు నమాయకుఁడుగా నుండు వృద్ధబ్రాహ్మణు నొకని–ఆయన కుమారుఁడు మాయూర స్కూలుమేష్టరుగా కొన్నాళ్ళుండెను–బిలిపింప నుద్దేశింపఁగా నేను వల్లె యంటిని. వారిని గ్రామాంతరమున నుండి పిలిపించిరి. నలుపది దినములు మంత్రజప మాయన జరపెను. ఆయనవల్ల నా కేమాత్రము మేలు జరుగబోదని నేను బిగ్గ పలుకుచుండెడివాఁడను. వీనికిఁబట్టిన గ్రహచారమో, గ్రహమో ఉపకారకము లయిన పద్ధతులపై వీనికి విశ్వాసము కుదుర నీయకున్నదని మావారు తెగడఁజొచ్చిరి. "నిజమే! నాకిట్టి వారి ప్రజ్ఞమీఁద విశ్వాసము లేదు. అదే నా జబ్బు అనుచున్న వారు మీరో వారో కదా దానిని గుదుర్ప వలసిన వారు. "నాకు విశ్వాసము కొల్పుఁడు" అనువాఁడను. నలువది నాళ్ళయిన తర్వాత జపఫలము నాకు ధారాదత్తము చేయుటకు గొప్ప బ్రాహ్మణ

కని నిశ్చయించుకొంటిని. ఆత్మహత్య యసుర్యనరక ప్రాపక మన్న చింత రేగెఁగాని పాండవాదుల మహాప్రస్థానము పాపాపాదకముగాఁ గాక పాపాపనోదకముగాఁ జెప్పబడుట గోచరించి సమాధి గూర్చెను.

క్యూరేటరుగారు డిస్మిస్ చేయునందాఁక నెందుకు? నేనే రిజిగ్నేషన్ చీటి పంపుదునుగా కని నిర్ణయించుకొని అట్టి చీటి వ్రాసి చేత నుంచుకొంటిని. తొమ్మిదిన్నర గంటలకు భోజనము చేసి నౌకరి చెల్లు చీటిని నాతోపాటు నౌకరిలో చేరినవాఁడు, నా కంటె దుఃఖించుచుండువాఁడు నగు గుమాస్తా యింటికి వెళ్ళి యిచ్చివేయ నిశ్చయించుకొంటిని. హోటలుకు భోజనమునకు బోగా జనార్దనుఁడు జబ్బుగా నుంటి నని నాకై ప్రత్యేకముగా కారము లేకుండ చాల రుచ్యముగా కూరలు, పచ్చళ్ళు చేయించెను. ఆతఁడు మామూలుగానే చేయించె నేమో కాని నాకు మాత్రము నాఁటి భోజనము. కొన్ని యేండ్లకు పూర్వమెప్పుడయిన చేసియుందునో లేదో అన్నంత రుచ్యముగా నుండెను. కడుపారనారగించితిని. శరీరమున కుత్సాహము తోఁచెను. నరముల బలము చక్కబడిన ట్లయ్యెను. 'నేఁ డాఫీసుకు పోయి పని చేయగల్గుదనా? జబ్బు కుదురునా? నేఁడీ యుత్సాహ మేమి? ఏమో! డ్యూటిలో నుండఁజాలను. హరిద్వారము వెళ్ళవలసినదే! గంగలోఁ గలయుట మాట అక్కడ నిర్ణయించుకొందునుగాక!' ఇత్యాది విధముల యోచనలతో అక్బరు సాహెబు వీధిలో వచ్చుచుంటిని.

# 22

## వెలుఁగుబాట

రోడ్డుమీఁద అబ్బూరి జగన్నాథరావుగా రను మిత్రుఁ డగపడి నా చేయిపట్టుకొని 'మీరు ప్రభాకరశాస్త్రిగారేనా? ఇట్లుంటి రేమి?' అని యడిగెను. మూఁడేళ్ళ నుండి జబ్బుగా నుంటి నంటిని. ఏమిఁ జబ్బు అనుచు నాతఁడు నన్నింటిలోనికిఁ గొనిపోయెను. శూన్యహృదయముతో నేను లోని కరిగితిని. అక్కడ శ్రీ గురజాడ అప్పారావుగారి ద్వారా నాకు మిత్రు లయినవారు, అప్పారావుగారి బంధువు, మూఁడేండ్లకు ముందు అప్పుడప్పుడు నన్ను లైబ్రరీలోని యోగశాస్త్ర గ్రంథముల గూర్చి యడుగుచుండువారు నగు శ్రీ పోతరాజు నరసింహము, ఎం. ఏ, ప్రెసిడెన్సి కాలేజి ఫిలాసఫి ప్రొఫిసరు అగపడిరి. వారి ప్రశ్నపై సూక్ష్మముగా నా యనారోగ్యము తెల్పితిని. వారి బావమఱఁది యగు జగన్నాథరావు నన్ను' మా బావగారు చేరిన యోగగోష్ఠిలో చేరిన మీ యనారోగ్యము తొలఁగిపోఁగలదు గదా! ?ఏల చేరరాదు?' అనిరి. నరసింహముగారు 'ధ్రువనాడి' యను గ్రంథము లైబ్రరీలోఁ గలదా యని ప్రశ్నింపసాగిరి. వారు చేరిన యోగగోష్ఠిని గూర్చి, ధ్రువనాడిని గూర్చి నేను వారిని ప్రశ్నించితిని. నా జాతకము ధ్రువనాడిలో నుండునా యని యడిగితిని. వారు గంపెడు విషయములు చెప్పి నన్ను వెంటనే కుంభకోణము వెళ్ళి యోగగోష్ఠిలో చేరఁగోరిరి. వెళ్ళుటకు సమ్మతించుచో జాబు వ్రాసి యిత్తు ననిరి.

హరిద్వారము గాక ఆరోగ్యద్వారము చేరఁబోవు చున్నట్లయ్యెను. 'నేను' అను నా బాహ్యప్రజ్ఞ లోదిరిగినట్లును, దానికి నొకబాట పాయ లిచ్చి యేర్పడుచున్నట్లును దోఁచెను. ఎడమప్రక్కనుండి తేలి చెదుగు పోవుచున్నట్లును, గుడి ప్రక్కనుండి దూటి దూటి గుణ మేదో లోలో కుదుర్కొనుచున్నట్లును, రెండింటికి నడుమ నొకబాట యరటాకు నీనవలె సాగుచున్నట్లును దలఁపఁజొచ్చితిని. ఒక్కప్రక్క ఆఫీసుకు వెళ్ళవలసిన తొందర, ఆ సమయమున మా లైబ్రేరియన్‌కు మిత్రుఁడు, మా నరసింహముగారికి మిత్రుఁడు నొక్కఁ డక్కడ నుండి నాగోడెల్ల విని రెండురోజులు

మిప్పించిరఁట! ఆ కారణమున వారికి కృష్ణామండలమువా రన్న నధి కాదరము. వారిజన్మదేశము కాంచీమండలము. తెలుఁగు బ్రాహ్మణులు. సన్న్యాసానంతరము వారు మహనీయులని ప్రఖ్యాతిగన్న స్వాములవార్లను గొందఱను వెన్నడించి విసుగుగొని శాంతి లేక తిరుగాడుచు శ్రీవారి మహనీయతను విని వారికడకు వచ్చి ఆజీవితము అక్కడనే నెలకొనిపోయిరి. శ్రీకృష్ణునకు సాత్యకివోలె వారు శ్రీవారికి సదానువర్తనులై యుండిరి.

నే నప్పటికి తొట్టెస్నానము సరిగా చేయకున్నను కారము లేని, తిరుగబోత లేని కూరలతోనే భోజనము చేయుచుంటిని. శ్రీవారితో నాస్థితిని విన్నవింపఁగా 'ఇఁక నీయారోగ్య రక్షణభారము నేను వహించితిని. వెఱవక నలువురితో పాటుగా మామూలు భోజనము చేయవచ్చును. దానివల్ల నీకేమి చెఱుపు రాదు' అనిరి. ఆవాల తెట్టె తేలుచున్న చారుతో, నూనె తిరుగబోత కూరలతో నే నానాఁడు భోజనము చేసితిని. అంతకుముం దట్టి భోజనము చేసినచో కడుపులో మంట. నిద్రరాదు. అశాంతి అధిక మయ్యెడిది. స్వాములవారు కంటిని రెప్పవలె నన్నుఁ గాచియుండి నాయనారోగ్యాది విషయములు విచారింపసాగిరి. అన్నియుఁ జెప్పితిని. మర్నాటి రాత్రివఱకే నే నక్కడ నుండ వీలగుట తెల్పితిని.


## (ఉపదేశము)

నాటిసాయంకాలము ఆఱుగంటలకు నాకు శ్రీవారి శిష్యతానుగ్రహము లభించెను. శిష్యతానుగ్రహము పడయుటకు సమకూర్చుకోవలసిన వాని నన్నింటిని స్వాములవారి తోడ్పాటుతో సమకూర్చుకొంటిని. ఉపదేశ విధాన మెల్ల స్వాములవారు సూచించిరి. శ్రీవారికి సాష్టాంగముగా నమస్కరించి నాయభ్యర్థనము నివేదించుకొంటిని. ఉపదేశము చేసిరి. వెంటనే 'నీవు హాలులోనికి వెళ్ళి ప్రేతాసనమున శయనించి, నమస్కరించి, ఉపదిష్టము నొక్కమారే యుచ్చరించి, కనులుమూసికొని, శరీరము లోతట్టున నేమేని జరుగును గనుక దానిని గుర్తించుచుండుము. మనస్సు బహిర్ముఖమై యెక్కడి కేని పోయినచో



పోనిమ్ము. నీవై యరికట్టవలదు. అదే తిరిగి రాఁగలదు ఏమి జరుగునో సాక్షిమాత్రుఁడవై పరికింపఁదలపు గొనుము. అంతే నీవు చేయవలసినది కొన్ని నిమిషములదాఁక కనులు తెఱవ ప్రయత్నింపకుము. ప్రయత్నించినను దెఱవ వీలుపడదు. మరల మూసికొనియే పోవును. శరీరములో నప్పుడు జరగవలసిన దెల్ల జరగగానే కన్నులు తెఱపియగును. అటుపై కనులు మూసికొని పండుకొనుట కష్టమనిపించును. అందాఁక కనులు తెఱవను, లేవను కష్ట మనిపించును' అని స్వాములవారు దగ్గఱనుండి తెలియఁజెప్పిరి. అట్లే ఉపదిష్టము నొక్కమారే సార్థముగా స్మరించి యుచ్చరించి కనుల మూసికొని పండుకొంటిని.

ఆ విచిత్ర విషయ మెట్టిదో యానాఁడే నేను దొలుత తెలిసికొంటిని. నన్ను దగ్గఱ కూర్చుండు మనిరి. రాధాకృష్ణ పిళ్ళగారు గురుదేవులకు నమస్కరించి కనుల మూసికొని యొక నిమిష మాగి ఇంగ్లీషుతో గ్రంథము పఠించుచున్నట్లేదో చెప్పసాగిరి. మహాదేవయ్యగారు దానిని వడివడిగా వ్రాయసాగిరి. ఇద్దఱును యఫ్.యే. చదివినవారు, ప్రజ్ఞాశాలులు. పిళ్ళగారు వడిగానే చెప్పసాగిరి. అయ్యగారు వడిగా వ్రాయసాగిరి. ఉదయము సరిగా తొమ్మిది గంటల పదునేదు నిమిషముల వేళ కది వ్రాయ నారంభించిరి. పిళ్ళగారు కనులు మూసి కొన్నప్పుడు ఆంతర దృష్టికి కనుపడినవి, ఆంతరశ్రుతికి వినబడినవి చెప్పఁదొడఁగిరి. అప్పుడు నా శరీరాంతర్భాగమునఁ గల స్వాస్థ్యాస్వాస్థ్యములు, నామనోభావములు, నా యనారోగ్యకారణములు, తన్నివారణోపాయములు, అప్పటికి జరగిన పూర్వజన్మములు మొదలగునవి కలవు. అది యెల్ల ముగిసిన పిదప దానిని శ్రీవారి చెంతకుఁ గొనిపోయి వినిపించిరి. వారి సమ్మతిమీఁద దానిని రికార్డు చేసిరి. ఆ కాలమున యోగాభ్యాసమునకు వచ్చి శిష్యతను బొందువారి కందఱకు నట్టి టెస్టు తీయుట జరగుచుండెడిది. నన్నుఁ గూర్చి వచ్చిన రికార్డును కాపి కోరితిని. శ్రీవారి సమ్మతితో దానిని నా కిచ్చిరి. అది నా దగ్గఱ నున్నది.



# 25

# దివ్య బోధ

ఆ నాఁటిరాత్రి మెయిలులో నేను తిరిగి మద్రాసు వచ్చివేయవలసి యున్నది. కాన నా విషయమును గూర్చి శ్రీవారితో సంభాషించుటకు నదనుకోరితిని. నా యభ్యర్థనమును మహాదేవయ్యగారు శ్రీవారికి నివేదించిరి. భోజనానంతరము సంభాషింప శ్రీవారనుమతించిరి. అప్పుడు వారు యోగవిషయములను గూర్చి వారి యర్ధాంగిద్వార యేవేవో యపూర్వాంశములను సేకరించుచుండిరి. భోజనానంతరమున నేఁ జేర నరిగి సాష్టాంగనమస్కారము చేసి యిట్లు విన్నవించుకొంటిని. ‘ మూఁడేండ్లనుండి యమబాధ పడుచున్నాను. నిద్రలేదు. శాంతి లేదు. ఆకలి, జీర్ణించుకొను శక్తి సరిగా లేవు. ఇక్కడికి రాక తలఁపునకు నందఁబోవుననఁగా నా యెఱకకు దెలియకుండనే సరిగా భోజనము చేయగల్గితిని. మీ యోగమాహాత్మ్యమును శ్రీనరసింహముగారి ద్వారా విన్నంతనే నాలో నేదో దివ్య సౌఖ్య సౌధమునకు బాట గోచరించుచున్న ట్లయినది. ప్రశాంతముగా రాఁగలిగితిని. రైలులో కొంత నిద్ర పట్టినది. ఇక్కడికి వచ్చి కడచిన రాత్రి సుఖముగా నిద్రించితిని. నూనె తిరుగబోత, ఆవాలు, సాంబారు, రసము, పల్చని మజ్జిగ యివి నాకింతకు ముందు కడుపులో మంటలు గొల్పెడివి. ఇప్పుడవి వికటింపలేదు. మీరు నిర్భయముగా అందఱతోపాటు భుజింపవచ్చు ననఁగా నట్లు చేసితిని. పూర్వము తీవ్రమయిన మందులు పుచ్చుకొంటిని తదాది కడుపు ఉడికి పోవుచున్న ట్టుండును. నేఁ డది లేదు. ‘శరీర మాద్యంఖలు ధర్మసాధనం’ అని ‘బ్రదికి ఉంటే బలుసాకు ఏఱుకొని తినవచ్చు’ నని ఉన్నది గాన నే నిక్కడ మీ సేవకుఁడనుగానే యుండఁ గోరుచున్నాను, ఇక్కడ నుండియే జీవిక నేదేని సమకూర్చుకొందును. అనుగ్రహింపు’ దంటిని.

వారు నీ కిప్పుడు ‘జీత మెంత?’ అని యడిగిరి. ఏఁబది రూపాయలంటిని. ‘దీనితో నీవు నీ కుటుంబమును పోషించుకోవచ్చును. ఉన్న జీవికను మానుకొని యిక్కడ నుండ నేల?

ఇట్టి సంభాషణతో నై దాఱు నిమిషములు గడచెను.

ఆ దినములలో వారు ముఖ్యమయిన తత్త్వార్థములను సహస్రారము, పిట్యూటరీ, అక్కడి దివ్యశక్తులు, వాని ప్రసారము మొదలగు వానిని గూర్చి శిష్యులకు బోధించుట, దివ్యదృష్టితో వానిని ముఖ్యశిష్యులు పరికించున ట్లనుగ్రహించుట, ఇంక నందలి విషయవిశేషములను మాతృశ్రీ ద్వారా తా మపూర్వముగా సేకరించుట జరగుచుండెను. కాన నా కంతకంటె నధికముగా, ప్రత్యేకముగా వారితో సంభాషింప ననువుపడ దయ్యెను.

# 26

# చేకూడుట

మరల సంజవేళ కక్కడివారు శిష్యులు పలువురు విచ్చేసిరి. భగవద్ఘట్ట మను పేరి కావేరీతీరఘట్టముననే శ్రీవారి సన్నివేశమున కెదురుగా వెలయుచున్న యోగశాలలో ఎల్లరును గూడి యోగసాధన చేయుట జరగుచుండెను. చాలగా వాచి యున్న నాచేయి నాఁటి సంజ ప్రార్థనమున నెంతో చక్కబడెను. వాపు తీపు తగ్గెను. నాలో లోలోపల నెక్కడో చిఱువెల్గు గోచరించుచున్నట్టును దానిని నేను జేరబోవుచున్నట్టును స్వప్నప్రాయముగా లీలగాఁ గొంత గోచరింపఁ దొడగెను. శరీరమున బ్యాటరీ పెట్టి నరముల నెల్ల నూగించి వేసినట్టు గొప్ప యూపు కలిగెను. చేతులు వాని యంతట నవియే లేచి నమస్కరించెను. కాని కుడిచేత నింకను బాధ గోచరించు చుండెను. టక్కు టక్కుమని జబ్బుయెముక యదరు తెలియుచుండెను.

శరీరమున నింత తీవ్రసంచలన మేమిటి? ఇది యెక్కడ నుండి యారంభమై జరగుచున్నది? ఇంత దాఁక నెన్ని శ్లోకములో, ఎన్ని మంత్రములో, ఎన్ని ధ్యానములో, ఎన్ని క్షేత్రములో, ఎన్ని దేవతా దర్శనములో, ఎందఱ యాశ్రయములో జరిపితిని గాని యిట్టి విశేష మెక్కడ గాని జరగుటయెఱుఁగనైతినే! ఒక తూరి ప్రార్థనమాత్రముచే నింత జరగుట యేమిది? అస్తినాస్తి విచికిత్సాస్పదముగా నున్న పరతత్త్వము అస్తియని స్పష్టముగా ననుభవింప నగుచున్నట్లున్నదే? దీని లోఁ తేదో తెలిసికొనవలెను గదా! త్రోవ దొరకినది గదా! నా ప్రార్థనమును లోన నెవరో వినుచున్నట్టు– సమాధానము చెప్పుచున్నట్టు అనుగ్రహించుచున్నట్టు అగుచున్న దేమి వింత? నా జబ్బు నాకు చాల ఉపకారమే చేసెనా యేమి! ఇక నా జబ్బు కుదిరినట్టే తోఁచుచున్నదే ! ఏమి యానందము! ఏమియు లేకున్నచో నా చేయి యింత వాచుటేమి? నావశము తప్పి చేతులు లేచి నమస్కరించు టేమి? చే కూడుట యేమి? 'చేకూడుట' అన్న పదము కల్పించిన వారెవరు? ఈ రెండు చేతులు లేచి కలసి నమస్కరించుటను సూచించునదిగా నేర్పడినదా యేమి చేకూడు,

వాని కన్నింటికిని సమాధానములును తోఁచినవి. తర్వాత గొన్నాళ్ళకు విచారింపఁగా సమాధానములను శ్రీవారే పలుతూరులు చెప్పుచుండినట్లు తెలియవచ్చెను–

'యస్య నాస్తి స్వయం ప్రజ్ఞా శాస్త్రం తస్య కరోతి కిమ్
లోచనాభ్యాం విహీనస్య దర్పణః కిం కరిష్యతి।'

అన్నట్లు స్వయంప్రజ్ఞ కలవారే శాస్త్రనిర్మాతలు. అట్టివారికి ప్రాచీన శాస్త్రాదిపఠనము తమ ప్రజ్ఞకుఁ గల యపూర్వతను గుర్తించుట కుపయోగపడునుగాని ప్రజ్ఞోద్బోధము స్వయము సమకూడవలసినదే. ప్రాచీన శాస్త్రములు దానికి జనకములు కాఁజాలవు.

"శాస్త్రాణాం విషయ స్తావ ద్యావ న్మందరసా జనాః
ప్రవృత్తే రసశాస్త్రే తు నచ శాస్త్రం న చ క్రమః "
"త మేవ ధీరో విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః
నానుధ్యాయా ద్బహూన్ ఛబ్దాన్ వాచో విగ్లాపనం హి తత్"
" విహాయ శాస్త్రజాలాని య త్సత్యం త దుపాస్యతామ్"

ఇత్యాది సూక్తులు స్ఫురణకు వచ్చి భాషలో నేమున్నది! విషయము గదా ప్రధానమయినది! ఏభాష యయిన నేమి? అందును జాతిమతదేశాదికృత మయిన పరిచ్ఛేదము లేకుండ సర్వసమానముగా సాగవలసిన యిట్టి మహత్తరయోగ పద్ధతికి–నేఁడు ప్రపంచవ్యాపకముగా నున్న యాంగ్లభాషయే సరిపడి యుండునేమో! మఱియును సంస్కృతమున కట్టి పూజ్యత మహర్షులు తమ యుద్బోధముల నందే వెలయించుటచేతను, ప్రాచీన తత్త్వశాస్త్రము లందే పెంపొందుటచేతను, ఉపనిషత్తులును, వేదములును నందే యుండుటచేతను వచ్చినది–అట్టివానిని నిపుడును వెలయింపఁ గలవా రుందురో వారు వాని నే భాషలో వెలయింతురో యా భాషకు నట్టి పూజ్యత తప్పక కలుగఁ గలదు. ఆంగ్లభాషకుఁ గూడ నట్టి యోగ్యతకల దని యంగీకరింపక తప్పదు. నేఁడెందరోమహనీయులా భాష ద్వారమున ననేకాపూర్వశాస్త్రార్థములు



వెలయించుచున్నారు. దీనిని పరిగణింపక త్రోసిపుచ్చుట సాధ్యము కాదు. కనుక శ్రీవారియోగోపదేశ భాషాదు లాంగ్లమున నుండుట కొఱంతగాదు.

మఱియు వారి యాకృతిమహనీయతకు మీసము లుంచుకొనుట, మొగమున బొట్టు పెట్టుకొనకుండుట కొఱంత పఱుపఁజాలవు. శైవవైష్ణవాది మతభేదములను బాటించువారు గారుగాన వారు మొగమున తన్మతచిహ్నముల ధరింపకుండవచ్చును. వారు నెలకొల్పినది మహారాజయోగముగాన దీనికి బోడితల కాషాయవస్త్రములు మొదలగునవి యుండ నక్కఱలేదు. మీసము లుండుట లేకపోవుటలో న్యూనాధికత లుండవు. ఈ సమాధానములు తోఁచి నా మనసులోని యప్పటి మకిలను దొలఁగించినవి.

కొంతకాల మయిన తర్వాత నేను మరల కుంభకోణము వెళ్ళియుండఁగా శ్రీవారే నే నడుగకుండనే యీ విషయమును గూర్చి యిట్లనిరి. ' నాకు శిష్యులుగా నుండు వారెవరు గాని లోకమునకు విడ్డూరముగా తోఁచదగిన వేషభాషలతో నుండుట బాగుగాదు. నలుగురతోపాటుగానే యుండవలెను. ఈ యోగమున నెవఁడుగాని ప్రత్యేకముగా కడతేరఁ జాలఁడు. తాను, తన చుట్టుపట్టులవారు, తన యాప్తులు ననుక్రమముగా ప్రేమ వ్యాపకమగుతీరు ననుసరించి తాను, తన చుట్టుపట్టులవారు, తన యాప్తులు ననుక్రమముగా లోకము నంతను ప్రేమించి లోకమునంతను గడతేర్చువాఁడు కావలె. తన ప్రేమ సర్వలోక వ్యాపకము కానంతవఱకు నెవ్వఁడు గాని కడతేరఁ జాలఁడు. అఖండము, సర్వవ్యాపకము నగు తత్త్వమును బడయుటకు తాను నఖండుఁడు, సర్వవ్యాపకుఁడు కాక తప్పదు. దేశ కుల జాతి మతాది పరిచ్ఛేదములతో వేఱుపడిపోయి సర్వప్రజతో సామరస్యము కుదుర్చుకోలేనివాఁడు సంసారబంధమున కొట్టుకాడవలసినవాఁడే ! బహిర్ముఖముగా సాగుచున్న బహుత్వమును సాగనిచ్చుచునే అంతర్ముఖముగాఁ దిరిగి అం దేకత్వమును గుర్తించి వర్తించుట ఈ యోగసాధనమున కొక ఫలితము. మన పరిపూర్ణత భవిష్యత్తులో నున్నది గాని భూతముకాలేదు. కనుక భూత మను పీఠికపై నెలకొని భవిష్యత్తున పరమార్థ మనుభవింపవలసి యున్నది.'

నడుగు టేల యనియు ననిరి. టెలిఫోనులో ఒక తూరి పిలువగా నవతలివారు సిద్ధముగా బదులుపలుకుచుండగా దానిని వినక యూరక పిలుపులే పిలుచువాని తీరువంటిది పదింబదిగా స్మరించుచుండుట యనిరి. ఈ యుపదేశపు యాథార్థ్య మటుతర్వాత పరసహస్రపర్యాయములు నాకును నా మిత్రులకును ననుభూతి కందినది.

1925 వ సం॥ ప్రాంతముల నొకమిత్రుఁడు నిరంతరము శ్రీవారిస్మరణమే రామనామజపమువలె జరపుట సాగించెను. కొన్నాళ్ళకు శరీర మెల్ల నగ్నిజ్వాలవలె నయ్యెను. నిద్రలో నరములు బిగించినట్లయి త్రుళ్ళిపడుట, క్రమముగా నిద్రపట్టకుండుట యేర్పడెను. బంధువులు పలువైద్యములు చేయించిరి. యోగమునే మాన్పించిరి. ఏమియు లాభము లే దయ్యెను. జరిపినతప్పిదమునకు పశ్చాత్తాపము సెంది క్షమింప ప్రార్థింప సక్రమముగా నడచుకొనసాగించిన తరువాత నారోగ్యము చక్కబడెను. ఆ మిత్రుఁడు నేఁడును క్షేమముగా యోగసాధనము చేయుచున్నాఁడు. అనధికారముగా, అక్రమముగా సాధనములు సాగించిన వా రింక నెందఱో పశ్చాత్తప్తులయి బాగుపడవలసినవారైరి.

# 28
# నవజీవనము

నాఁటి రాత్రి శ్రీవారి నిదేశము చొప్పున మద్రాసుకు హాయిగానే బయలుదేరితిని. కుంభకోణమున నుండి మాయవరము దాఁక రైలులో వచ్చితిని. పలువు రక్కడ దిగుచుండిరి. నేనును ఆ స్టేషనులో దిగి అక్కడ చాల సేపు రైలాగును గాన ప్లాట్‌ఫారం మీఁద కొంతదడవు నిటు నటు తడవాడితిని. రైలెక్కితిని. అది బయలుదేరెను. నేను తలుపు దగ్గరనే నిలుచుంటిని. న న్నెవరో బయటికి పడఁ ద్రోయు చున్న ట్లయ్యెను. మరల తొంటిరీతి కంపము, నిరుత్సాహము తోఁచెను. తోడ్తో రైలు ద్వారము దగ్గఱ నున్న నాకు హరిద్వారము తలఁపునకు వచ్చెను. పాడు తలఁపు క్రిందికి దూకుదునా యనియుఁ దోఁచెను.

అల్లంతలో న న్నెవరో వెనుకకు నెట్టుచున్న ట్లయ్యెను. ఇది నాలో జరుగుచున్న సదసద్వివాదముగా గోచరించెను. పూర్వముకంటె నిప్పుడు గొప్పజ్వాల లోపల వెలుఁగుచున్నట్లయ్యెను. పూర్వ మెక్కడో మిణుకు మిణుకుమను నాశాజ్యోతి యుండెడిది. నే నీ సంకల్ప వికల్పములతో నిటు నటు నూగుచుండగా లోఁ గూర్చున్న సహృదయుఁడొకఁడు భగవదావిష్టునట్లు తన ప్రక్క చోటు చూపుచు 'అయ్యా తలుపు తెఱచి యున్నది. క్రింద పడగలరు! ఇటు వచ్చి కూర్చుండుఁడు' అనెను. వెంటనే వెళ్ళి కూర్చుంటిని. అతఁడు లేచి నాకు మఱీ చోటిచ్చెను. 'నేను తర్వాతి స్టేషనులో దిగిపోవుదును గాన యిఁక కూర్చుండను. మీరు సుఖముగా కూర్చుండుఁడు' అని నన్నుఁ గూర్చుండబెట్టి తానే తలుపు వేసి తలుపు దగ్గఱ నిలుచుండెను. న న్నట్లు రక్షించిన వారు గురుదేవులే యగుట వారి ప్రజ్ఞాంశము నాలో నుండుట కాలక్రమమున స్పష్టముగా గుర్తింప నయ్యెను.

మద్రాసు చేరుదాఁక నే నున్నచోటునుండి కదలక రైలు కంటె ముందుకు దూకుచున్న తలఁపుల వేగముతో నిద్రమెలఁకువలతో

గాన మందిచ్చి తీరవలసినదే యని నాకుఁ జాటుగా మా తల్లిదండ్రులు, నన్నగారు చర్చించుకొనుచుండిరి. అది వింటిని. పిల్చి యడిగితిని. 'మందు గొనవలసినదే' యనిరి. అంగీకరించితిని. సాయంకాలము ఆఱుగంటలవేళకు మందిచ్చిరి. అప్పుడే ఆకాశమున నుండి దభీలున క్రిందఁ బడుచున్నట్టు లయి యొడలెల్ల చెమ్మటనీరు చిమ్మఁ దొడఁగెను. పది నిముషములలో జ్వర మెల్లతగ్గెను. 'మం దిచ్చితిమి. తోడనే  తగ్గెను' అని మా వా రనుకొనిరి. 'ఇచ్చిన టెల్లిగ్రాం శ్రీవారికి చేరినది. ట్రీట్మెంటు జరగియుండును. తోడనే తగ్గినది' యని నేను దనిసితిని. మర్నాడు తేటగానే యుంటిని. మందు గొనుచుంటిని. మూఁడవనాఁడు మరల జ్వరము వచ్చెను. నాఁడు కుంభకోణమునుండి జాబు వచ్చెను. 'జ్వరము తగ్గియుండును. మందు గూడ పుచ్చుకొన వచ్చును' అని. మందు పుచ్చుకొనుటకు ధైర్యము వచ్చెను. పుచ్చుకొనుచుంటిని . సెలవులేదు. శ్రీరామకృష్ణ కవిగారును  జ్వరము మరల మరల వచ్చుచు తంటాలు గొల్పుచుండుటచే సెలవు తీసికొని మద్రాసుకు వెళ్ళిపోయిరి.

నేను చిరకాలము సెలవులో నుండి డ్యూటీలో చేరి సెలవు గొనుట దుఃఖకరముగా తోఁచుటచే నెటు చేయను జాలక చిక్కు పడుచుంటిని. ఇంటి దగ్గఱ నుండ నిష్టము లేదు. జ్వరము వచ్చుచునే యుండుటచే నూళ్ళ వెంటనొంటరిగాఁ దిరుగఁజాలను. ఇట్టి యిక్కట్టులో నింటికి వచ్చిన వారము రోజులలోనే నాకు ఆఫీసునుండి టెలిగ్రాం వచ్చెను. 'తత్క్షణమే నీవు తంజావూరి లైబ్రరీ పరిశీలనమునకు వెళ్ళవలసినది. అక్కడ చేరి పని చేయవలసినది' అని. అలిగి తన్నితే పఱుపుమీఁద పడ్డట్టు, రొట్టెవిఱిగి  నేతిఁమీద పడ్డట్టు నాకు పరమోత్సాహకర మయినది.

తోడ్తో బయలుదేఱి మద్రాసు వచ్చి ఆఫీసుకు వెళ్ళి లైబ్రేరియన్‌తో మాట్లాడి మద్రాసులో నాగక కుంభకోణమునకే వెళ్ళిపోయితిని. అప్పటికి మాతోబుట్టువు కుటుంబము మద్రాసులో నుండెను. మా తమ్ముఁడు చి॥ చంద్రశేఖరము అక్కడ హైస్కూలులో చదువుచుండెను. వాని కక్కడ



టైఫాయిడ్ జ్వరము వచ్చెను. శ్రీవారికి జాబు వ్రాసితిని. మద్రాసులో వారి శిష్యుఁడుగా నున్నమన్మిత్రు నొకని ట్రీట్ చేయవలసినదిగా జాబు వ్రాసిరి. ఆతఁడు వచ్చి ట్రీట్ చేసి యీ జ్వరము తగ్గిన తర్వాత నీ కుఱ్ఱవానికి శ్రీవారి శిష్యత లభింపజేయవలసిన దనియు, దానివల్ల నీతఁడు కొఱఁతలు దొలఁగి యారోగ్యము పడయఁగలఁ  డనియు దివ్యదృష్టకి గోచరించిన దానిని దెలిపెను. నెలా పదిరోజులు జ్వరము వానిని బాధించి విడిచెను.

కుంభకోణమున శ్రీవారిని దర్శించి నాకథ యెల్లఁ జెప్పికొంటిని. శ్రీవారు నన్ను ప్రతివారము సెలవుదినమున తంజావూరినుండి కుంభకోణము వచ్చుచుండు మనిరి. ఆ కాలమున రైలుఛార్జి అర్ధరూపాయ లోపుగా నుండెను. అట్లే చేయుచుంటిని. తంజావూరిలో నాకు త్యాగరాజయ్య రను మిత్రుఁడేర్పడెను. ఆయన శ్రీవారి శిష్యుఁడు. ఇర్వురమును గలసి ప్రార్థనము చేసుకొనుచుంటిమి. జ్వరము తగ్గి యారోగ్యవంతుఁ డయిన మాతమ్ముఁడు వదినగారిని దోడ్కొని కుంభకోణమునకు వచ్చెను. వానిని శ్రీవారి శిష్యునిఁ గావించితిని.

చల్లపల్లిలో ఆరంభించిన చలిజ్వరము ఎడనెడ నాకు వచ్చుచునే యుండెను. శరీరము చాల చిక్కిపోఁ జొచ్చెను. నేను కుంభకోణము వెళ్ళినతోడనే తీవ్రముగా జ్వరము వచ్చెడిది. మజ్జిగ అన్నమే తినఁగల్గెడివాఁడను. రాత్రి ఒకటి రెండు గంటలవేళ తీవ్రముగా ఆకలి యయ్యెడిది. అప్పుడు ముందుగానే నాకై జాగ్రత్తపడి సచ్చిదానందస్వాములవారు ఊరగాయ, మజ్జిగఅన్నము ఎత్తిదాచియుంచెడివారు. ఆకలయి నపుడు వారిని లేపి యది తిని నీరు ద్రావి నిద్రపోయెడి వాఁడను. ఉదయము జ్వరముతోనే తంజావూరికి వచ్చెడి వాఁడను–వచ్చిన కొంతసేపటికి జ్వరము తగ్గిపోయెడిది. వారమురోజులు నెమ్మదిగా ఆఫీసుపని చేయఁగల్గెడువాఁడను. నాతో రామకృష్ణకవిగారు వగైరా లుండిరి. వారు మద్రాసు వెళ్ళినప్పుడు  శ్రీ కుప్పుస్వామిశాస్త్రిగారితో  నేనేదో కుంభకోణము వెళ్ళి యోగసాధన చేయుచుంటి ననియు, అక్కడికి వెళ్ళిన తోడనే జ్వరపడి జ్వరముతోనే ప్రతివారము వచ్చుచుందు ననియు చెప్పిరి. వారు కుపితు లయియుండిరి.

# 29
# ఇల్లాలి యినిసియేషన్

మద్రాసు పయనము.నే నింటిసామాన్ల నన్నింటిని రైలులో మద్రాసు పంపి సకుటుంబముగా తంజావూరునుండి కుంభకోణమునకు వచ్చి నాయారోగ్యాది విషయములను శ్రీవారి కెఱింగించితిని.

నాఁడు సాయంకాలపు యోగాభ్యాసము ముగిసిన తర్వాత నన్నుఁ బిలిచి శ్రీవారు 'నీ వీరాత్రి నేను సదావర్తిల్లు చుండు యోగాలయపు గదిలో, నేను విశ్రమించుబల్లమీఁద నీ భార్యతో శయనించుము. నే నిప్పుడు ఇంటనే శయనించుచుంటిని' అనిరి. నేను గడగడలాడి సిగ్గుతో అంగీకార సూచకముగా తల వాంచితిని. కాని నాకు తర్వాత చాల వెఱపు గల్గెను. అది గురుదేవులు శయనించుగది. అందువారు విశ్రాంతి గొనుబల్ల! అందు నేను శయనించుటా? అందును సద్వితీయముగా! అని వణకితిని. ఈయాజ్ఞ నాలోనే జీర్ణించెను. వారితోనే భోజనము చేసితిని. వారి యింటిలోని యాడువారందఱు శయనించు చోటనే నా కుటుంబిని శయనించెను. నేను మరికొందఱు మిత్రులతో వీధియరుగుమీఁద శయనించితిని. రేయెల్ల శ్రీవారి యాజ్ఞను గూర్చి పర్యాలోచనమే! ఉదయము తెలతెలవాఱుచుండగా తలుపులు తెఱచిన తోడనే లోని కరిగితిని.

శ్రీవారు ఇంటిలో విశాలమయిన మండువాలో చంద్ర నక్షత్రాదులు నీలాకాశము గోచరించుచుండఁగా చల్లని గాలి వీచుచుండఁగా, నొక గోల్డుమెడల్ మడతమంచము మీఁద పలుచని పడుకపైన శయనించియుండిరి. పడుక మీఁదను, క్రిందను చల్లినమల్లెపూవు లున్నవి. పట్టుతలగడ గలదు. తెల్లని పలుచనిపట్టుసెల్లా కప్పుకొని యుండిరి. మంచమునకు దోమతెరక ప్పుండెను. అదను ప్రతీక్షించుచు వారు కనులు దెఱచి లేవ నుంకించునంతలో నేను చేర నరిగి పాదములు స్పృశించి నమస్కరించితిని. 'రాత్రి యెక్కడ శయనించితి' వని యడిగిరి. ఇంటిలో స్త్రీలతో స్త్రీయు, వాకిటియరుగు మీఁ ద నేనును శయనించుట తెల్పితిని.చప్పరంచి 'నామాట పాటింపక పోతివి గదా!' యనిరి, సిగ్గుతో తల వాంచితిని. సరేఁ కానిలేఁ ఏమి విశేషము?' అనిరి.



'మీ దివ్యానుగ్రహమున నే నారోగ్యవంతుఁడ నయితిని. నాకీయోగమార్గమున ధన్యత చేకూరును. నాకు శరీర మొసఁగిన మాతల్లిదండ్రులు వృద్ధులు.ఎప్పుడేమి జరుగునో? వారికి మీశిష్యత ననుగ్రహింప వేఁడుచున్నాను. వారిక్కడికి రాఁజాలరు' అంటిని. "వారివయసెంత?' యనిరి. 'మాతండ్రిగారి వయసు డెబ్బది దాటినది' యంటిని. 'అంత వార్థక్యమున నున్న వారినిగూర్చి యనుతపింతువే? చిరకాలము నీతో జీవితము గడపవలసిన నీ భార్యనుగూర్చి యడుగవేమి?' యనిరి. ' చిన్న వయసులో నున్న యీయువిద నాతో నెప్పుడుపట్టిన నప్పుడు మీదర్శనమునకు రాఁగల్గును. కాన యెప్పుడయిన మీశిష్యతానుగ్రహమున కర్హురాలు కాఁగలదు. చాల వార్ధకమున నున్నవా రని, ఎప్పు డేమగునో అని, వారీశరీరముతో మీశిష్యత పడయవలె నని నాయాశ!' యంటిని. 'సరే కాని నేఁడు ఎనిమిది గంటలకు నీ భార్యకు ఇన్‌సియేషన్ జరుగును. అందుకు వలయు సన్నాహములు జరపుము. అందుకై నీ వేమియు వస్తువులు తీసికొని రా నక్కఱలేదు. రాధాకృష్ణునితోను, మహాదేవయ్యరుతోను, చెప్పి ఫారము వగైరాలు ఫిలప్పు చేయించుము' అని శయ్య వీడి లోని కరిగిరి.

నే నడిగినదాని ననుగ్రహించిన ట్లుత్తర మీయక యర్థింపవలసినదే అయినను అప్పు డర్థింపని దాని ననుగ్రహించుట జరిగెను గదా యని వింత చెందుచు నేనును వెలికి వచ్చి కాలకృత్యములు నిర్వర్తించుకొని, యంతలోనే యోగశాలకు విచ్చేసిన మిత్రు లిర్వురకు శ్రీవారి యాజ్ఞను దెలిపితిని. వారు నవ్విరి. ఎనిమిది గంటలకు సర్వము సిద్ధమయ్యెను. నాఁడు శ్రీవారియింట వారి మేనత్తగారు, వృద్ధురాలు చాల జబ్బుపడిరి. వారి యారోగ్యమును గూర్చి శ్రీవారు తీవ్ర ప్రజ్ఞతో నుండిరి. ఎనిమిదిగంటలకు ఇన్‌సియేషన్ జరగినది.

మాతృశ్రీగారు యోగసాధనోపక్రమమునకు ముందు ఇడ్డెనలు, కాఫీ, ఆహారము తీసికొనుటకై తెచ్చి దగ్గఱ నుంచిరి. అది తెలియక యీక్రొత్త యువిద యభ్యాసవిధానము నారంభించెను. అయిదునిమిషములలో శరీర మెల్ల కొయ్యబాఱి కదల మెదల వీలులేకుండ బిగిసికొని పోయెను. దగ్గఱకు వచ్చి సచ్చిదానందస్వాములవా రాస్థితిని జూచి పిలిచిరి. కనులు తెఱవఁ జాల దయ్యెను. వారు మాతృశ్రీగారిని బిలుచుకొని వచ్చిరి. చూడఁగా నాహారపదార్థము లుంచినవి యుంచినట్లే యుండెను. వెంటనే లేపి, ఒడలు

ప్రసిద్ధిగన్నవాఁడు. అతఁడే యేతద్గ్రంథ కర్తయని కలదు గాని యిందలి భాషాశైలీ లక్షణాదులను జూడఁగా నది సత్యమనిపించదు.

ఈ నాడీ గ్రంథములు సంస్కృత ద్రవిడ భాషలలో నరవదేశముననే యధికముగాఁగలవు. ఆంధ్రదేశమునఁ గూడ నాంధ్రభాషలో వేములవాడ భీమన రచితముగా నొక నాడీగ్రంథ మున్నది. కాని యది సీసమాలికగా వేములవాడ భీమకవి రచనమని విశ్వసింపఁదగనిదిగానేయున్నది. దానిని ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు నేనే సేకరించితిని. అది ప్రస్తుతకాలమున నుపయోగపడునది కాదు. ఇక సంస్కృత ద్రవిడ గ్రంథములలో ధ్రువనాడి యని, సత్యసంహిత యని, శుక్రనాడియని, చంద్రకళానాడి యని, నాల్గు గ్రంథముల నేనెఱుఁగుదును. అవి యెవరో ప్రాచీన మహర్షులు, తత్కల్పులు రచించినవిగా నున్నవి. ధ్రువనాడీ సత్యసంహితలు సత్యాచార్య రచన లనఁ గా నేనే మనుకొంటి ననఁగా సత్యాచార్యుని యంశమున నిటీవల జనించినవా రెవరో పూర్వానుస్మృతి కలిగి వానిని రచించి యుందురని.

ఇక్కడ వక్తవ్యము చాలఁగలదు. ఈతఁడు శివాంశమున జనించినాఁ డనీ (అప్పయ్య దీక్షితాదులు), ఈతఁడు గుడిగంట యంశమున జన్మించి (వేదాంత దేశికులు) నాఁడనీ యిత్యాది విధములఁ బలువురను ప్రాచీన మహనీయులను గూర్చి ప్రామాణికులే నిర్ణయించి పలుకుచుండుట కలదు. ఆయా దేవతల ఖండావతారములుగా వారిని నిర్ణయించుట సంగతము. ఆయా మహామహులు లోకమున నేవేవో యపూర్వాద్భుతార్థములను వెలయించుటకై యవతరించుట కలదు. దేశకాలాదుల యసౌకర్యముబట్టి యాయా కార్యములను వారప్పుడప్పుడే యాయా యవతారములలోనే నిర్వర్తింప వీలుపడకపోవచ్చును. శుద్ధసంకల్పులు గనుక వారు వా రాయా కార్యములను గొన్ని జన్మముల నెత్తి నిర్వర్తింపవలసిన వారగుచుందురు. శంకర, జిన, బుద్ధాదుల కార్యము లట్లే యొక జన్మమున నిర్వాహము చెందవయ్యెను.

అతి ప్రాచీనులయి జ్యోతిషమున నద్భుతగ్రంథములు రచించిన సత్యాచార్యాదులు మరల మరల జన్మించుచు లోకవృత్తమును గొన్ని కొన్ని షష్టులకు రచించుచు వచ్చుచుండిరని నా విశ్వాసము. తర్వాతి తర్వాతి జన్మముల వారి వారి గ్రంథములకే నాడీగ్రంథము లని పేరు. అవి కొన్ని



కొన్ని షష్టులకే రచితములయి యుండు ననియు నా విశ్వాసము. వారు వా రాయా జన్మములలో జ్యోతిషప్రజ్ఞకే పారమార్థ్యము గల్పించుకొనుటచే భాషాపాండిత్యమునకై యంతగా ప్రాకులాడ రయిరి. వారి గ్రంథములలోని భాష నిర్దుష్టము గాదు. ప్రౌఢమును గాదు. కొన్నిచోట్ల కొందఱ కొందఱ గ్రంథభాగములు ప్రౌఢములుగా లేకపోలేదు. రుచి గల యర్థవిశేషములు గల జాతక భాగములఁ జెప్పుచో శ్లేషాద్యలంకారములతో నతి రసవంతమగు భాషతో నాయా గ్రంథభాగములున్నవి. అందు శబ్దజాలము క్రొత్తగా నేఁడు పుట్టుచున్నను మనుష్యులను గూర్చి వారి వర్తనముల గూర్చి పేళ్ళగూర్చి కూడ నుండును. ఈనాఁడు క్రొత్తగా వెలసిన, వెలయుచున్న రేడియో, రేడియం, ఎక్సురే, కాస్మిక్‌రే, ఆటంబాంబు మొదలగువానిని గూర్చి కూడ నందుండును.

తద్గ్రంథకర్తలనాఁటి కీ విషయములు భవిష్యద్విషయములే యయినను నాగ్రంథములలో నాయా భాగములఁ జదివి వెల్లడించినంతవఱకు భూతమును, దరువాతిది భవిష్యత్తును నగుట గానవచ్చును. ఆయా గ్రంథములు చదివిన నాఁటిదాఁక విషయములు జాతకునకు చక్కగా సరిపడునవిగా నంతదాఁక తు.చ. తప్పకుండ జరగినవిగా నుండుటచే దానిని బట్టి తర్వాతి గ్రంథభాగమును విశ్వసించి జాతకుఁడు గయికొనును. తర్వాత నది తప్పిపో నారంభించును. క్రమముగా నన్ని విషయములు విస్పష్టముగాఁ దప్పిపోవు చుండును. ధ్రువనాడిలో నట్లు జాతకము తప్పిపోవునట్లు గుర్తించి యడుగఁగా నపుడు సరిపోయినదిగా నింకొక తాటియాకు దొరకును. అది పూర్వపుటాకు కంటె కొంత హెచ్చు భాగములు సరిపోయినదిగా నుండును. కొన్నాళ్ళ కిదియు తప్పిపోవును. ఇట్లు ఆనాడి, తత్పారకుఁడు, జాతకుఁడు ఉన్నంతదాఁక చదువుచునే యున్నచో జాతకము సరిదిద్దుకొనుచునే యుండవచ్చును. కాని రే పిట్లు జరగ గల దని సునిశ్చితముగా నే నాడి గ్రంథము గాని చెప్పుట నే నెఱుఁగను, ప్రత్యుత తద్విరుద్ధముగా జరగుటయు నెఱుఁగుదును.

పర్యాలోచించి చూడఁగా నొక్కొకప్పుడా గ్రంథమాయావేళల కనుకూలముగా నిర్మిత మగుచుండు నేమో యని తోఁచును. ధ్రువనాడిలో జాతకము తప్పినపు డెల్ల క్రొత్త జాతకము దొరకుచుండుట యిట్టిదే. కాన యా నాడి నుపయోగించు గ్రంథస్వామిని కొందఱు తస్కరుఁడు, తప్పుడు

కుదుర్పరానిది. బ్రదికిన నొక వేళ శస్త్రచికిత్సతో బ్రదుకవచ్చు నని యాస. ఆ కుఱ్ఱవాఁడు జీవించునో లేదో గుర్తించుటకు ధ్రువనాడీకారున కత్యధికధన మిచ్చి యింటికి రప్పించి గ్రంథము నక్కడే యుంచి చదివించుచుండిరి. ఆ కుఱ్ఱవాని జాతకము సరిగానే యందుఁ గలదు. ఆతని యనారోగ్యపు నిర్వచన మెల్ల సరిగానే యందుఁ గలదు. ఆ జాతకపుటాకు తుదిపట్టు చదువుచుండిరి. అంతలో ఆపరేషన్ చేయుటకు డాక్టరు రంగాచార్యులుగారు విచ్చేసిరి. ఆ సమయమునకు సరిగా 'శస్త్ర వైద్యేన జీవతి' యన్న వాక్యము నాడిలో వచ్చెను. తరువాతి యాకు నిఁక చదువవలెను. డాక్టరుగారు వచ్చుటచే నంతట నాపిరి. అందఱకును ఆ కుఱ్ఱవాఁడు శస్త్ర వైద్యముచే జీవించును అనియే యర్థము స్ఫురించెను. డాక్టరు శస్త్రోపక్రమము నకు సిద్ధపడుచుండెను. నాడీగ్రంథమునఁ జదువుచున్న పట్టున గుర్తించి కట్టిపెట్టి గృహస్వామి యినుప పెట్టెలో తాళము వేసి తాళముచెవి నాడికారున కిచ్చెను. మర్నాడు వచ్చి కడమ గ్రంథమును జదువుట కేర్పాటు జరగెను. తొందరగా నాడీకారుఁడు శేషాచార్యుఁ డింటికి వచ్చి వేసెను. ఈ విషయ మెల్ల మాతోను జెప్పెను. మేమును నాతఁడు జీవించు ననియే యనుకొంటిమి.

మర్నాడు శేషాచార్యుఁ దుదయమున వారింటికి వెళ్ళెను. ఆపరేషన్ జరగుచుండఁగానే ఆ బాలుఁడు మృతుఁడౌట తెలియవచ్చెను. అక్కడి పండితులు నివ్వెఱ చెందుచుండిరి. ఈతనిని నాడి తెఱవు మనిరి. తెఱవఁగా నా జాతకమున తుదిశ్లోక మదియే. తర్వాతి యాకులో వేఱొక జాతక ముపక్రాంత మయ్యెను. పర్యాలోచింపఁగా–శస్త్రవైద్యే=శస్త్రవైద్యమున (వైద్యము జరగు కాలమున) నజీవతి=చనిపోవును అని యర్థమగుట, అట్టగుటచేతనే జాతకపుఁ బైభాగము లేకుండుట తెలియ నయ్యెను. అందఱును దైవవంచనకు ఖిన్ను లయిరి. ఇట్టి వానిని ధ్రువనాడి చమత్కారముల నెన్నింటినేని పేర్కొన నెఱుఁగుదును.

అందు సి.వి.వి. యోగమార్గమునఁ జేరినవారి జాతకములు పదులకొలఁదిగాఁ జదువుట నే నెఱుఁగుదును. ఆ చదువుట నా సమక్షముననే జరిగినది. శ్రీవారి జాతకమునఁ గల విషయములే యనేకుల జాతకములం దున్నవి. శ్రీవారి జాతకమును, శిష్యులయు తదితరులయు జాతకములును గొన్నా ళ్ళయినతర్వాతఁ దప్పిపోవుటయు, మరలఁ జూడఁగా సరియయినవి దొరకుటయుఁ గూడ నెఱుఁగుదును. శ్రీవా రుండఁగా నా నాడీగ్రంథమును



శ్రీ వేపా రామేశము గారి దగ్గఱ గొన్ని వందలరూప్యములకుఁ దాకట్టు వెట్టుటయు వారు దానికి ఇండెక్సు వ్రాయించుటయు జరిగినది. ఆ నాళ్ళలోఁ గ్రొత్తగా జాతకములు చదువుట సాగలేదు. మఱియు నాతఁడా నాడీగ్రంథమును జదువుచుండిన నాళ్లలో వెల్లడియయిన జాతకము లనేకము లీ యిండెక్సు చేసిన గ్రంథములలోఁగానరాలేదు. వాని నాతఁడు దాఁచియుంచు కొనెనో, చదువునాళ్ళలోనే కల్పించి చదివెనో యని కొందఱు సంశయించిరి. నా నిశ్చయ మాతఁడు కల్పింపనుగాని, దాచి యుంచు కొనను గాని నేరనివాఁడే యని.

## (భుజండనాడి)

శ్రీవారుండగానే, ధ్రువనాడి చదువుచుండు నాళ్ళలోనే యీ నాడి బయల్పడెను. ఈ నాడి గల యాతఁడు కుంభకోణ వాస్తవ్యుఁడే. పట్టునూలిజాతివాఁడు. వలసినంత ధనము గొని తొలుత శ్రీవారి జాతకము చదివెను. అది చదువునాఁటి కాతనికి తద్గ్రంథవిధానము స్పష్టముగా నెఱుఁగరాకే యుండె నఁట! శ్రీవారి జాతకము చదువుటలో నా ప్రజ్ఞ యేర్పడె నఁట! ఆ జాతకము చదువుటపట్ల నాతనికి శ్రీవారియెడ భక్తి ప్రపత్తు లేర్పడెను. శిష్యుఁ డయ్యెను. అన్వహము శ్రీవారిదో, శిష్యులవో, ఇతరులవో జాతకములు చదువుట, దానివలని యాయతితో జీవితము గడపుట యాతని కేర్పడెను. ప్రధానముగా శ్రీవారియు, వారి కుటుంబమువారియు, శిష్యులయు, వారి కుటుంబమువారియు, జాతకములు చదువుటలో నాతనికి తీరిక లేకుండెను.

కొలఁది దినములలో శ్రీవారు శరీరమును విడుతురనఁగా నాతని ప్రశ్నించిరి. 'ఉన్నది యున్నట్టే వ్రాయుట, చదువుట జరుపుచున్నావా? కల్పనలు సాగించు చున్నావా?' అని. ఆనాఁడే ఆతఁ డొక కల్పనము చేసె నఁట! శ్రీవారి ముఖ్యశిష్యులలో 'అంబష్ఠుఁ' డొకఁ డుండెను అనుటకు 'అమ్మట నొరువన్' అని యుండగా నాడి కాపి వ్రాయుచున్న వాడు గోపీనాథరా వను శ్రీవారి శిష్యుఁడే నాడికారుని వంటి వాఁడే వాక్చహాయము చేయఁగా 'పండితనొరువన్' అని మార్చి వ్రాసెనఁట! దక్షిణదేశమున 'అంబష్ఠుని' పండితుఁ డనుట పరిపాటి–గడగడలాడుచు దీని నాతఁడు శ్రీవారికి నివేదించెను. ఎప్పుడుగాని యిట్లు మార్పవలదని శ్రీవారు శాసించిరి. కడకు శిష్యగోష్ఠిలో నీ విషయమును దెలిపి ఇదివఱకు వ్రాసిన భాగమున నిం కేమేని మార్పులు చేసినాఁడేమో

యవతరణికాభాగమును, విజయనగరపుఁ బక్షి శాస్త్ర శ్లోకములను, శ్రీవారినిగూర్చి నేను వ్రాసియుంచుకొన్న పద్యములను వ్రాసిపెట్టుకొన్న వ్రాఁతప్రతిని, ఇటాలియన్ నోటుబుక్కును ఎవ్వరో హరించిరి. అది నాదగ్గఱ నిపుడు లేదు. ఉన్నచో నాయాశ్లోకములను,అరవ పద్యములను, దెలుఁగుపద్యములను, చాల వింతవిషయములు గల వాని నిక్కడ నుదాహరించి యుందును.

*సీ.వీ.వీ. కరుణాకటాక్షములు రక్షించు≡ సదా తన్మయం*
*బై వర్ధిల్లెడుభక్తి యున్న యెడ నిత్యానంద మారోగ్య మా*
*హావుట్టించెడుప్రజ్ఞ యీత్రయము లభ్యంబౌను తార్కాణ నే*
*నే! వేయేటికి? మీర లిందఱును దీనిం జక్క గుర్తింపరో!*

సం॥ వే. ప్రభాకరశాస్త్రి



# పద్యావళి – గీతాంజలి

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

**త్రా**హి లోక మశేష మేత
మ్మోహమపనయ నిత్యశుభ మా
ధేహి పాహి జగద్గురో! ఇత
ఏహి భో స్స్వామిన్ – అభయమ్
దేహి భో స్స్వామిన్

మీరితిమి మీ యాజ్ఞ లోకో
ద్ధారకుల మని పొంగితిమి పై
బోరగిలపడు టెఱుగ మైతిమి
బ్రోవు మా తండ్రీ – దయతోఁ
గావుమా తండ్రీ!

అధికులము మే మనియు వేఱొక
రధములని దంభోక్తు లాడితి
మధఃపతనం బెఱుఁగ మైతిమి
ఆదుకొను తండ్రీ–దరికిని
జేదుకొను తండ్రీ!

నీటి మీఁదను నేల మీఁదను
నింగి మీఁదను వెలయ గంటిమి
చేటు నెఱుగకపోతి మిక ర
క్షింపుమో తండ్రీ – దయ వీ
క్షింపుమో తండ్రీ!

పూనితిమి విశ్వాధిపత్యము
పొంగిపోయితి మంతెకానీ
మానవుల మను మాట మఱచితి
మౌను మా తండ్రీ –తప్పిద
మౌను మా తండ్రీ!

## దర్శనాభిలాష

**ఎ**పుడు చూతునొ దివ్యతేజము
నెపుడు చూతునొ ధూమకేతువు
నెపుడు నా సందేహజలనిధు
లింకిపోగలవో!

సీ వి వీ కరుణా విశేషము
చేత నెన్నడు తొలగిపోవునొ
చిరయుగంబులనాటి మాయా
వరణ మదియెల్లన్.

తోచ దేపని చిత్త మెల్లను
దోచుకొంటిరి సద్గురూత్తమ
వేచియుంటిమి దర్శనమ్ముకై
వేగ రాగదరే.

(23-3-1926, డైరీ నుండి)

## దివ్యదర్శనము

**గు**రుచరణారవిందములకుం బ్రణమిల్లి తదీయ సత్కృపా
భర పరిసంస్కృతంబులగు భావములన్ వెలయించి త త్త్వ వి
స్ఫురణము లోకమందు బరిపూర్ణము కాగలదన్న వేడ్క పొం
పిరిగొన జెప్పెదన్ నిజము పెంచి సమంచితమైన సత్కృతిన్.

పండ్రెండేండ్లిటువంటి సంశయములే బాధింపగా నెన్ని యే
మంద్రాటంబులు గాంచితిన్ దొరకె నమ్మందగ్గ సన్మార్గ మో
తండ్రుల్, సర్వము నీశ్వరేచ్ఛ నడుపున్ దత్కృత్యముల్ గూఢముల్
కంద్రుంగానరు మానవుల్ తమ కహంకారమ్ము పైకొంటచేన్.



బ్రదికినచో లభియించెడి
ముద మేమో? చచ్చినంత బోయెడి దేమో?
తుద యేమో? మొద లేమో?
యెది యేమో తెలియలేక యేకరుటయ్యెన్.

నా చిత్తంబు పరీక్ష చేసుకొనుచున్నాడన్ యథార్థంబుగాఁ
బోచంతైనను దుష్ప్రవర్తనము దుర్బోధం బెఱుంగన్ బవి
త్రాచారంబున బ్రహ్మతత్త్వ పరమార్థానందముం గూర్చి యా
లోచింతుం బలవింతు జింతిలుదు నేలో నన్ను వంచించుటల్?

ఈశ్వరు డొక్కరుండు కలఁడే యని యొప్పిన యప్పు డాతఁడున్
నశ్వరుఁడౌనె యజ్ఞుఁడగు నావలె; గాక యనంత శక్తియున్
శాశ్వతుఁడేని తత్కృతియు శాశ్వతమై విలసిల్ల కేటి కీ
విశ్వము నశ్వరం బయి యవిజ్ఞతతో వెతలందగా వలెన్?

చక్షుర్గోచర మైన యీ జగతికిం జాటై యనేకాద్భుత
ప్రేక్షాలక్షిత మెంతయేన్ గలదు తద్విజ్ఞాన సర్వస్వమున్
లక్షింపందగు శక్తి మర్త్యులకు గల్గన్ లేద, యద్దానఁ బ్ర
త్యక్షం బైనది నీకింతఁ యట మాటై యింక నేమున్నదో.

కరుణామూర్తి జగత్కుటుంబి యతఁ డిక్కట్లన్ ననున్ ముంచునన్
వెఱ నా కింతయు లేదు తన్మయత నే వేళం బ్రవర్తిల్లుదున్
మరణం బిప్పుడు తప్పదే నదియు సంప్రాప్తించు లేకున్నచో
దొరకున్ నా పరితోషహేతు విట మీ ర్దుఃఖింపగా నేటికిన్?

ఎఱుగ న్నేరర కాని యీశ్వరుడు తానేమేమి కావించు న
త్తెఱ గెల్లన్ మునుమున్న సూచనలచే దెల్పించు విజ్ఞాత్మకుల్
గుఱుతింపం దగున ట్లెఱుంగుదును గై కోవన్న! నాయన్న! యీ
చిఱుదిండ్లన్ నెలనాళ్ళదాక; నటు పై జేకూరు నీ కామ్యముల్.

(రచనాకాలం 1924)

**క**వితాపట్టముఁ గట్టుకోఁ దొలుత వేడ్కల్ రేగె నాకుం గృతుల్
చివురొత్తెన్ వెస మోము మొత్తె నిఁక నాచేఁజెల్ల వీ కల్ల బొ
ల్లి వినోదంబు లివే జరామరణముల్ చీడల్ హతం బార్చి పు
ట్టువు చెట్టున్ సఫలీకరించుకొని యంటుల్ గట్టెదన్ మాలినై.
(13–12–46)

✳ ✳ ✳.

**ధ**న సంపాదన తత్పరత్వమున వంతల్ సెంద; నుద్యోగపుం
బెనుపుల్ వొందఁగ వందుఁఅన్; సుకవితా విద్యావిశేషమ్ములన్
ఘనతం గోరి తపింప; నీపయి జగత్కల్యాణమైపొల్చు నీ
యనవద్య స్థిర సత్కృపా గరిమమే యర్థింతు నాత్మేశ్వరా!

✳ ✳ ✳.

**ఆ**సల్ రేపఁగ నంతరంగపు టరణ్యం బంధకారమ్మునన్
దాసోహమ్మని చొచ్చితిన్ వెదక నంతర్యామి నాలో నెదో
భాసిల్లెన్ జిఱు వెల్గు చేర ఁ జన దావమ్మయ్యె నా యగ్నిలో
నే సోహమ్మ యి నిల్చితిన్ బిదప నేదీ నా తనం బయ్యెడన్.

✳ ✳ ✳.

**ఏ**రికోరి మనోహరంబులగు నీకీయెన్మిదేయంచు నా
త్మారామంబున బూవజేసితి నహింసాది ప్రసూనంబులే
నారాధించెద వీనిచే నిను ననంతాళ్వార్ల కైంకర్యపున్
దీరుల్ గావని వేరు సేయకుము తండ్రీ! వేంకటేశ ప్రభూ!
(9–2–1949)

✳ ✳ ✳.

**న**న్నున్ వర్ణన సేయఁగా వలవదన్నా కన్నయందాఁక మీఁ
దన్నీ వర్ణన మెందు కందులకు గొందాఁకన్ బ్రతీక్షింపు మం
చున్నన్గూర్చిన యుష్మదాజ్ఞకు నెదుర్చూపై గృహద్వారమం
దున్నాఁడన్ గనరాఁగదే! కనుట కర్హు న్నన్నుఁ జేయంగదే!



వర్తింతున్ మత దేశ జాతి కృతముల్ వైవిధ్యముల్ వీడి ని
ర్వర్తింతున్ బరిచర్య నార్తులకు యావత్ప్రజ్ఞ నర్పించి యా
వర్తింతున్ గురుదేవ సూ క్తములు భావస్ఫూర్తి నట్లయ్యు నే
ధూర్తుండౌదు నొకొక్కచో నడఁపుమీ తుందుడ్కు నాత్మేశ్వరా!

వచ్చెను నేఁటి కర్వదగు వర్షము పుట్టువుఁదొట్టి గర్భముం
జొచ్చుటఁ దొట్టి నా కరయఁ జూచిన నేఁటికె షష్టి పూర్తి యీ
వచ్చిన యేఁడు నిండిన ధ్రువంబుగఁ గాఁగల షష్టి పూర్తితో
నిచ్చట నాకుఁగావలయు నిష్టికిఁ బూర్తియు సృష్టి పూర్తియున్.
(7–2–1947)

✳ ✳ ✳.


**శ్రీ**నిరంతరానంద నిశ్రేయసార్థ
సాధకము సర్వ కిల్బిష బాధకము స
మగ్ర విజ్ఞానదము మహామహిమఘనము
శరణమగు మాకు సద్గురు చరణయుగము

✳ ✳ ✳.

**ఆ**కుజిల్కలు ఔక్క లల్లార్చి యాడుచో
బువ్వల్ గుబాళించి నవ్వుచోట
పక్షులతో వృక్షపటలి వెల్విరియుచో
జంపతుల్ వాహ్యాలి సల్పుచోట
జలజల సెలయేళ్లు జాల్వారి దొరలుచో
నదులు సంద్రములతో గదియుచోట
ఏకాగ్రవృత్తి యోగీశ్వరుల్ వెలయుచో
నద్రిశృంగములు మిన్నందుచోట

**ప**రమాణువునకు లోపల దాగు సూక్ష్మాత్మ
దయసేయవే సూక్ష్మదర్శనంబు
బ్రహ్మాండమునకు బై పడి వెల్గు పరమాత్మ
దయసేయవే పర దర్శనంబు
అఖిలంబునం దభివ్యాపించు విశ్వాత్మ
దయసేయవే విశ్వదర్శనంబు
ఏకమయ్యు ననేకమై వెల్గు నేకాత్మ
దయసేయవే యైక్య దర్శనంబు

గ్రుడ్డియెద్దు చేన బడ్డట్టు లిటునట్టు
కానలేక యెట్టొ కడచుచుంటి
ఆదుకోవె! సచ్చిదానందపద మీవె
నాథ! నన్ను నిన్నొ నర్చుకోవె!



## 1940

12-01-40 గతమును గూర్చి పశ్చాత్తాపము మంచిది. ముందు అట్టి దోషములకు పాల్పడకుండిన చాలును.

18-01-40 వృత్తిలోకసామాన్యధర్మం పాటించి దురన్యాయములు చేయక వర్తించుట.

20-02-40 వృత్తిలోకసామాన్యధర్మం పాటించి దురన్యాయములు చేయక వర్తించుట. కామనిగ్రహము అవసరము.

25-01-40 నా కాలు వాపు - వారి గజిబిజి - తత్పరతతో తపింపు, ఇతర Treatment కు అభ్యంతరం లేదు.

01-02-40 రిటైర్ అయినాను. రెండు మూడు రోజులలో తిరుపతి.

04-02-40 మామూలు ప్రార్థనలో మాత్రమే గాక రాత్రి 9 గంటలకు ప్రత్యేక Treatment - కాలిని గూర్చి. నీ మనసాక త్రోవ నుండదు. కంట్రోలు, నిలుకడ వలయును.

09-02-40 అన్ని ఆపదలలో రక్షింపగలది ఈశ్వరానుగ్రహము. ఇతర సహాయం పొందినా అభ్యంతరం లేదు. నా ఇబ్బందులలో నీ ఇబ్బంది లెక్కలోనిది కాదు. నావంతు నేను. మీవంతు మీరు. పరస్పర కష్ట సమీకరణ శక్తిని లోకమింకా గుర్తించలేదు. రామకోటయ్య ద్వారా నా జాబు - ఇతరులకు ట్రీట్మెంటు చేయుచుండగా కబుర్లు సాగించి చీకాకు కలిగించుట.

22-02-40 తిరుపతి వచ్చి ఆరోగ్యం బాగుపడేదాకా కదలకుండా ఉండవలయును.

28-07-40 మదర్, బాపట్ల Speech. శాస్త్రిగారి reaction, "శక్యమైతే సవిస్తరంగా జాబు వ్రాయండి."

04-08-40 "అమ్మగారి సంభాషణ మదియెల్ల నేదో నాకక్కర లేదు. వానినెల్ల నే దెలుపగోరలేదు. మీరు తొలుత వ్రాసిన విషయములు సందిగ్ధములుగా నున్నవి - గాన స్పష్టముగా తెలుపగోరితిని.



## 1941

20-03-41 నా జాబు భాగాలు త్రిప్పి పంపుట, నా ఉద్రేకము చల్లారలేదు. అమ్మగారు నన్ను స్మరించుట. తిరుపతి వచ్చినప్పుడు నా పరిశ్రమ మరువరానిదనుట - తాను (శాస్త్రిగారు) నా తలపులో విశ్వాసము లేనివాడగుట - నా (K.V.R.) అపార్థమునకు వగవు

( Gap 1 సం॥ 9 నెలలు 14 రోజులు)

(August 40 -42 May)

## 1942

18-05-42 మీరు గుంటూరులో ఉన్నారో లేదో తెలియదు. ముఖ్యమైన విషయం తెలుపదలిచాను.

21-05-42 జయంతిపురం వారి జాబు పంపుతున్నాను.

17-06-42 జయంతిపురం వారి జాబు పంపుతున్నాను.

06-07-42 పార్థసారథికి.

## 1944

03-12-44 నన్నుగూర్చి యోగమునుగూర్చి వారికి వీరికి తెలిపితే వాళ్లు మతిచెడి ఉన్నారనుకుంటారు. తథ్యము వెల్లడయ్యేదాక నన్ను నన్నుగనే ఉండనియ్యండి.

## 1945

28-03-45 శంకరశాస్త్రిగారి అల్లుడు చనిపోవుట. శాస్త్రిగారి కల్లోలము. కోదండరామయ్య సమాధానము :

1. 20 వ తేదీన కుంభకోణంలో ఉన్నారు. Master recall ing Process కోసం.
2. 23 వ తేదీ ఇంటికి వచ్చి మరణవార్త.
3. కలవరము.
4. సమాధానం. కొద్దిరోజులలో Mediumsలో గొప్ప మార్పు.

1. భారత వర్షము తద్వారా ప్రపంచము శాశ్వతానందము పొందే రోజులు దాపురించుచున్నవని పరితోషము హెచ్చుగానున్నట్లు - ఎడనెడ నిరుత్సాహం.

2. సత్యానుభూతి ఇంకా కలుగలేదు. నిత్యనిర్వికల్ప ప్రమోదము, మాయావరణం లేని నిత్యసత్యానుభూతి ఇంకా కలుగలేదు. ఏ మాత్రం కలిగినా తెలుపుతాను.

04-09-45 నా సంశయం నీకు ఫోటో అయినది నడుస్తూ సందేహం, నడుస్తూ రాలిపోతానేమోనని సంశయం, ఇప్పుడు నయం, కాని మనస్సు సముద్రమున మునగానాం తేలానాం. సంకల్పం, మార్గం-అఖండము. యద్భావి తద్భవతు. రామకోటయ్య వచ్చినపుడు నాతో - తిరిగి వెళ్ళినపుడు నేనుండవలె.

06-10-45 వేంకటేశ్వరరావు నన్నుతోడ్కొని వచ్చె, మరల తోడ్కొని పోవుటకు రాడా? అని రామకోటయ్యకు సంశయం. నీవు వస్తివా - నాకూ మాట దక్కుతుంది. (విజయదశమి - తప్పక ప్రయాణం)

30-10-45 మీ ప్రయాణ సంక్షోభం దేశవిప్లవం - ముందు నా శరీరముననే జరుగునని గదా - ఇక్కడ నాకై చాలా శ్రమపడితివి. నేనిప్పుడు చాలా సర్దుకుంటున్నాను. అప్పుడప్పుడు తంటా - నిబ్బరించుకుంటున్నాను.

12-11-45 రామకోటయ్య సరిగా జవాబు వ్రాయడు. కనబడితేతరచు వ్రాయమని తెలుపవలె. ఇక్కడ నా ఆరోగ్య విషయంలో చాలాసాయం చేసితిరి.

16-11-45 రామకోటయ్య : జాబు వ్రాయుట అశ్రద్ధ - కవిత్వం మిత్రులకు సావకాశంగా వ్రాసి, నాకు సూటిగా ఆరోగ్యవార్త తరచు కార్డు వ్రాస్తే సంతోషం.



08-12-45 శ్రీశాస్త్రిగారి ఆరోగ్యం నాలుగు రోజులు చక్కగా, నాలుగు రోజులు తంటాలు, కుంభకోణం వెళ్ళాలి, వస్తారా.

09-12-45 1. సుజాతమ్మ 2. వినతమ్మ

23-12-45 కుంభకోణం వెళతాను వస్తారా! రామకోటయ్య ప్రస్తుతం వద్దు.

28-12-45 వినతమ్మ

## 1946

14-01-46 ముక్త్యాల వెళ్ళునప్పటి కొండంత ఆశ. కుండంత నెరవేరుట, గాంధీగారు వస్తున్నారు. నేనై పూనుకొని చేయగలదేమి? ఏం జరుగనున్నదో ఊహించలేను. కాని ఈ రోజులలో కొంత ఆధ్యాత్మిక ప్రజ్ఞ ప్రవ్యక్తత పొందగలదనే ప్రతీక్ష.

07-02-46 అలజడులు, చీకాకులు, వెడలిపోవలసి ఉన్నది. నేను సుస్థీగా ఉండగా రాత్రులకు రాత్రులు నాతో బాధపడిన నిన్ను నేనెన్నడూ అన్యధాగా భావించను.
ఇనిషియేషన్. "నేను" ఇనిషియేషన్ చేయడమనేది C.V.V. పునరవతరణమయి వారి స్వరూప దర్శనము నాకు కలిగినపుడే - కలిగితేనే - అనగా మృత్యురాహిత్యపు తలపు ఫలించుట అది.

15-02-46 క్షామం:- క్షామం ప్రబలమవుతుంది. విశేషాలు జరుగును. అశ్చర్యకర విషయములు ప్రవ్యక్తమగును - ఒంటిపూట భోజనం. ఈ సంవత్సరం C.V.V. అనుగ్రహం Physical Level లో తెలియగలదని ప్రతీక్ష.

26-03-46 కుంభకోణం వెళ్ళివచ్చారు.

1. ఈ సంవత్సరం రాజ్యాంగ వ్యవహారంవలెనే యోగ వ్యవహారం తేలునని విశ్వాసం.
Comet
1. Comet తెలియడం

## 1948

27-01-48 (Great Expectation) వెనుకడుగు లేకముందుకు దూకుతున్నాను. మార్చిలోగా చాలా విషయాలు తేలగలవని. రమ్మని వ్రాసే యోగ్యత కలిగిన వెంటనే వ్రాస్తాను రా!

13-02-48 పద్యాలు

23-04-48 మే నెలలో జాగర్లమూడి వస్తారని. తోటలలో ఒక్కపూట వుంటారని

22-05-48 జాగర్లమూడి నుండి తిరిగి తిరుపతి చేరుట

26-05-48 (కోదండరామయ్య)శాస్త్రిగారు జాగర్లమూడి అతిథ్యమును ప్రశంసించుచు పలికిన మాటలు.

30-06-48 డా॥ వీరయ్యగారి కుమార్తె Treatment

24-10-48 గురుపూజ - సుజాత వివాహమునాటికి బాగా గొప్పగా గురుపూజ సంచిక వెల్వరచవలెను.

10-11-48 నేను (శాస్త్రిగారు) మీకు Treatment చేయడం గాదు మీకు"మీరు" చక్కదిద్దుకోవాలి. ఇతరులను దిద్దవలె. ప్రభాకరము వ్రాయుట నిరాక్షేపముగా సాగదగినదని తలపు.

## 1949

31-07-49 విశ్వనాథవారి పిల్లవాని మరణం

12-08-49 మా తల్లిగారి మరణం : ఒకటి, రెండు రోజులు ఇక నిల్వనను ఎరుకతో వెళ్ళేదేమంచిది.
"ఆమె ముఖము, ముక్కు సాధ్వీత్వ భాగ్య చిహ్నితముగా నుండెను."

05-10-49 "నీకు" గల సుఖానందపరికరములు లేనివారెందరున్నారో ఎంతెంత సంకటములతో నలుగుతున్నారో చూడు. నా



మటుకు నేను "సి.వి.వి. అనుగ్రహం" అమృతభాండము'లో' నుంచుకున్నాను అన్న ఆనందోత్సాహములతో పొంగిపోతూ ఉంటాను.

బ్రహ్మ సంస్పర్శ : మనమందరమూ - బ్రహ్మసంస్పర్శ అత్యంత సుఖప్రదము, మనకు లభిస్తున్నదన్న సంతోష డోలలలో హాయిగా ఊగులాడుతూ ఉండవలసిన వారమే. ఇది గుర్తింపని వారిని గూర్చి అనుతపింపవలసిన వారమే అందులోనే శాంతి సౌఖ్యము లున్నవి.

ఎన్నో తీవ్రయోచనలు జనవరి తుదిలోగా Equinox లోగా? మే 29 లోగా చాలా విషయాలు మనలో వ్యక్తం కాగలవని, సరియైన పరమార్థమార్గంలో నడుస్తున్నామను నిర్ణయం మనకు ఉంటే చీకాకులు వచ్చి పోతవి, అనిశ్చయము ఒకతూరి కల్గేది కాదు. ఎరుక మరుపులుగా దృశ్య అదృశ్యములుగా వెనుకబడి ముందుకు దూకి లేదేమో అనిపించి, ఉన్నదని దృఢీకరించి చిత్రచిత్రముగా మనను తీసుకుని వెళ్తుంది.

19-10-49 1. మనో వైక్లబ్య అశాంతులే బాహ్యావైక్లబ్య వ్యాధులగును.

2. మనలను మనము జీవ-పరమాత్మలు ఇత్యాది ద్వంద్వములను పరస్పర ద్వైవిధ్యమును, ఏకతను సాధించుకుంటూ బోధించుట చరమానందములో ఐక్యమగును.

3. నన్ను మీరు,నన్ను సి.వి.వి., దాన్ని నేను, సి.వి.వి. ప్రకృతిని, ప్రకృతి సి.వి.వి.ని విడనాడతరముగాదు.

4. బయట అశాంతిలో చిక్కుకొనక కూర్చోగా 'V' అన్నట్లు లోలోనికి పోయి ఏకీభవించి ఆనందము తెచ్చుకోవలెను. Equinox దీనిని నేర్పుతుంది.

24-11-49 ఔషధం మీ కుటుంబానికి ఆవశ్యకమైనచో ఔషధ సేవ జరుపునది. అన్నింట సి.వి.వి. అనుగ్రహం వెలయ గలదు.

సామాజిక, చారిత్రక, రాజకీయ, యోగవాఙ్మయ చైతన్య వికాసాన్ని చిత్రించే ఈ లేఖలు అమూల్యమైనవని వేరుగా చెప్పనవసరం లేదు.

ఈ కార్యమునకు నాందిగా ఇప్పుడీయోగవాఙ్మయలేఖలు ముద్రణకు సిద్ధమగుచున్నవి. వీటిలో ఎన్నిక చేసి, ముఖ్యాంశములను గూర్చి, వివరణమును జతచేసి, సముద్దేశమును తెలిపి, పీఠికను కూడా వ్రాసి 1980 లో అచ్చునకు సిద్ధం చేసిన ఈ ప్రతి పాక్షికముగా 25 ఏండ్ల క్రితం వే.ప్ర.స్మారక ట్రస్టు వారికి అందినది. ఇప్పుడీ వ్రాతప్రతి దైవసంకల్పమువలన సంపూర్ణముగా లభించి వెల్లడవుతున్నది. 12-10-2007 నాడు ఈ గ్రంథం శుద్ధప్రతిని పంపిన వారు చి॥ విజయసారథి గారు. ఆనాడు గ్రంథమును సంకలం చేసినవారు శ్రీకొత్తవేంకటేశ్వరరావు గారు. ఈ గ్రంథ సంకలనమున సహకరించిన సహృదయులు శ్రీ కొత్త రామకోటయ్యగారు, శ్రీ వీరమాచనేని సంగమేశ్వరరావుగారు. వారి కలలకు అక్షరాకృతి నిచ్చి, వ్రాతప్రతి మాతృకల నిచ్చి తోడ్పడినవారు శ్రీకొత్తవేంకటేశ్వరరావుగారి కుటుంబసభ్యులు. (కె.వి.ఆర్. గారి సతీమణి శ్రీమతి రంగమాంబగారు, ఆమె సోదరి శ్రీమతి వేదవతిగారు, కుమార్తె డా॥ ఉషాలక్ష్మిగారు, కుమారుడు చి॥ కె.యస్.ఆర్ మూర్తిగారును) వారికి కృతజ్ఞతాభినందన లందిస్తున్నాము.

గౌతమబుద్ధుని, మహావీరుని, మహాత్ముడైన గాంధీజీని గుర్తుకు తెచ్చిన యోగమిత్రులకు, ధర్మాసక్తులు ఈశ్వరతత్పరులులైన సహృదయు లందరికీ స్ఫూర్తినిచ్చే శ్రీప్రభాకరుల జ్యోతిర్మయస్వరూపానికి కిదే మా నివాళి.

విజయదశమి, ఆశ్వయుజ, సర్వజిత్ - **వేటూరి ఆనందమూర్తి**

(21-01-2007)

⁂ ⁂ ⁂.



## శ్రీ శాస్త్రిగారి లేఖలు
## యోగమిత్రుల మాట

పూజ్యపాదులు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రులవారి పాద పద్మములకు నమస్కారములు. గురుపాదపూజ అనగా గురువులు నడచిన మార్గము నందు మనము నడవ ప్రయత్నించుట, ఆ యోగమార్గము నారాధించుట-గురుచరణసేవ. అనగా గురువులు చరించే సన్మార్గముననుసరించుటయే. శ్రీ ప్రభాకరశాస్త్రిగారి యోగజీవితము పద్మమువలె వికసించునట్టిది. అట్టి వికాసమే సదా మనలో వర్తించుచు, ఇట్టి పుస్తకములను వెలువరించుటకు కావలసిన పరమోత్సాహమును మనకు ప్రసాదించుచున్నది. ఈ లేఖలు చాలా కాలం క్రిందట శ్రీశాస్త్రిగారు వారి శిష్యు లొకరి మేలుకొరకు వ్రాయబడినవిగా ప్రచురితమవుతున్నవి. శ్రీ శాస్త్రిగారి చేత మొదట ఈ లేఖలు వ్రాయించిన సంకల్పమే ఇప్పుడు దీనిని ప్రచురింపజేస్తున్నది. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ప్రేమావతారులు. మాకు శ్రీవారు బుద్ధుని అవతార మనిపించును. వారు చుట్టూ వుండే వారి యెడల చూపిన ప్రేమ ఇంతింతయనరానిది. వారు కరుణారసము మూర్తీభవించినట్లుందురు. ఇట్టిదని వివరింప వీలుగాని ఆకర్షణము, మంచితనము, శ్రీశాస్త్రిగారి చుట్టూరా ప్రసరించుచుండేది. శ్రీవారు శరీరంతో నున్నప్పుడు వారిసన్నిధిలో ఎంతకాలము గడచినదీ తెలిసెడిది కాదు. మనకున్న శరీర బాధలు, మానసికమగు నొడుదుడుకులు, సంసార సంబంధములగు చిక్కులు అన్నియు శ్రీశాస్త్రిగారిలోని కాకర్షింపబడెడివి. కాలము ఎంతయయినది తెలియనట్లే బాధలు, చీకాకులు కూడ తెలిసెడివి కావు. వాని నన్నింటిని 'తమవైపున' కాకర్షించుట ద్వారా సమీకరించి తొలగించాలని శ్రీవారు ఆరాటపడేవారు. బాధల సమీకరణము జరుగ వలయునని వారు తమ లేఖలలో తరచు వ్రాసేవారు. ఇందలి లేఖలలో గూడ సమీకరణమును గురించి వ్రాసిరి. మన బాధలను తాము ఆకర్షించి ఆహరించుటయే గాక మన కానందమును పంచియిచ్చే కార్యక్రమము అదే సమయములో దానియంతట యది గానే శ్రీవారిసన్నిధిలో జరుగుట చాలా సహజముగా నుండెడిది. అట్టి శ్రీవారి ప్రేమమార్గమిపుడూ విస్తరించుచునేయున్నది.

ఇక వీటి ప్రచురణనుగూర్చి మనవి చేస్తాను. 30-40 యేళ్లనుండి ఈ జాబులు నా పెట్టెలోనే భద్రంగా వున్నాయి. కాని వీటినొక నాటికి ప్రచురిస్తానని నేనెన్నడూ ఊహించలేదు. శ్రీ శాస్త్రిగారు కూడా అలా ఊహించి వుండరు. నేను వీటిని శ్రీ శాస్త్రిగారి యందు నాకు గల ప్రేమ గౌరవాలకు గుర్తుగా భద్రపరచుకొన్నాను. ఈ మధ్య జూన్ నెలలో కాబోలు నేను సకుటుంబముగా హైదరాబాద్ వెళ్లినప్పుడు శ్రీశాస్త్రిగారి మూడవకుమారుడు ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు రీడరుగా వున్నవారు అయిన డా॥ ఆనందమూర్తిగారు, మా పూర్వమైత్రిని మరువక, ఆప్యాయతతో మమ్మల్ని విందుకు ఆహ్వానించారు. అప్పుడు ప్రసంగవశాత్తు వారు తమ తండ్రిగారి జీవితచరిత్ర వ్రాయాలనుకుంటున్నా నని అందుకు పనికి వచ్చే జాబులేమైనా మీ దగ్గర వున్నవా? అని అడిగారు. నేను వున్నవన్నానే గాని, నా పనులలో నేను మునిగి వాటి పనిచూడలేదు.

ఇంతలో ఆగష్టు నెలలో శ్రీ మాస్టరు సి.వి.వి. గారి 113 వ జయంతి, శ్రీ శాస్త్రిగారు 30 వ వర్ధంతి జరుపుతున్నామని ఆ రోజులలో జరిగే ప్రార్ధనలలో పాల్గొనడానికి రాగోరుచున్నామని శ్రీప్రభాకర మిత్రమండలి వారు తిరుపతి నుండి నాకొక ఆహ్వానం పంపారు. కారణాంతరాలవల్ల నేనక్కడికి పోలేకపోయాను. పోనీ ఇంటిదగ్గరైనా ఆ మహనీయులను సంస్మరించాలని తోచి, వారిని గూర్చి నావద్ద నున్న సమాచారమంతా తిరగవేస్తూ శ్రీశాస్త్రి గారి జాబులన్నీ వరుసగా చదువుకున్నాను. అప్పుడు డా॥ ఆనందమూర్తి గారి మాట జ్ఞాపకము వచ్చి శ్రీ శాస్త్రిగారి జాబులకు టూకీగా ఒక విషయసూచిక వ్రాశాను.

ఈ సంగతి అక్టోబర్‌లో ప్రసంగవశాత్తు యోగసోదరులు శ్రీకొత్తరామకోటయ్యగారు, సంగం జాగర్లమూడి వచ్చినప్పుడు చెప్పాను. ఆయన ఆ విషయసూచిక చూసి ఇస్తానని తీసుకొని వెళ్ళారు. దానిని గుంటూరులో కొందరు యోగమిత్రులు చూడడం తటస్థించినదట. వారు ఆ లేఖలోని అఖండ ప్రేమసందేశము వల్ల ఉత్తేజితులై శ్రీశాస్త్రిగారి సందేశాన్ని పుస్తక రూపంలో అచ్చువేసి అందించితే అందరికీ మార్గదర్శకముగా వుంటుందని ఉత్సాహముతో అన్నారట. తరువాత 2,3 రోజులకు శ్రీరామకోటయ్యగారు నాకామాట అందించడము,



ఆ మాటలోని సబబు గ్రహించి, వెంటనే నేనందుకు అంగీకరించటము, వెంటనే ఆయన పనిబూని నేనే చెబుతూ వుండగా తనే వ్రాయ నారంభించటము క్షణాల మీద జరిగింది. పని మధ్యలో ఆయనొకసారి యోగమిత్రులను కలవడానికి గుంటూరు వెళ్లాలనుకున్నారు. కాని (అక్టోబరు) 18,19 తేదీలలో (విజయదశమి నాడు) వచ్చిన గాలివాన ఆయనను కదలనీయలేదు. ఆ మిత్రులు కోరిన పనినే ఆయన ఇక్కడనే సాగించవలసి వచ్చింది.

(35 సం॥ల క్రితము సరిగా అక్టోబరు, 18 వ తేదీన విజయదశమినాడే ఇంతకన్న చాలా పెద్ద గాలివానలో మేము కలసి ప్రయాణము చేశాము. అది ఈ లేఖలలో వస్తుంది) ఈ వరసంతా ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే **ఇందులో ఏదో ఒక అదృశ్య సంకల్పము తనను తాను నిర్వహించుకొన్నట్లు తోస్తుంది. అదే హైదరాబాద్, తిరుపతి, జాగర్లమూడి, గుంటూరులలో, కారణరూపములో చక్రభ్రమణము చేసి, కార్యావస్థలో ఈ ప్రచురణ రూపము దాల్చింది. ఈ పనిలో సహకరించిన మిత్రులందరికీ నా నమస్సులు.**

ఈ జాబుల నుండి కొన్ని తాత్కాలిక విషయాలను, వ్యక్తిగత విషయాలను తొలగించాను. శ్రీశాస్త్రిగారి మహదాశయాలను, వారి అవిరళ కార్యకలాపాలను, యోగ విషయాలను, శ్రీమాస్టరుగారి దివ్యానుగ్రహాన్ని తెలిపే భాగాలను మాత్రం వుంచాను. జాబుల చివర నేను వ్రాసిన విజ్ఞప్తిలో అక్కడక్కడ కొంత అప్రస్తుత విశ్లేషణ దొర్లి వుండవచ్చు. యోగమిత్రులు దీన్ని పాటించక సహృదయంతో శ్రీశాస్త్రిగారి అమరప్రేమ సందేశాన్ని గ్రహించగలరని ఆశిస్తున్నాను. 30 ఏండ్లు పెట్టెలో అజ్ఞాతవాసము చేసిన శ్రీశాస్త్రిగారి సందేశ జ్యోతి సహృదయులైన మిత్రుల హృదయ పేటికలలో కాంతులను విరజిమ్మగలదని ఆశిస్తున్నాను. ఈ జాబులవల్ల నేను పొందిన ఆధ్యాత్మిక, మానసిక, ఆరోగ్య లాభాన్ని మించిన అనుభవము మిత్రులకు కలుగవలె నని శ్రీమాస్టరు గారిని ప్రార్థిస్తున్నాను.

సంగం జాగర్లమూడి
30. అక్టోబర్ 1980

సం॥ **కొత్త వేంకటేశ్వరరావు**

# ఉభయ కుశలోపరి

## లేఖ-1

సి.వి.వి. 11-09-39

4, వెంకటరంగం పిళ్ళైవీధి,

తిరువళిక్కేణి.

ఆశీర్వచనములు. ఉభయకుశలోపరి.

....మీరు పంపిన వింత కొత్త అట్లాసు చేరినది. చూచి చాలా సంతోషించినాను. యుద్ధము అదిగో, ఇదిగో అనుకొనుచున్నది వచ్చి పడినది. దీని బీభత్సము దుఃఖకరముగా ఉన్నది. (రవీంద్రనాథ్) ఠాగూర్ గారు అన్నట్లు ప్రకృతి దేవత రక్తస్నానము చేయును గాబోలును. దీనితోనైనా పశుభావము 'అడగారుగా'కని వేడుదము. ఈ యుద్ధము మన సి.వి.వి సిద్ధాంతము వెల్లడియగుటకు ద్వారము కాగలదని నమ్మిక....సి.వి.వి అనుగ్రహము మనలను ప్రేమమయులజేయుగాక.

వే॥ ప్ర॥

## మనవి:

ఏ ఒక్కరి దుఃఖము చూచినా కరిగిపోయే శాస్త్రిగారు ప్రపంచ మానవ మారణహోమాన్ని గూర్చి ఎంత వ్యాకులము పొందినదీ వేరే చెప్పనవసరము లేదు. 1914 సం॥ యుద్ధములోని హింసాకాండ వలన వారికి కలిగిన మనోవ్యాకులత దుర్భరమై తీవ్ర శారీర అనారోగ్యముగా పరిణమించినది. అప్పట్లో దాని అసలు కారణము ఎవరూ గుర్తించలేదు. అది ఏ మందు మాకులకు లొంగలేదు. చివరకు (1916 లో) శరీరత్యాగ సంకల్పము కూడా కలిగించినది. ఆ సమయములో శ్రీశాస్త్రిగారు తలవని తలంపుగా శ్రీమాస్టరుగారి యోగాన్ని గురించి వినడము, ఆరోజే మద్రాసునుండి కుంభకోణము వెళ్లడము, మాస్టరుగారి అనుగ్రహం వలన ఆరోగ్యము పొందడము,ఇత్యాది విషయాలు వారు 'ప్రజ్ఞాప్రభాకరము'లో వ్రాశారు.మాస్టరుగారి శిష్యత్వము లభించిన 1916 నుండి జీవితాంతము వరకు శ్రీ శాస్త్రిగారికి మాస్టరుగారి అనుగ్రహం వలన ఎన్నో మానవ బాధలను నివారించే శక్తి కలిగింది. పూర్వము గౌతమ బుద్ధుని వలెనే,



మానవ దుఃఖనివారణే శ్రీశాస్త్రిగారి జీవితలక్ష్యమయినది. అయితే అప్పట్లో బుద్ధునికి అలాంటి శక్తి లభించిందో లేదో తెలియదు. ఆయనకు సర్వ నిర్వాణ యోగము లభించిందని మాత్రము ప్రసిద్ధము. శ్రీశాస్త్రిగారికి మాస్టరుగారి దయవలన సర్వపరిపూర్ణయోగము లభించినది. దానిని వారు సత్య దయోపకారసార్థకమైన ఆత్మచింతన పథముగా మలిచారు. ఆ మార్గాన్ని అచంచల దీక్షతో అవలంబించారు. అకుంఠిత ఉత్సాహముతో ఇతరుల దుఃఖాలలోనికి దూరి సహానుభూతి వలన ఈశ్వరానుగ్రహాన్ని ఆకర్షించి, వారికి మేలు చేయటమే తమ జీవిత ధర్మముగా భావించారు. చివరకు మానవాళికి జరామరణ దుఃఖాలనే తొలగించి అందరికీ అమృతత్వము సాధించవలెననే సర్వాత్మనా యత్నించారు. ఇదే వారి సుదీర్ఘసాధన ఆంతర్యము. మృత్యువు తాండవించే ప్రపంచయుద్ధంనుండే దానిని నివారించే అమృతత్వముకూడా ఆవిర్భవిస్తుందని, ఆవిర్భవించవలె నని వారెంతో ఆశించారు. ఈ తొలి జాబు వారి సాధనకు అనుద్దేశితమైన చిన్న వ్యాఖ్య యనవచ్చును.

## లేఖ-2

సి.వి.వి. 3-10-39

...మీరు పంపిన కండెలు, గోంగూర చేరినవి. మీ కార్డు చేరినది. తొలి జాబు చేరినది. మీ బావగారి జాబు చేరినది. ఈ నడుమ చిక్కులతో నలిగినాను. కాన జాబులకు బదులు వ్రాయలేదు. అంతా సుఖస్థితికి వచ్చితిమి గాన ఇపుడు వ్రాస్తున్నాను.

చి॥ మా తమ్ముని కుమారుడు, నా దగ్గర ఉన్నవాడు, స్నానము చేసికాలుజారి సిమెంటు నేలమీద వెనుక తట్టుకు పడినాడు. (మీ కండెలు వచ్చిన రెండవ నాడు) స్మృతి లేదు. వికారదశ, ముచ్చిలి గుంట కడ దెబ్బ ప్రమాదకరము. చాలా చికాకు పడితిని. సాయంకాలానికి ప్రజ్ఞ వచ్చినది. ఏ వికారము లేకుండా క్రమశః చక్కబడినాడు. ఇపుడు కులాసాగానే ఉన్నాడు.

వారుకూడా మాస్టరుగారి మీడియమే. శ్రీవారినిగూర్చి చాలా గౌరవము కలవారే. అలాంటి గురువులను తానెక్కడా చూడలేదనేవారు.అయినా మాస్టరుగారి నిర్యాణము వల్ల నిస్పృహచెంది యోగాభ్యాసము మానివేశారు. అయినా నన్ను వారి దగ్గరకే వెళ్లమన్నారు. ఇందుకు కారణాలు రెండు.

1. ఆ రోజులలో శ్రీశాస్త్రిగారి ట్రీట్‌మెంటు పొంది ఇంటికి చేరినవారు స్వయంగా ప్రార్థన చేసుకోవడాన్ని శ్రీశాస్త్రిగారు అనుమతించేవారు కాదు. ఎవరో ఒక సీనియర్ పర్యవేక్షణను సిఫారసు చేసేవారు. ప్రేయర్ లో జరిగే యాక్షన్‌కు తబ్బిబ్బులు పడతారని ప్రేయరుకు అపఖ్యాతి కలుగుతుందేమోనని వారి సంకోచం.

2. మాస్టరుగారు శిష్యత్వము పొందిన తర్వాత ఆ మార్గం వదలిన వారు కూడ తిరిగి అందులో చేరి, తాము పొందిన విధంగా ఆరోగ్యము, సంతోషాలను పొంది, ఇతరులకు ఉపకారులు కావలెనని శ్రీశాస్త్రిగారి ఆకాంక్ష.

### లేఖ 4

సి.వి.వి. 24-11-39

ఆశీర్వచనములు. ఉభయకుశలోపరి. మీ జాబులు చేరినవి. మీరు ట్రీట్‌మెంటుకు వెళ్లుటకు సాధ్యముకానిరోజులలో ఇంటిదగ్గర ఇంచుమించుగా ఉదయం 7.30 కు నమస్కారము చేయుచుండుడు. తప్పక త్వరలో తగ్గగలదు. అవకాశము ఉంటే మీరు మాత్రము క్రిస్మస్‌లో మద్రాసురండి. ఈ లోగా సర్దుకోగలదని నాగాఢవిశ్వాసము. నా చిక్కులు తలమునకలుగా ఉన్నవి. శెలవు రెండు నెలలు పెట్టినాను. దీని తుది రిటైరు కావడమే. చి॥ సుజాత బాగా ఆరోగ్యము పొందినది. వానల తరువాత తీవ్రమైన చలి, దానివల్ల అనేకులకు జలుబులు, జ్వరాలు. మా ఇంట కూడా పిల్లలు నలిగిరి. సర్దుకొన్నారు. ఆరోగ్యము జాగ్రత్తగా చూచుకోండి. అప్పుడప్పుడు పసరు, జాస్తిగా వుంటే సోడా-బై-కార్బు అంటారు కాబోలును, కొంచెము పుచ్చుకుంటే తగ్గునంటారు. డాక్టర్లు మంచిదంటే అది పుచ్చుకోండి. హెచ్చు మందులు వద్దు. ఆహారము



తగ్గించండి. తరచూ జాబు వ్రాయండి. చి॥సౌ॥ మీ అర్ధాంగి ఆరోగ్యమును గూర్చి మందులు వగైరాలు వాడుడు. ప్రార్థనలు జరుపుడు.

వే॥ ప్ర॥

### విజ్ఞప్తి:

1939 చివరి భాగం - శ్రీ శాస్త్రిగారికి వృత్తిపరంగా చాలా క్లిష్ట సమయము. జీవికకు ఆధారమైన ఉద్యోగము నుండి విరమించే సమయము. కొంతమంది వ్యతిరేకత వలన మద్రాసులోనే మరొక ఉద్యోగానికి అవరోధము ఏర్పడినది. అదే సమయంలో ఇంట్లో పిల్లలకు ప్రమాదకరమైన యాక్సిడెంట్లు, తక్కిన వారికి జలుబులు, జ్వరాలు. వీటితో సతమతమవుతూనే నాబోటి వారి ఆరోగ్యాన్ని గూర్చిన తపన. మిక్కిలి అవసరమయితే చాలా కొద్ది మోతాదులతో మందులు పుచ్చుకోమని అనుమతి, అదిన్నీ ఎన్నో షరతులతో.

### లేఖ 5

సి.వి.వి. 26-11-39

నిన్న సాయంకాలము 6-15 కు ట్రీట్‌మెంటు మీకు తీవ్రముగా జరిగినది. మీ ఆరోగ్యము చక్కబడుచుండునని నమ్ముచున్నాను.

అందరము క్షేమము. ఇప్పుడు లీవు ముగియుట, సర్వీసు ముగియుట అనియే నా నిశ్చయము.

వే॥ ప్ర॥

### లేఖ 6

సి.వి.వి. 14-12-39

మీ ఇల్లాలు సుఖప్రసవమైనందుకు సంతోషము. కడుపునొప్పి యుండరాదు. అక్కడ సరియైన ప్రసూతి తంత్రజ్ఞుల సలహా పొందగోరినాను. ప్రసవానంతరము వెడలి పోవలసిన పదార్థము కొంత అట్టే వుండకుండుటను సరిగా తెలుసుకోండి. ఇపుడు మధ్యాహ్నం 4 గం॥ ట్రీట్‌మెంట్ చేయుచున్నాను. చేసి, తరువాత జాబు వ్రాస్తాను.

## లేఖ 10

సి.వి.వి. 9-2-40

...మీకు కొంత సుగుణముగా ఉన్నందుకు సంతోషము. ఎన్ని ఆపదలలో గాని, ఎట్టి దుర్వార దుఃఖములలో గాని, నిజముగా రక్షింపగలది - ఈశ్వరానుగ్రహము. తక్కినవి దానికి లోబడినవే. నిర్వికల్పముగా ఈశ్వరానుగ్రహము విశ్వసించి ప్రార్థించినను, ఇతర సహాయములు పొందినను నాకంతగా బాధయుండదు. భగవదనుగ్రహము గూర్చి వెగటు, రోత, విసుగు కలుగరాదు. ఎంత విపరీత పరిస్థితులలో ఉన్నా ఆ విశ్వాసము వీడరాదు. అట్టి పరిస్థితులు మన (అహంకార కృతములు) లోనివి. పవిత్రత, శుచి, ఆరోగ్యము ఈశ్వర మయములు. అవి తదనుగ్రహముననే మనకు లభింపవలెను.

వడిగా మీ ఆరోగ్యము చక్కబడుగాక యని నా ప్రార్థనము. నేనిపుడు పడుచున్న యిబ్బందులలో మీ యిబ్బంది లొక లెక్కకాదు. నావంతు నేను, మీ వంతు మీరు అనుభవించవలసిందే కదా! పరస్పర కష్ట సమీకరణ శక్తిని లోకమింకను గుర్తింపజాలకున్నది. అది ఉండీ, ఉండనట్లు పనిచేసీ, చేయనట్లు ఉన్నది.

### విజ్ఞప్తి :

తానెన్ని చీకాకులలో చిక్కుకొని యున్నా యితరుల చికాకులను అపనయింపవలెననీ, పరస్పర కష్టసమీకరణము అనే మహోదారాశయాన్ని సఫలీకరించ వలెననీ శ్రీశాస్త్రిగారి యత్నము. చరమదశవరకూ వారు దీనికే అంకితమయ్యారు.

ఈ పరస్పర కష్ట సమీకరణ సిద్ధాంతము మన యోగానికి విశిష్టమయినది. మానవులలో ఏ ఒకరు గాని తన కర్మను తాను ఆచరించి ఒడ్డుకు చేరుటకు సాధ్యముగాదు. అందరి కర్మలు పరస్పరము అనుబంధితము లైనందున ముందు పురోగమించిన వాడు, తన వెనుక వారిని తరింపజేయనిదే కృతకృత్యుడు కాలేడు. జ్ఞానసిద్ధి కూడా ఇలాంటి సమీకరణ సిద్ధాంతానికి లోబడవలసినదే. అందరి అనుభవాలు సమకూడి (Pool Together), వాటి ఫలితాలు అందరకు సమానముగా అందవలెననే మాస్టరు సి.వి.విగారి సిద్ధాంతము.



## లేఖ 11

సి.వి.వి. 20-2-40

...మీరు, కోర్టు వగైరా పనులు అవసరము, ఉచితముగా అగు విధమున లోక సామాన్య ధర్మముతో సాగించుకొనుడు, నేడు గంధీ గారు రాజాలక పోయినందుకు చింతింపవలదు.

వే॥ ప్ర॥

## లేఖ 12

28-7-40
ఆనందాశ్రమము
కరణాల వీధి, తిరుపతి

...సి.వి.వి., నావల్ల ఎవరికీ అపాయము జరగదు అనిరి. నేను దుర్వాస, విశ్వామిత్రాదులవంటివాడ గాననిరి. ఎట్టి యపమార్గమున నున్న వానినిగూడ సంస్కరించుటే గాని, దండించుట నా పని గాదనిరి. బాధలు వారివారి కర్మలవల్ల వచ్చినవిగాని దానికి కర్త సి.వి.వి. కానేరడు. ఇది నా నిశ్చయము.

వే॥ ప్ర॥

### విజ్ఞప్తి:

శ్రీ శాస్త్రిగారు మద్రాసు వదలి తిరుపతి చేరిన తరువాత ఇది మొదటి జాబు. మన దేశములో కొన్ని సంప్రదాయాలలో మంత్రజపా నుష్ఠానాది కర్మలలో అపశబ్దాలు, అనాచారాలు ప్రసరిస్తే నెత్తి అడుస్తుందని నమ్మకము వున్నది. సి.వి.వి గారి లైను ఇందుకు భిన్నము. అది కేవలము ప్రేమమయము. తల్లి బిడ్డలను దిద్దుకొన్నట్లుగా ప్రేమవల్లనే ఈ మార్గానుయాయుల లోటుపాట్లను దిద్దుకుంటుంది. శ్రీ శాస్త్రిగారు స్వభావ సిద్ధంగా యిలాంటి భావముకలవారే. కనుక యీ విషయము వారు పదే పదే చెపుతూ వుండేవారు.

(మీది లేఖాంశము కూడ సంకలనమున చేరినది కాని విజ్ఞప్తి లేదు - సం॥)

## లేఖ 16

సి.వి.వి. 20-2-44

....మీ జాబు చేరినది. ఇక్కడ అందరము క్షేమము. వీలు చూచుకొని మీరు రావచ్చును. ఇక్కడి ఇల్లు మునుపటికంటే చాలా సౌకర్యము కలది. పిల్లలందరు కులాసాగా ఉన్నారు.

శ్రీ ఉన్నవలక్ష్మీనారాయణగారికి నా నమస్కారములు తెలుపుడు. వారి క్షేమము వ్రాయండి. 'పశ్చాత్తాపేన శుద్ధ్యతి' పశ్చాత్తాపము అంటే మరల ప్రమాద పడనియ్యనిది.

వే॥ ప్ర॥

**విజ్ఞప్తి :**

మారిన యిల్లు శ్రీ కొచ్చి వేంకటశ్వరరావుగారిది. వారొక మాదిరి సంపన్నులు. ఆ యిల్లు క్రొత్తగా కట్టినది. అయినా ఏదో భూతావేశము వున్నదని ఆ యింటిని వదలి, ఎదురుగా నున్న పాతఇంటిలో వుండేవారు. ఇతరులెవరూ అందులో చేరలేకపోయేవారు. శ్రీ శాస్త్రిగారు సాహసించి, వుంటామనగా యజమాని చాలా సంతోషముతో వారి నందులో ప్రవేశపెట్టినారు. అప్పటినుండి శ్రీ శాస్త్రిగారు దేహము చాలించే వరకు ఆ ఇంట్లోనే వుండేవారు. అది చాలా విశాలమైన ఇల్లు కావడంచేత నా బోటి శిష్యులు పొరుగూళ్ల నుండి వచ్చి అందులో మకాం చేయడానికి అవకాశము లభించేది. అందువల్ల అమ్మగారికి వంటా, వార్పు పనులు ఎక్కువ అయ్యేవి. అయినా ఆచార్యులు, శిష్యులు కలసి వుండే పూర్వాశ్రమాలవలె అంతా కలసి యొక కుటుంబముగా వుండటానికి వీలయ్యేది. ఆ ఇంట్లో వున్నప్పుడే శ్రీశాస్త్రిగారి యోగప్రభ దేదీప్యమానముగా వెలిగింది. ఏవేవో మహనీయమైన పరిణామాలు నేడో, రేపో కలుగబోతున్నవనే ఉత్సాహము శ్రీశాస్త్రిగారిలో పొంగులువారేది. ఆ కాలములో వారి ప్రజ్ఞ కోరినవారికి ట్రీట్‌మెంట్ చేయుటలోనే కాక దేశస్వాతంత్ర్యసిద్ధికొఱకు, రాయలసీమకరువు నివారణకొరకు,



హిందూమహ్మదీయ అలజడుల శాంతి కొరకు ప్రయుక్తమయ్యేది. గాంధిగారు ప్రాయోపవేశాలలో జీవన్మరణ దశలలో చిక్కుపడి యున్నప్పుడు వారికి Plenty of Prana సప్లై చేయుటలో అది అంతర్భూతంగా పనిచేసేది. అసలా ఇంట్లోనే మాస్టర్ సి.వి.వి. మదర్ వెంకమ్మాళ్ గార్ల వివాహము జరిగిందని శ్రీ కొచ్చివారికి శ్రీ శాస్త్రిగారు చెప్పేవారు. శ్రీ శాస్త్రిగారి వల్ల ప్రవ్యక్తమవుతున్న శ్రీ సి.వి.వి. యోగప్రభకు గుర్తుగా శ్రీ కొచ్చివారు సి.వి.వి. అనే అక్షరములను మేడపైగోడమీద చెక్కించిరి. శ్రీ శాస్త్రిగారితోనే ఆ యింటి ప్రభకూడ అదృశ్యమైనది.

## లేఖ 17

3-12-44

...30 వ తేదీ మదరాసు రేడియో ప్రసంగమునకు వెళ్ళినాను. 2 వ తేది తిరిగి వచ్చినాను. అందరం క్షేమము. నాకు సంబంధించినవి గాని, యోగ మార్గమునకు సంబంధించినవిగాని విషయములు అడిగినా, వారికీ, వీరికీ తెలిపితే, వారు వీళ్లు మతి చెడియున్నారు సుమా! ఆ శాస్త్రులు వీళ్లమతి చెరచినాడు సుమా! అని అనుకోవడము సంభావ్యము. జాగ్రత్తగా వ్యవహరించండి.

శ్రీ లక్ష్మీనారాయణపంతులుగారు నాకు వ్రాయనక్కరలేదు. వారి పుణ్యాసాధ్వికి ఆరోగ్యము కలుగుగాక! సత్యము వెల్లడయ్యే దాకా నన్ను నన్నుగానే ఉండనివ్వండి.

చి॥ రామకోటయ్య జాబు వ్రాసినాడు. అందులో వింత విషయము ఉన్నది. సరిగా ఇక్కడ జరిగిన అసాధారణ విషయము అంతా అతనికి ఆనాడే అగపడినది. ఏమి ఇది! జరిగిన విషయము తెలుపండి అని వ్రాసినాడు....

చి॥ గురు, భాష్యం, సచ్చిదానందములు వాళ్ల డైరీలు అతనికి వ్రాసి పంపుతారు. వీటి తోటి ఏమిటి ఎన్నో ఎన్నో విశేషాలు వ్యక్త

## లేఖ 20

6-5-45

...మద్రాసులో మిత్రులను కలుసుకొన్నాము. ప్రపంచసముద్ర మథనమున హాలాహలము పొడమి పొర్లువారినది. ఇది అణగారి అమృతము పొడముట జరుగవలెను. ఏప్రియల్ 29 నుండి ఇట్టిది ఆరంభమయిన దని నా విశ్వాసము. మీరు వీలు చూసుకొని ఎపుడు వచ్చినా సంతోషమే.

చి॥ రామకోటయ్య పుత్ర వియోగ వ్యథలో మనసు చెదరి ఉండును. అతడు ఏమియేనిచేయుగాక, క్షేమముగా వర్ధిల్లునట్లు సి.వి.వి. అనుగ్రహించుగాకని వేడుచున్నాను. అతని అనారోగ్యము 100-80 పాళ్లు మానసికము. అది మనస్సు ప్రశాంత పడుటలో చక్కబడును. అందరము క్షేమము.

గుంటూరులో శ్రీ పింగళిలక్ష్మీ కాంతముగారి దగ్గర జోగయ్యశర్మ అని ఒక ఉద్యోగి ఉండును. అతనిని మీరు మద్రాసులో నున్నప్పుడు ఎరిగి ఉందురనుకొంటాను. వీలయితే వచ్చేముందు అతనిని కలసికొని యోగక్షేమములు విచారించి రండు.

వే॥ ప్ర॥

### విజ్ఞప్తి :

రెండవ ప్రపంచ యుద్ధాన్నే శాస్త్రిగారు ప్రపంచసముద్ర మథనమన్నారు. హిరోషిమా, నాగసాకి పట్టణాల పైన వేసిన ఆటంబాంబులే హాలాహలము. శ్రీ శాస్త్రిగారు 1914 యుద్ధము తనలోనే జరుగుచున్నదని, అందులో మృతులైన వారందరూ తనలోని భాగమేనని క్షోభ చెందేవారు. ఆ క్షోభను రెక్టిఫై చేసుకోగల సమర్థత అప్పటిలో వారికి లేకపోవడంవలన అది వారిలో తీవ్ర అనారోగ్యంగా పరిణమించినది. బుద్ధుడుకూడా జీవుల దుఃఖాన్ని గూర్చి ఇలాగే పరితపించేవాడని వింటాము. ఈ స్థితిలో శ్రీ శాస్త్రిగారు 'హరిద్వారము' పోయి గంగలో



ప్రాణత్యాగము చేయాలని నిశ్చయించుకొన్నారట. అపుడు తలవని తలంపుగా శ్రీ మాస్టరుగారి కరుణ వారిని ఆదుకొన్నది. ఇది అంతా ప్రజ్ఞా ప్రభాకరములో శ్రీ శాస్త్రిగారు సంగ్రహముగా చెప్పారు. 1939 సం॥ యుద్ధము నాటికి యీ అలజడిని తట్టుకోగల శక్తి సి.వి.వి. అనుగ్రహమువలన శ్రీ శాస్త్రిగారు పొందగలిగిరి. అందువలననే వారి ప్రజ్ఞ ప్రపంచ క్షేమమును గూర్చికూడా పనిచేసేదని ఇంతకు పూర్వము సూచించబడినది. (ఈ విషయాలు ఈ జాబుల చివర అనుబంధములో చూడవచ్చును)

రామకోటయ్య గారిని గూర్చి జోగయ్యశర్మ గారినిగూర్చి ప్రసక్తివలన శ్రీ శాస్త్రిగారు మరపు తెరపులు లేక శిష్యుల యోగక్షేమములను నిరంతరం ఎలా తెలుసుకుంటూ వుండేవారో తెలుస్తుంది. (శ్రీ జోగయ్యశర్మ గారియెడల శ్రీ శాస్త్రిగారికి ఎంతో ప్రేమ, అలానే శ్రీ శాస్త్రిగారి యెడల శ్రీ శర్మగారికి ఎంతో, భక్తి, శ్రీ శాస్త్రి గారు శరీరము విడిచిన తరువాత 20 సం॥లు గడచినా కూడా అలాగే వుంది. నేను 1970 సం॥లో ఆయనను కలుసుకొన్నప్పుడు వారు ఆంధ్రా యూనివర్సిటీలో పని చేస్తున్నారు. వారు ఆఫీసు పనిలో వుండగా వారిని నేను ఆఫీసులో కలుసుకున్నాను. శ్రీ శాస్త్రిగారి ప్రస్తావన రాగానే శర్మగారెంతో భక్తితో లేచి నిలుచున్నారు. నమస్కరించి, కన్నులు మూసుకొని తన్మయులై కొంతకాలము ఉండిపోయిరి. తరువాత ఆఫీసుపని కట్టి వైచి శ్రీశాస్త్రిగారిని గురించిన గోష్ఠిలో ప్రవేశించిరి. శర్మగారి దృష్టిలో శ్రీ శాస్త్రిగారికి ప్రేమ పాత్రులైన వారిలో తాను మొట్టమొదటి వాడినని, తనయందు శ్రీ శాస్త్రిగారికి ఉన్న ప్రేమ ఇంకెవరియందూ లేదని ఉప్పొంగిపోతూ చెప్పారు. ఇలా చెప్పడము శ్రీ శాస్త్రిగారి శిష్యులందరకూ పరిపాటే. ప్రతివారు తమయందే శ్రీ శాస్త్రిగారికి అత్యధికమైన ప్రేమ వున్నది అని ఉప్పొంగి పోయేవారు. ఇది శ్రీ శాస్త్రిగారి ప్రేమ యొక్క విస్తారము.)

బ్రాకెట్లలోని ఈ అంశములను యోగమిత్రులు అనంతర కాలంలో చేర్చి ఉంటారు. సం॥.

గలదా? ఈశ్వరుడు కలడా? అన్న సంశయము తీరవలసిన ఆవశ్యకత ఏర్పడినది. ఇక నిరీశ్వర వాదము పండిపోగలదు. పశు బలము తాండవింపగలదు. అహింసా సత్యములు నెలకొనవలసియుంటే, ప్రపంచము అంతా ఒక కుటుంబముగా సాగవలెనంటే, ఇక అల్ప కాలములో ఈశ్వరానుగ్రహము వ్యక్తము కావలెను. ఏమి కానున్నదో చూతము గాక!

వే॥ ప్ర॥

## విజ్ఞప్తి :

1916 సం॥లో తన ఆరోగ్య లాభానికి ఈశ్వరానుగ్రహాన్ని ఆశ్రయించిన శాస్త్రిగారి అంతనిష్ఠ 1924 సం॥ నాటికి ఎంతో పెరిగిపోయింది. అనారోగ్యంతో తన వద్దకు వచ్చేవారి నందరినీ వారు తన కుటుంబములో వారనే భావించి, తనను రక్షించిన ఈశ్వరానుగ్రహాన్నే వారి రక్షణకు సాధనంగా చేసుకున్నారు. ఇది అపాయమనే మిత్రుల హెచ్చరికలను పాటించలేదు. 1945 సం॥ నాటికి వారి అంతనిష్ఠ ఆకాశాన్నంటింది. ఈశ్వరానుగ్రహం వల్లనే భారతదేశం ఆధ్యాత్మిక మహత్వంకలదని నిరూపితం కావాలి. సత్యాహింసలు ఫలించి, దేశం స్వతంత్రము కావాలి. ప్రపంచదేశాలు పరస్పర పీడనము మాని ఒకే కుటుంబంగా వర్ధిల్లాలి. మినుకు మినుకు మని లోలోపల కనిపించే దీపం జగజ్జ్యోతిగా ప్రజ్వలించాలి. చుట్టూ ఉన్న అంధ తమసం అంతరించాలి. ప్రపంచము భగవంతుణ్ణి గుర్తించాలి. ఇవి వారి ఆశయాలలో కొన్ని. ఈ తీవ్ర సంకల్ప నిర్వహణకు కావలసిన శక్తి వారి శరీరాన్ని ఎలా అల్లకల్లోలితముగా చేసినదో తరువాత జాబులలో చూస్తాము. ఈ ఆశయాల్లో ఏవి ఫలించినవని మనం 1980లో వెనక్కు తిరిగి చూస్తే భారతదేశం స్వతంత్రమైంది. సత్యాహింసల ప్రతిష్ఠ పెరిగింది. ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. అయితే ఈశ్వరుడింకా తెరవెనకే ఉన్నాడు. ప్రధాన లక్ష్యం ఫలించలేదు.



## లేఖ 24

25-8-45

...నీవు పంపిన వంకాయలు, దోసకాయలు సంచులు సరిగా చేరినవి, దోసకాయలు, ముగ్గిపోవునని, నిలువ వుండవని మిత్రులకు ఇచ్చుచున్నాము. తియ్యని జాతి వంకాయ కూర ప్రియమార నారగించినాను. చి॥ రామకోటయ్య ఆరోగ్యమును గూర్చి నీవేమి తలచుచుంటివో! అతడు ఇంటికేసి దూకులాడుచున్నాడు. తన్మిత్రుడు చి॥ రవి అను నాయన కూడా సకుంటుంబంగా వచ్చుటచే చుట్టుపట్టుల ఊళ్లు, పొలాలు, దేవళాలు యాత్రించుచున్నారు. ఈ ఉత్తరము వ్రాయుచుండగా చి॥ రామకోటయ్య పగలబడి నవ్వుతున్నాడు. దీని సారము అతడు మంచి ఆరోగ్యముతో సుఖముగా నున్నాడని తెలుపుటే! మేమందరము క్షేమము. నాకేమో భారత వర్షము, తద్వారా ప్రపంచము శాశ్వతానందము పొందే రోజులు దాపురించుచున్నవన్న పరితోషము హెచ్చగుచునే యున్నది. ఎడనెడ నిరుత్సాహము లేకపోలేదు. నిత్య నిర్వికల్ప ప్రమోదము ఏ మాత్రము కలిగినా తెలుపుతాను. మాయావరణ లేని నిత్యసత్యానుభూతి ఇంకా కలుగలేదు.

వే॥ ప్ర॥

## విజ్ఞప్తి :

శ్రీ శాస్త్రిగారికి గల యోగాభిరుచికి దీటైనది - వారి శాక పాకాదుల మేలి రుచి. వారి బాల్యము పాడిపంటలతో ఫలశాకాలతో తులతూగే కృష్ణాతీరాన పెదకళ్లేపల్లిలో గడిచింది. పట్టణ పరిసరాల్లో కృత్రిమ దోహదాల ద్వారా తయారైన కూరనారలకంటె వారికి కృష్ణవేణీ సారజలముతో పండిన కూరగాయలపైన ప్రీతి విశేషము. దీనినే వారు కొత్తగా చెన్నపట్టణము చేరిన రోజులలో వ్రాసిన "కడుపు తీపు" అనే లఘుకృతిలో స్మరించిరి. ఆ కథలో ఒక తమిళ గృహస్థుడు, ఆయన ఇల్లాలు లేతవయసు నుండి కృష్ణాతీరములోని 'శ్రీకాకుళము' లో చాలాకాలము ఉద్యోగరీత్యా వుండి మద్రాసుకు బదిలీ యగుదురు. ఆ

చక్కెర యక్కర లేనివి
చిక్కని పాల్ గడ్డ పెరుగు జిడ్డగు నేయున్
మిక్కిలి చవిగల కూరలు
చిక్కున్ గృష్ణా స్రవంతి చెంతల యూళ్లన్

(47 వ పద్యము)

## లేఖ 25

6-10-45

...చి॥ రామకోటయ్య నీరాకకై ప్రతీక్షిస్తూ యింకా రాలేదని, మిత్రుడు చి॥ జగపతిరావుతో మదరాసు "చెక్కర్" కొట్టి వారం రోజులు, నిన్ననే తిరిగి వచ్చినాడు. చి॥ రామకోటయ్య నీవు తోడ్కొని వచ్చిన నాటి రామకోటయ్యగాడు. ఇంటికి దూకవలె నంటున్నాడు. అంతః పురములోనూ అట్లే ఉన్నది. మిత్రుల జంజాటముతో ఎటూ తేలక అతనికి ఉయ్యాలవలె మనస్సూగాడుతోంది. నేనంటున్నాను, "ఆనాడు నిన్ను చి॥ వేంకటేశ్వరావు తోడ్కొని వచ్చెను గదా! మరల తోడ్కొని పోవుటకీనాడు రాని"మ్మని, నీవు 2 వ తేదీ వస్తానని రాలేదు. వస్తావుగదా! అని బదులు వ్రాయలేదు. "విజయదశమి" అనివార్యముగా బయలుదేరి తీరును. ఈ లోగా నీవు వస్తివా నీకు మాట దక్కుతుంది. ఇక్కడ చి॥ వేంకటరాజు గారని గుండగొలను నుండి మిత్రులొకరు తోడివేదముగా రామ కోటయ్యతో ఉన్నారు. ఇద్దరూ కలిసి వెళ్లవలెను. కాలేజీ విద్యార్థులు పలువురు గోష్ఠి విడువకున్నారు.

వే॥ ప్ర॥

**విజ్ఞప్తి :**

ఈ 24, 25 జాబులలో శ్రీ రామకోటయ్యగారి ఆరోగ్యాభివృద్ధికి శ్రీ శాస్త్రిగారు ఎంత పరితోషితులైరో తెలుస్తుంది. భారతదేశము, ప్రపంచము శాశ్వతానందము పొందుననే సంతోషములో అదొక భాగము. పరితోషముతో సరిపుచ్చుకొనక ప్రత్యక్షానుభూతికొరకు వారు ఎదురు చూపైయుండెడివారు.



## లేఖ 26

30-10-45

...మీ ప్రయాణము - సంక్షోభము - దేశవిప్లవము ముందు నా శరీరముననే జరిగినది గదా! మీరక్కడ చాలా కష్ట నష్టములకు పాల్పడి యుందురు. ఇక్కడ నాకై నీవు చాలా శ్రమ పడితివి. సి.వి.వి. దివ్యాను గ్రహము మిమ్ము సంరక్షించుగాక, నేనిప్పుడు చాలా సర్దుకొనుచున్నాను. అప్పుడప్పుడు తంటాగానూ ఉంటూ ఉన్నది. నిబ్బరించు కొంటున్నాను. చి॥ రామకోటయ్య క్షేమముగా నున్నాడని విశ్వసించుచున్నాను.

వే॥ ప్ర॥

**విజ్ఞప్తి :**

23 వ జాబులో శ్రీ శాస్త్రిగారు వెల్లడించిన తీవ్ర సంకల్ప నిర్వహణానికి అవసరమైన శక్తి వారిలోకి ప్రవేశించిన ఫలితంగా వారి శరీరము అల్లకల్లోలితమైనదని ఈ జాబు స్పష్టపరుస్తుంది. 1945 సం॥ నాటికి శ్రీ శాస్త్రిగారి అంతః ప్రజ్ఞ (యోగ చైతన్యము) విస్తరించి యావద్భారతదేశ సంక్షోభాన్ని సరిదిద్దే మహనీయ ఆధ్యాత్మిక శక్తిగా పనిచేయడం ఆరంభించింది. దేశంలో అలజడులు, ముందు వారి శరీరములో ప్రతిఫలించేవి. వాటిని నిబ్బరించుకోవడములో వారికి తిరిగి స్వస్థత కలిగేది. సమిష్టి జీవనానికి వారి వ్యష్టి జీవనము ఒక సూచిక అయింది. పరస్పర కష్ట సమీకరణ అనే సి.వి.వి. యోగ సిద్ధాంతం వారిలో ప్రవ్యక్తం కానారంభించింది.

ప్రయాణ సందర్భంలో నాకొక వింత అనుభవం కలిగింది. ఆ రోజు విజయదశమి (18-10-45) మధ్యాహ్నమయింది. రామకోటయ్యగారు, ఆయన కుటుంబము స్టేషనుకు వెళ్ళారు (తిరుపతి). నేను ఇంకా శాస్త్రిగారి వద్దనే వున్నాను. ఎందుకో ముందుకు సాగలేకపోతున్నాను. శ్రీ శాస్త్రిగారితో నా పరిస్థితిని వివరించాను. "నువ్వు ఇంతదూరం వారిని తోడ్కొని పోవడానికి వచ్చి ఆగిపోతే బాగుండదు. ప్రార్థన చేసుకొనుము" అన్నారు. ప్రార్థన చేసుకున్నాను. ప్రార్థనలో నాలో లోపల ఏదో సంక్షోభం జరిగింది. మరీ మెడ భాగములో తీవ్రమైన ఒత్తిడి

## విజ్ఞప్తి:

శిష్యుల యోగక్షేమములను గురించిన అనవరత ఆకాంక్ష, అల్పసహాయమునకే అమితకృతజ్ఞత శ్రీశాస్త్రిగారి ఉదారస్వభావాన్ని తెలుపుతున్నాయి.

## లేఖ-28

16-11-1945

చిరంజీవ! చిరంజీవ! సుఖీభవ! సుఖీభవ!

మీ జాబులు చేరినవి. చి॥ రామకోటయ్య చీటీ కూడా చేరినది. మీ ఆరోగ్యమునకు సంతోషము. మీ కుమార్తె వడిగా సంపూర్ణారోగ్యము బడయుగాక శ్రీ అప్పారావు గారు ఇక్కడేవున్నారు. ఇంట్లో అందరము క్షేమము. ఆరోగ్యము గురించి జాబు వ్రాయుటలో నీ కున్న శ్రద్ధను, నీ అనుచరమిత్రుడైన చి॥ రామ కోటయ్యకు కూడా కలుగుగాక! యని కోరుచున్నాను. కవిత్వపు జాబులు మిత్రులకు సావకాశముగా వ్రాసినా నాకు మాత్రము సూటిగా, ఆరోగ్య మాత్రపు వార్తతో తరచు కార్డు మాత్రము వ్రాస్తూంటే సంతోషిస్తాను ఈ మధ్య అతని జాబు రాక ఎట్లా ఉన్నదో అని చాలా చికాకు పడ్డాను.

వే॥ ప్ర॥

## విజ్ఞప్తి:

శ్రీ శాస్త్రిగారు జాబు లన్నీ "చిరంజీవ, సుఖీభవ" అనే ఆశీస్సుతోనే ఆరంభమవుతాయి. ఈ జాబులో ఆ ఆశీస్సు ద్విరుక్తము కావడానికి కారణము శ్రీరామకోటయ్య ఆరోగ్యాన్ని గూర్చిన చీకాకు తొలగడము వల్ల, మేమంతా బాగున్నామని, వార్త చేరడంవల్ల వారికి ద్విగుణముగా కలిగిన సంతృప్తియే శ్రీ శాస్త్రిగారు తన ఆరోగ్యము ఎలావున్నా, తమ శిష్యుల క్షేమానికై తమశక్తి ధారపోయడము, వాళ్ల క్షేమవార్తల కోసము ఆతురతతో వేచి యుండడము, ఈ జాబులో చక్కగా తెలుస్తూంది. శ్రీ అప్పారావుగారంటే ఆంధ్ర విశ్వవిద్యాలయ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరయిన ప్రొఫెసర్ విస్సా అప్పారావుగారు. వీరి పెద్దకుమారునికి



శ్రీశాస్త్రిగారి పెద్ద కుమార్తె నిచ్చిరి. వీరు భౌతిక గణిత శాస్త్రాలలోనే కాక జ్యోతిష, సంగీతాలలో కూడా ప్రవీణులు. పరమాణుశక్తి మొదలైన శాస్త్ర విషయాలను తెలుగులో వ్రాశారు. శ్రీత్యాగరాజ కీర్తనలను సవ్యాఖ్యానంగా ప్రచురించారు. గొప్ప ఉపన్యాసకులు. చతుర సంభాషణా ప్రియులు. నిశిత పరిశీలనా బుద్ధి కలవారు. అన్నింటికి మించి ఉదార స్వభావులు. గుప్తదాత. శ్రీ శాస్త్రిగారి యోగమార్గములో సవిమర్శంగా నడిచినవారు.

## లేఖ 29

7-2-1946

...ఎన్నో చీకాకులు మనలో నుండి వెడలిపోవలసి ఉన్నవి. వానిని గుర్తిస్తూ జాగ్రత్తగా అడుగు వేసుకుంటూ నడవవలసి ఉన్నది. నేను సుస్తీగా ఉండగా రాత్రులకు రాత్రులు నాతో బాధపడిన నిన్ను నేను ఎన్నడూ అన్యథాగా భావించను.

నేను ఇనిసియేషన్ చేయడమనేది **C.V.V.** పునరవతారము (వారి స్వరూప దర్శనము) నాకు కలిగినప్పుడే. కలిగితేనే అనగా మృత్యురాహిత్యపు తలపు ఫలించుట. చి॥ రామకోటయ్య అనేక విషయములు చెప్పగలడు.

వే॥ ప్ర॥

## విజ్ఞప్తి:

ఈ జాబులో మొదటి, రెండు విషయాలు పూర్వం జాబులలోని వాటిని ధ్రువపరుస్తున్నవి. మూడో విషయం క్రొత్తది. 'ఎన్నో చీకాకులు మనలో నుండి వెళ్లిపోవాలని, వాటిని గుర్తిస్తూ మనము జాగ్రత్తగా ముందడుగు వేయాలనీ, నేను శ్రీ శాస్త్రిగారి బాధలో సహాయకారిగా వున్నా'నని అనే భావాలు పూర్వం జాబులలో కూడా వున్నాయి.

ఇక ఈ జాబులోని కొత్త విషయం శ్రీ **C.V.V.** పునరవతరణను గూర్చినది. శ్రీ **C.V.V.** యోగ సంకల్పాలలో మృత్యురాహిత్యం కీలకమైనదని యోగమిత్రులందరికీ తెలిసినదే. అయితే ఈ సంకల్ప

**విజ్ఞప్తి:**

1. ఈ జాబులో శ్రీశాస్త్రిగారు మనుమని ఆరోగ్యాభివృద్ధి నుంచి దేశ వ్యవహారాల వరకు దైవానుగ్రహం మీదనే ఆధారపడి యుండ డము తెలుస్తుంది.
2. మాస్టరుగారి యోగం 1910 సం॥లో హేలీస్ తోకచుక్క వచ్చి నపుడు ఆరంభమైన విషయము సువిదితము. అలాంటిదే మళ్లీ కనపడుతుందనీ దానితో యోగపద్ధతిలో ప్రగతి సంభవిస్తుందనీ ఆ రోజులలో మాస్టరుగారి శిష్యులు ఆశించేవారు. ( ఈ హేలీ కామెట్ 1985 నవంబరులో కనిపిస్తుందని, దాని స్వరూప స్వభావాలను, అధునాతన పద్ధతులద్వారా గమనించవచ్చని, దానివలన అనేక విశ్వరహస్యాలు వెల్లడి అవుతాయని శాస్త్రజ్ఞులు మొన్న మొన్న ప్రకటించారు)★
3. తన అనుయాయులు వారి వారి బంధువర్గముతో ప్రేమ స్నేహ సౌహార్దాలు పెంచుకోవడము కూడ వారి యోగ ప్రగతికి ఒక ఉపలక్షణమని శ్రీ శాస్త్రిగారి భావన.
4. ఆహార విషయంలో తాను క్లేశకరమైన ప్రయోగము నవలంబించినా ఆ క్లేశము తన శిష్యులకు తగలనీయరాదనే వారి ఆర్ద్రత గమనీయం.

★(బ్రాకెట్లలోని విషయం అనంతరకాలంలో యోగమిత్రులు చేర్చినట్లున్నారు.)

## లేఖ 32

5-7-46

...మీరు పూర్వము వ్రాసిన జాబుకు బదులు రైల్వే స్ట్రైకు, దారిద్ర్య బాధ, యోగఫలితము, రాజకీయఫలితము మూడింటి అనుకూలానుభూతులను చూచి వ్రాయుదును గాక అని ఆగినాను. అనేకులకు వ్రాయకుండా ఆగినాను. ఈ నాటికి రైల్వే స్ట్రైకు తృప్తికరముగాను, దారిద్ర్యము అరకొరగాను ఫలించినట్టులే ఉన్నది. విధిలేక యిప్పుడీ



జాబు వ్రాస్తున్నాను. నా నిజమైన తలపు ఆగస్టు దాకా ఏజాబు వ్రాయకుండుటే. ముఖ్యముగా ఈ జాబు ఎందుకు వ్రాస్తున్నానంటే మిత్రులు శ్రీ లక్ష్మీనారాయణ గారి ఆరోగ్యముగూర్చి. వారు ఇక్కడికి వెంటనే రాగోరుచున్నాను. రైలు ఎక్కారంటేనే కడుపులో బాధ ఉండదు. ఇక్కడికి వచ్చిన తరువాత అసలే ఉండదు. చి॥ రామకోటయ్యా వస్తానన్నాడు. అతడు వచ్చునుగాక! మీ రాకకై ప్రతీక్షించుచున్నాను. శ్రీ లక్ష్మీనారాయణ పంతులు గారికి విషయము తెలిపి తోడ్కొని రండు. వారారోగ్యవంతులగుదురు గాక!

వే॥ ప్ర॥

**విజ్ఞప్తి:**

శ్రీ శాస్త్రిగారి ప్రజ్ఞ ఆ రోజుల్లో దేశ సమస్యల పరిష్కారానికి వ్యాప్తమైనదని ఇదివరకే మనవి చేశాను. అదే విషయము ఈ జాబు స్పష్టంగా తెలుపుతుంది. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి ఆరోగ్య అభివృద్ధినిగూర్చి శ్రీ శాస్త్రిగారి తహ తహ ఈ జాబులో తెలుస్తుంది. ఇంకా కొన్ని జాబుల్లోనూ ఇది ప్రతిబింబిస్తుంది.

## లేఖ 33

8-9-46

...ఇక్కడ అందరమూ క్షేమము. నాకు విశ్రాంతి లేకుండ గజిబిజి కలుగుచునే ఉన్నది. ఎంత గజిబిజి ఉన్నా అందరూ క్షేమంగా ఉంటే నా గజిబిజి అంతా మంచికే సమన్వితము కాగలదుగదా!

వే॥ ప్ర॥

**విజ్ఞప్తి**:

1. తనలో గజిబిజి తన ఆశ్రితుల చికాకులను తొలగించే అప్రయత్న సంఘటనలని శ్రీ శాస్త్రిగారి గుర్తింపు.
2. ఇదే వారు చెప్పే పరస్పర కష్ట సమీకరణ సిద్ధాంతము.

## విజ్ఞప్తి:

శ్రీ మాస్టరుగారు శ్రీ శాస్త్రిగారితో తన యోగం నివృత్తి, మార్గం కాదని, ప్రవృత్తి మార్గమని, బండి సాగుతూ ఉండగనే బండివాని జీవికకు, భంగం కలుగకుండా సాగించే రిపేరు వర్క్ (Repair work) వంటిదని చెప్పడం ప్రజ్ఞాప్రభాకరంలో శ్రీ శాస్త్రిగారు వ్రాశారు. ఆ ఒరవడినే వారు తమ శిష్యులకు చెప్పేవారు.

## లేఖ 36

(శ్రీ సింగరాజు సచ్చిదానందమూర్తి గారు వ్రాసిన జాబు)

21-2-47.

మీ జాబులో మీరు శ్రీ గురుదేవులతో కలసి పోవుచున్నట్లుగా కలగంటినని వ్రాసినారు. ఇప్పుడు జరుగుచున్న యాక్షను అదే! శ్రీ గురుదేవులు సాయుజ్యమని చెప్పుచుండు పదములకు సరియైన అర్థము కార్యరూపమున లోకమంతయూ చూడబోవునదియు, అదే అంటున్నారు. ఇక్కడ మాలోను ఈ విధముగా యాక్షనులు జరుగుచున్నవి. ఇటీవల శ్రీవారి జన్మదినోత్సవము వచ్చినది.

ఆ దినమున శ్రీ గురుదేవులు దివ్యమగు ఉపన్యాసమును ధ్యానమునకు తరువాత నొసగినారు.

ఆ ఉపన్యాస ప్రతిని మీకు పంపుతాను. నాడే శ్రీవారు రెండు పద్యములను మాకు వినిపించినారు. ఆ పద్యములను మీకు శ్రీ కోటయ్యగారికి పంపుమన్నారు. శ్రీగురుదేవుల స్వహస్తలిఖితములగు ఆ పద్యములు చదివి, అందలి విశేషములు గుర్తించండి.

(1) నన్నున్ వర్ణన సేయగా వలవదన్నా కన్నయందాక, మీ
దన్నీ వర్ణన మెందు, కిందులకుఁ గొందాకం బ్రతీక్షింపుమం
చున్న న్గూర్చిన యుష్మదాజ్ఞకు, నెదుర్చూపై గృహద్వారమం
దున్నాఁడం, గనరాగదే! కనుట కర్షున్ నన్ను! జేయంగదే!



(2) వచ్చెను నేటికర్వదగు వర్షము పుట్టువుఁ దొట్టి, గర్భముం
జొచ్చుటఁ దొట్టి నాకరయఁ జూచిననేఁటికె షష్టిపూర్తి యీ
వచ్చిన యేడునిండిన ధ్రువంబుగఁ గాఁ గల షష్టిపూర్తితో
నిచ్చట నాకుఁగావలయు నిష్టికి పూర్తియు, సృష్టిపూర్తియున్॥

## లేఖ 37

(ఇది శ్రీ శాస్త్రిగారు శ్రీ సత్యానారాయణశెట్టి గారికి వ్రాసిన జాబునకు కాపీ, దీన్ని శ్రీనివాసాచార్యులుగారు పంపారు. ఇది శ్రీ శ్రీనివాసాచార్యులుగారి దస్తూరీలో ఉన్నది)

24-2-47

...పెద్ద విప్లవము - శ్రీతాతిగారి భార్యగారి మరణమును గూర్చి తలుచుకుంటూ - కంపించిపోతూ తాతి గారికి జాబు వ్రాయడానికే చేయాడక మనసుకుదుటపడక క్షోభిస్తూ ఉన్న నాకు - ఎన్.ఆర్.బి.వి. గారి మృతివార్త పేపరులో నిన్న సాయంకాలము చూశాను - ఎట్టిస్థితి కల్గిస్తుందో వ్రాయనక్కరలేదు. కాని అది చదివిన గంటన్నరకే జరిగిన ప్రాక్టీసు 6.30కు చాలా శక్తిమంతుడనైనాను. నిబ్బరము చెందినాను. ఆనాటి సి.వి.వి మృతి వార్త కంటె ఇవి ఎక్కువ కావుకదా!.... ప్రపంచమంతా తల్లక్రిందులైనా సరే, ప్రాక్టీసులో యాక్షను జరుగుతూ దానివల్ల ఇతరులకు ఉపకారము జరుగుతూ నాకు సచ్చిదానందము లభిస్తూ ఉండడమును బట్టి నా ముక్కులో ఊపిరి ఆడుతూ ఉండేదాకా నేను ఈ మార్గమును విడచువాడనుగాను.ఈ విషయము మార్గశిర శుద్ధమునకు నేను మదరాసు వచ్చినపుడు, మీ మేడ మీద రామానుజమున్నూ ఎన్.ఆర్.బి.వి. కుమారుడు వచ్చి యుండగా స్పష్టముగా వెల్లడించినాను. ఒక వేళ ఎన్.ఆర్.బి.వి. శరీరము విడిచినా నేనీ (నా యీ) నిశ్చయమునకు కారణము నాలోని సి.వి.వి. యాక్షనుగానే ఉంచుకున్నాను. కనుక చలింపను అని స్పష్టముగా చెప్పితిని. ఆ నిశ్చయముననే నేను నిలిచి తీరుదునుగాక...

నేను వేరు, తార్తి వేరు అనుకోవడం లేదు. ఏమిచేసేది? ప్రపంచ మంతా డిజార్డరుగానే ఉన్నది. ఇకనైనా చక్కబడగలదుగాక అని ఆశిస్తు

**విజ్ఞప్తి:**

ఈ జాబు (కవరింగ్ లెటరు) శ్రీ సచ్చిదానందంగారు వ్రాశారు. సి.వి.వి.పి. అనే అక్షర శీర్షికతో లేఖను ఆరంభించారు. ఈ అక్షరాలను వాడడం ఇదే మొదలు. దీన్ని గూర్చి శ్రీ శాస్త్రిగారి సలహా దిగువ ఉత్తరంలో చూడదగును. ప్రస్తుత లేఖలో శ్రీ శాస్త్రిగారి ఈక్వినాక్సు ఉపన్యాస సారాంశము ఉంది. దీన్ని అనుబంధంలో చూడదగును.

## లేఖ 40

సి.వి.వి. 14-11-47

... మీ టిల్లిగ్రామ్, జాబులు చేరినవి. మీ టిల్లిగ్రామ్ వచ్చిన నాటి తెల్లవారుజామున, తెల్లవారిన దనవచ్చును. చి॥సౌ॥ నీ భార్య, నా దగ్గర గుండెనొప్పికి తాకి (ట్రీట్‌మెంటు) చేస్తే, తగ్గుతుంది అన్నభావము వెల్లడించగా నా తలకాయ ఆమె గుండె మీద ఉంచి హార్టబీట్ గుర్తిస్తూ ట్రీట్ చేసినట్లు, నొప్పి తగ్గిపోయినట్లు గప్పున అయినది. అక్కడ కూడబాగా నెమ్మదితోచి ఉండవచ్చును.

ఈ సందర్భములలో గుర్తించవలసిన విశేషార్థములు ఎన్నో ఉన్నవి. సి.వి.వి. అస్మదీయులుగా వెలయవలసియున్నారు. నేను సందర్భము సరిచూచుకొని జాబులు వ్రాస్తూ ఉంటాను. వెంటనే వ్రాయ లేదనుకోవద్దు. ముందు సి.వి.వి. వ్యక్తము కావలెను. 'మాస్టరు సి.వి.వి. నమస్కారము' అని మాత్రమే మీరు నమస్కరింపవలసినది. వారికి నమస్కరించిన తర్వాత ప్రత్యేకముగ నమస్కరించిన నమస్కరించుటో, ప్రేమతో స్మరించుటో చేయవచ్చును అని తోచుచున్నది. మీ జాబులలో M.c.v.v. నమస్కారములు' అని వ్రాయుచుండుట మంచిది.

వే॥ ప్ర॥

**విజ్ఞప్తి:**

13వ తేదీ రాత్రి నా భార్యకు తీవ్రమైన గుండెనొప్పి వచ్చినది. ఎన్నిసార్లు ప్రార్థన చేసినా ఇంకా హెచ్చుతూనే వున్నది. ఆమె తల్లిదండ్రులు,



మా తల్లిగారు వైద్య సహాయము కొరకు తహతహలాడుతున్నారు. చిట్ట చివరగా మార్గాంతరము లేక, వైద్యుణ్ణి పిలిపించాలనే నిశ్చయించుకొన్నాను. రోగికూడ అనుమతించింది. వైద్యుని కోసం పంపేముందు ఆఖరి ప్రయత్నంగా నేను ఒక టెలిగ్రాం వ్రాసి శాస్త్రిగార్కి పంపాను. వెంటనే నా కడుపు ఉబ్బరంగా వున్నట్లు తోచి లెట్రిన్‌కు వెళ్లవలసివచ్చింది. నేను తిరిగి వచ్చి చూచుసరికి రోగి హాయిగా నిద్రపోతున్నది. వైద్యుణ్ణి పిలి పించటం మానివేశాను. ఆమె సుఖంగా వున్నది. తిరిగి ఎప్పుడు ఆ నొప్పి రాలేదు. శ్రీ శాస్త్రిగారి జాబును బట్టి చూడగా నా టెలిగ్రాము వారికి చేరకముందే, వారు నిద్ర మేల్కొనీ మేల్కొనని స్థితిలోనే నా ఆర్తి వారి అంతః ప్రజ్ఞలో స్ఫురించి, దానికి తగిన ట్రీట్‌మెంటు కూడా అప్రయత్నం గానే జరిగినట్లు - బాధానివారణ కూడా అలాగే జరిగినట్లు తోస్తున్నది. నిజానికి ఈ యాక్షను నేను టెలిగ్రాము పంపిన అర్ధరాత్రి సమయములోనే శ్రీ శాస్త్రిగారి అంతః ప్రజ్ఞలో జరిగి యుండవచ్చును. అది వారి బాహ్య ప్రజ్ఞలో స్ఫురించినది నిద్రమేల్కొనీ మేల్కొనని స్థితిలో అయి ఉండవచ్చును. దీనిని బట్టి శ్రీ మాస్టరుగారి ప్రజ్ఞ మన అంతరాంతరములలో నెల కొని మననిర్వాహకత్వముతో పని లేకనే స్వయముగా ఆటోమాటిక్‌గా మన ఆర్తికి ప్రతిస్పందించి, మనకు బాధానివారణ కలిగించుటకు సమర్థమై యున్నదని నేను గ్రహిస్తున్నాను.

శ్రీ శాస్త్రిగారు ఆ రోజులలో కొన్ని కొన్ని సందర్భాలలో రోగి శరీరాన్ని తాకి ట్రీట్ చేయడం ప్రారంభించారు. ఇది మాస్టరుగారి యోగము స్థూల భూమికలోనికి (Physical Level) దిగటాన్ని సూచిస్తుందనే ఒక భావము ఉండేది. కొన్ని ఒడిదుడుకులు దీని వలన కలుగవచ్చునని మరి యొక భావము ఉండేది. అందువల్ల ఈ పద్ధతిని వారెంతో మితముగాను, మిక్కిలి మెలకువతోను, తప్పని పరిస్థితులలోను అవలంబించేవారు. అలా అవలంబించకుండా మిన్నకుండుట వారికి సాధ్యముకాదు. వారిలోని ప్రేరణ అల్లాంటిది. ఒకటి మాత్రము సత్యము. వారు చేతితో స్పృశించగానే ఒకవిధమైన చల్లని హాయి కలిగి బాధ వెంటనే తొలిగేది.

**విజ్ఞప్తి:**

ప్రజ్ఞా ప్రభాకరము అనే పేరుతో శ్రీ శాస్త్రిగారు ఫిజికల్ విడిచిన పిమ్మట, వ్రాసినంతవరకే ప్రచురింపబడిన గ్రంథమునకు ఈ జాబు పూర్వ రంగమవుతుంది. ఈ జాబు తరువాత వారు 22 మాసములు మాత్రమే ఫిజికల్‌లో వుండిరి. ఆ కాలమంతా వారు అనేక పనుల ఒత్తిడిలో గడప వలసివచ్చింది. ఆ వివరములు తరువాత జాబులలో తెలుస్తవి. పని ఒత్తిడివల్ల వారీ గ్రంథమును పూర్తి చేయలేదు.

## లేఖ 43

సి.వి.వి. 10-11-48

.... మీ జాబులు చేరినవి. అల్పకారణములతో అల్లకల్లోల పడవద్దు. మహత్తరవిప్లవములతో ఆపదలతో క్షోభిస్తున్న వారి స్థితి గతులలోనికి దిగుదుము గాక, వాని సహానుభూతి మనకు ఉచ్ఛ్వాసము కలిగించగలదు.

తక్కిన సందర్భములన్నీ సమక్షమున తెలుపదగినవి. పూర్వోత్తర సందర్భములతో అనన్వితముగా నుండని తీరుతో, నేను నాకార్యరీతి ఉండి తీరవలెను. తప్పిపోతున్నానుకోవద్దు.

మీ అందరి క్షేమము తెలుపగోరినానను. నేను మీకు ట్రీట్ చేయడం కాదు.మీకు మీరే చక్కదిద్దుకోవలెను.ట్రీట్మెంటు నిర్వాహము చెందకపోతే అది మూలతత్త్వము తప్పిదముకాదు. మనమందరము అదే అనుకొనేటప్పుడు తప్పిదము దానిదే అనవచ్చును. ఆ స్థితిలో మన ఉనికి కలిగితే కొరత ఉండదేమో! నేను " ప్రభాకరము" అను పుస్తకమును వ్రాయుట నిరాక్షేపముగా సాగ దగిన కార్యమనే తలచుచున్నాను. సవిస్తరముగ విన్న తరువాత మీరు వేరువిధంగా భావించబోరు...

వే॥ ప్ర.

**విజ్ఞప్తి:**

ఆపదలో క్షోభిస్తున్న వారి స్థితులలోనికి దిగి సహానుభూతి వలన వారికి మేలుకలిగించటమే శ్రీ శాస్త్రిగారి జీవిత ధర్మము. ఇది ట్రీట్‌మెంటు



పద్ధతితో సన్న సన్నగా ఆరంభించి చివరకు జాతీయ జీవనములోని క్షోభలను చల్లార్చేవరకు పరిణతి పొందింది. ఆత్మశక్తితో హింసను చల్లార్చే యీ పద్ధతి మాకు తెలిసినంతలో శ్రీ శాస్త్రిగారిలోను, గాంధీగారిలోను ప్రవ్యక్తమయినంతగా మరెక్కడా కనపడలేదు.

ఈ జాబులోని రెండవ ముఖ్య విషయము. శ్రీ శాస్త్రిగారు మాకు ట్రీట్‌మెంటు చేయటమే కాక మాకు మేమే చక్కదిద్దుకోవలెననటం. ఈ మాట వారి ఆయుష్కాలం చెల్లిపోవుచున్నదని ధ్వనింపజేస్తోంది.

ఇలాగే శ్రీ మాస్టరుగారు కూడా చరమదశలో తాము ఇవ్వగలిగిన దంతా యిచ్చామని, ఇక శిష్యులెవరికివారే దిద్దుకోవలెనని చెప్పినట్లు తెలుస్తుంది.

## లేఖ - 44

(ఈ లేఖను శ్రీ కొత్తవేంటేశ్వరరావుగారు పేర్కొన్నారు గానీ లేఖను ఉదహరించలేదు. విజ్ఞప్తి మాత్రమే కలదు - సం॥)

13-2-49

ఈ జాబు సచ్చిదానందముగారు వ్రాశారు. శ్రీ శాస్త్రిగారు తమ జన్మదినోత్సవానికి రెండురోజుల పూర్వము చెప్పిన పద్యమొకటి, రెండు రోజుల తర్వాత చెప్పిన పద్యమొకటి ఇందులో జతపరచి పంపారు.

ఆసల్ రేగగ నంతరంగపు టరణ్యంబున్ ప్రవేశించితిన్
దాసోహమ్మని చిమ్మ చీకటిని యంతర్యామి దర్శింప ను
ద్భాసిల్లెన్ వెలుగొక్కచో, వెదకి చెంతం జేర దావమ్ముగా
నై సోహమ్మని మారి యొక్కటె వెలుంగై తోచె తాదాత్మ్యమై.

ఈ పద్యము శ్రీవారు 5-2-49 సాయంత్రం ధ్యానానంతరము అంతకుముందు దినమంతా శరీరములో నీవిధముగా తెరచుకొని తెరచు కొని వెలికి వచ్చిన భావ విశేషముగా సెలవిచ్చినారు.

## లేఖ - 46

సి.వి.వి. 19-10-49

తిరుపతి

చిరంజీవ! సుఖీభవ!

ఉభయకుశలోపరి

ఈ నడుమ చి॥ రామకోటయ్యయేకాక పలువురు ఏదో చికాకు లోలో చెందుతున్నట్లు వ్రాసిరి. ఈక్వినాక్సు వెల్లువలు - వగైరాలు నన్ను చాలా చీకాకుపెట్టినవి. బెజవాడలో నిన్ను అట్లే గుర్తించితిని, నీవు చాలా తీవ్రంగా నిరుత్సాహంగా ఉన్నట్లు తోచింది. ఈ అన్నిటి సమిష్టి నన్ను లోలోనికి గుంజివేయసాగింది. ఏదేదో జరిగింది. దానిలో వ్రాసిన జాబు అది. అందు నీవొక్కడవేకాదు. అందరము అట్లే- ఆంధ్రదేశము - ఇంకా పైపై కూడా భాగస్వాములే. ఈ చీకాకులలో తెరపికలిగించు కోవటమే తెరపిగా ఉండటం అవుతుంది. మన మనోవైక్లబ్యశాంతి -ప్రభృతులే మన బాహ్యవైక్లబ్యశాంతి ప్రభృతులుగా అవుతవి అని - (చాలా వ్రాయవలసి ఉన్నది) తోచి - జాబులో యించుకంత వ్రాసినాను - కడకు మనలను - మనము (నన్ను నేను, నిన్ను నీవు కాక, జీవపరమాత్మలు ఇత్యాది ద్వంద్వములు, పరస్పరము వైవిధ్యమున - ఏకతను సాధించుకొంటూ వినోదము చెందుటగును చరమానందములో ఐక్యమగును. ఈ జాబు వ్రాస్తూ (దీనిని చూచి నీవు) ఫక్కుమని నవ్వి - నవ్వించి పరస్పరము తృప్తి - శాంతి పడసి, జాబువ్రాయగలవని కోరుచున్నాను. నన్ను మీరు, మిమ్ముౕనేను, నన్ను సి.వి.వి. - దాన్ని నేను, సి.వి.వి. - ప్రకృతిని, ప్రకృతి సి.వి.వి.ని విడనాడతరము కాదు. అంతా క్షేమము. బయట అశాంతి ఉంటే దానిలో చిక్కుకోక (కూర్మంగా నీవ) లోలోనికిపోయి ఏకీభవించి ఆనందము తెచ్చుకోవలెను. ఈక్వినాక్సు దానినే నేర్పుతున్నది. అందరి క్షేమాదికము వ్రాయుము.

వే॥ ప్ర॥.



## విజ్ఞప్తి:

ఈ జాబులో శ్రీ శాస్త్రిగారు రెండు మహనీయములైన సత్యాలను మనకు గుర్తుచేస్తున్నారు. అందులో మొదటిది - ఈ జగత్తు - జీవులు - ఈశ్వరుడు ఒకరినుండి ఒకరిని విడదీయడానికి వీలులేని సంబంధము కలిగియున్నారని, రెండవది - పైనుండి మనలోనికి దిగే దివ్యశక్తి ప్రవాహము ఏ యొక్కరికీ పరిమితముకాక వాతావరణములోని మార్పువలె దేశాన్నంతటినీ ముంచివేస్తుందని - ద్వైవిధ్యములో ఏకత సాధించు కుంటూ వినోదించటము చరమానందములో ఐక్యమవుతుందనటం ఈ యోగం మూలసూత్ర మని మనం గుర్తించాలి. పరిపూర్ణుడైన జీవి తన స్వరూపమనాశనం లేకుండా ఈశ్వరునితో ఏకతను పడయటమే ఈ యోగపరమార్థం.

## లేఖ - 47

11-12-49

...పనుల ఒత్తిడి తీవ్రముగానున్నది. మద్రాసు తంజావూరి పుస్తకాల ముద్రణ - ఆఫీసులో పని - కుమారసంభవ వ్యాఖ్యారచన - ప్రభాకరరచన - ఇన్నీవడివడిగా సాగిస్తున్నాను. అందరూ క్షేమము. చి॥ మీ ప్రేయసి - బిడ్డలు, మీ అక్క బావగార్లు వారి కుటుంబము అందరూ ఈ శ్వరార్పిత చిత్తులయి వర్ధిల్లుదురుగాక! చి॥ రామకోటయ్య జాబువ్రాసినాడు. వెన్నవంటివాడు! చి॥ గోపాలకృష్ణయ్యగారిని - రవిని - జగపతిని ఆశీర్వదించితి ననుడు.

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు సుఖముగా ఉన్నారుకదా!

వే॥ ప్ర.

## లేఖ - 50

2-3-50

..... చాలాపనుల ఒత్తిడి అన్నమాచార్య ఉత్సవము వగైరా - చాటు - వగైరా - అచ్చుపనులు తొందరలో మునిగి ఉన్నాను. అక్కడినుండి తెచ్చిన గ్రంథములింకా చదువలేదు. రేపు తాడిపత్రి వెళ్లవలెను. 6వ తేది తిరిగివస్తాను. చాలాజలుబు చేసింది. అయినా వెళ్ళకతప్పదు. 8వ తేది నుండి త్యాగరాజోత్సవాలు 12వ తేదీ దాకా - 13 నుండి 15 దాకా అన్నమాచార్యోత్సవాలు. మొన్న ఇక్కడ గాంధిగారి విగ్రహము వెల్లడి చేసినారు.

చి॥ మా తమ్మునకు జాబు వ్రాసినాను. ఆ కాగితాలు (గంధీరామాయణం) పూర్తి చేయుదువా ఇతరులచేత చేయింతునా అని రెండురోజులలో బదులు వస్తుంది. అన్నమాచార్యోత్సవం లోగా ఆపనిసాగదు. రికార్డునంతా కూర్చి ఉంచితిని. శ్రీ ఎం.ఎం. వేంకటా చార్యులు గారు అటుపైన తదేక కార్యముతో ఉంటారు. మీరు అక్కడ సేకరింప వీలుపడినవి సేకరించగోరినాను. సెలవులలో అందుకై టూరు జేయ చూస్తున్నాను కూడా....

వే॥ ప్ర.

### విజ్ఞప్తి:

ఈనాడు రేడియోలోను, పాటకచ్చేరీలలోను ప్రముఖంగా వినబడే అన్నమాచార్య (1424 -1503) కీర్తనలు చెక్కబడిన రాగిరేకు లారోజుల్లో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం బంగారువాకిలి సమీపంలో వున్న తాళ్లపాకవారి అర అనే చీకటికోణంలో మరుగుపడి ఉండేవి. వాటిని ప్రప్రథమంగా గుర్తించి★ వెలుగులోకి తీసుకువచ్చింది,ఈనాడు జయప్రదంగా సాగుతున్న అన్నమాచార్యోత్సవాలను ఏర్పాటు చేసింది శ్రీ శాస్త్రిగారే. శ్రీ శాస్త్రిగారి అపూర్వపరిశోధన వల్ల తెలుగువారికి పన్నిద్దరాళ్వార్ల ద్రావిడ దివ్యప్రబంధాలతో తులతూగే సంకీర్తన వాఙ్మయం ఉందనీ, ప్రఖ్యాత కర్ణాటక వాగ్గేయకారుడైన పురందరదాసు నాటికే మనకొక సంగీతబాణీ ఉండేదని విజ్ఞులు గుర్తిస్తున్నారు.

---

★ (ఇక్కడ విజ్ఞప్తి విషయమై ఒకమాట చెప్పవలసి ఉన్నది. కొండమీద తాళ్లపాక వారి అరలోనుండిన సంకీర్తనల రేకులను మొదటగ బయటకు తెచ్చినవారు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు



కారు. అరలోనున్న వాటిని తామే మొదట గుర్తించినట్లు శ్రీ శాస్త్రిగారు కూడా చెప్పలేదు - కానీ దేవస్థానం హుజూరాఫీసులో ఎక్కడో మూలన పడి ఉండిన సంకీర్తన రాగిరేకులను బయటకు తెచ్చి ,విశ్లేషించి, సక్రమమైన పద్ధతిలో పరిశోధనకారంభించి, ప్రకటించి, వెలుగులోకి తెచ్చినవారూ, అన్నమాచార్య చరిత్రను మొట్టమొదటగా పరిష్కరించి గొప్ప పీఠిక వ్రాసి అన్నమాచార్యుల కీర్తి మూర్తిని ఫోకస్‌లోకి తెచ్చినవారూ, సంకీర్తనల మాహాత్మ్యమును తిన్నగా గుర్తించి అన్నమాచార్యోత్స వాలను ఆరంభించి ప్రచారమునకు తెచ్చినవారూ శ్రీ శాస్త్రిగారే అని చెప్పవలెను - సం॥)

### తుది మనవి:

11-12-49 నుండి 2-3-50 వరకు సుమారు రెండున్నర నెలలో వచ్చిన నాలుగుజాబుల వల్ల మనకు శ్రీ శాస్త్రిగారు చరమదశలో దుర్భర కార్యభారం వల్ల ఎలా నలగులి అయినారో తెలుస్తుంది. ప్రతి జాబులోను దీన్ని ప్రస్తావిస్తూ వారు పనుల ఒత్తిడి తీవ్రంగా ఉన్నదని, తీరికలేదని, పనులు ఎక్కువైనవని, చాలా పనుల ఒత్తిడి, తొందరలో మునిగి ఉన్నానని వ్రాశారు. ఈ పనులు వారిని ఏక కాలంలో నలుముఖాల ముట్ట డించినాయి.

ఒకప్రక్కనుండి నిత్యం వారి ఆఫీసు పనులు, వాటితోపాటు కొత్తగా పూనుకొన్న "కుమారసంభవ" వ్యాఖ్యారచన, ప్రజ్ఞాప్రభాకర రచన రెండోప్రక్కనుండి మద్రాసు, తంజావూరు పుస్తకాలు, చాటువులు ముద్రించేపని, మరొకప్రక్కనుండి స్వాతంత్ర్యదినోత్సవం, అన్నమా చార్యోత్సవం, త్యాగరాజోత్సవం ఏర్పాటు సంరంభం - నాలుగోప్రక్కన మ్యూజియం వస్తుసేకరణ (ఇది వారికెక్కువ ఆయాసంకల్పించినది), గాంధీరామాయణ విషయ సేకరణ వారిని పద్మవ్యూహంవలె చుట్టు ముట్టినవి. వీటికోసం వారు తంజావూరు మద్రాసులనుండి రాజమండ్రి, తాడిపత్రిల వరకు పరుగులెత్తవలసివచ్చేది. ఇంత వత్తిడిలోను వారు నాబోటి పాత వారికి ట్రీట్‌మెంటు మరువలేదు. పి.యన్. నార్ల మొదలైన అనేక ప్రముఖులకు క్రొత్తగా ట్రీట్‌మెంటు చేపట్టక మానలేదు. చాలా జలుబు బలువుతో బాధపడకతప్పలేదు. దేశక్షేమాన్ని గూర్చిన నిరంతర తపస్సులో వారి శరీరస్థితి 1945 నుండి అస్తవ్యస్తమయింది. ఈ స్థితిలో వారు 1948 నాటికి డెబ్బయ్యోవడిలో కాలుపెట్టారు. ఈ వయస్సులో, ఈ ఆరోగ్యంలో క్రొత్తగా ఈ పనుల వత్తిడి వారిని అక్షరశః నలిగులి చేసిం దనటంలో అత్యుక్తి ఏమీలేదు. వారి స్థూలకాయం ఉన్నచోటనే నింపాదిగా

2. అందరి కన్నీళ్ళు - ఇత్యాది భావము గాంధి మహాత్ముని ఆశయాన్ననుసరించింది.

3. అశ్మన్వతీ ...... ఇత్యాది ఋగ్వేదాన్ననుసరించి (5-53-8) యజుర్వేదంలో కూడా ఉన్నది. డా॥ అవినాశ్ చంద్రబోస్‌గారి Call of the Vedas P. 230 Bharathiya Vidya Bhavan. 1960.

## ముగింపు

(ఈ లేఖ శ్రీకొత్తవేంకటేశ్వరరావుగారు యోగమిత్రులైన శ్రీ రామకోటయ్యగారికి తుదిమనవి వ్రాయడం పూర్తి చేసిన తరువాత వ్రాసినది - సం॥)

సం.జా.మూడి
31-10-80

**Dear Brother,**

నీవు వెళ్ళిన తరువాత కురదలాపని పూర్తి చేశాను. కొన్ని భాగాలు తిరిగి వ్రాశాను. ఇదంతా నీకూ, నాకూ గుంటూరు మిత్రులకు కొంత పనికల్పించింది. అయినా ఇవి శ్రీశాస్త్రిగారికి మనం అర్పించే ఒక ప్రేమాంజలి. దీన్ని Love's Labour Lost గా కాకుండా చూచుకొనే బాధ్యత మిగిలి ఉంది.

Yours affectionately
SD. K. Venkateswara Rao

## పరిశిష్టము - 1

1947 ఆగష్టునుండి నవంబరు వరకు తిరుపతిలో శ్రీ శాస్త్రిగారు చేసిన ప్రార్థనానంతర ప్రసంగాలను అక్కడిమిత్రులు సుదీర్ఘంగా వ్రాసి పంపిన జాబులనుండి కొన్ని సారాంశాలను ఈ అనుబంధంలో చేర్చటమయినది.



**మొదటి ఉపన్యాసము:** తేదీ 3 అని ఉన్నది. సందర్భాలను బట్టి బహుశ ఆగష్టు 3 అయి ఉండవచ్చును. ఇది 5 అరఠావుల జాబు. శ్రీ శాస్త్రిగారు స్వహస్తంతో చేసిన కొన్ని దిద్దుబాట్లు ఉన్నాయి. ఇందులో మిక్కిలి ముఖ్యమైన విషయము శ్రీ మాస్టరుగారి పునర్దర్శనాన్ని గూర్చినది.

**ఉపన్యాససారం:** 2వ తేదీన శ్రీ శాస్త్రిగారు మద్రాసులో శ్రీ పి. యన్. గారిని కలిశారు. "ఈశ్వరుడుంటే లోకానికీకష్టాలన్నీ ఎందుకు కలగాలి" అనే సంభాషణ జరిగింది. అప్పుడు శ్రీ పి. యన్. గారు శ్రీ మాస్టరుగారు రెండు మూడు రోజులకు ఫిజికల్ విడిచి పెడతారనగా వారు పి. యన్. వగైరాలతో "నేను మీకెన్నో యోగసాధనలు, విషయాలు వెల్లడించాను. కాని ఎక్కడ "గాడ్" అన్న పదాన్ని వాడలేదు. ఇకముందు మీరాతత్వాన్ని తెలుసుకోబోతారు" అని అన్నారని శ్రీ శాస్త్రిగారికి చెప్పారు. శ్రీ శాస్త్రిగారు ఈ మాటలను అదివరకు వినలేదు. అయినా తిరుపతి మిత్రగోష్ఠిలో వారు - ఈ శ్వరుడింకా ప్రత్యక్షంగా తెలియరాలేదు. విశ్వానికింకా సెంటరుఫారం కాలేదు. అయివుంటే లోకానికి ఈ బాధలు ఉండవు - అనేవారు.

ఈ మధ్య శ్రీ శాస్త్రిగారు శిష్యులకు ప్రార్థనలో కొన్ని దృశ్యాలు కనిపించినవి. వాటిని బట్టి శ్రీ శాస్త్రిగారు 1947 తుదిపాదంలోను, 1948 మొదటిపాదంలోను అనగా ఆ ఆరుమాసాల్లో ఇంతవరకు ఫారం కాకుండా ట్రిక్‌గా ఉన్న సెంటర్ విజిబుల్‌గా సత్యంగా ఫారం అయి, లోకమంతా తెలిసికొని అర్థం చేసికొంటుంది అని భావించారు.

అందరూ దేవాలయంలోని విగ్రహాలను చూచి దేవుడున్నాడను కొన్నట్లు - ఇంతవరకు శ్రీ శాస్త్రిగారు ఏవో వైబ్రేషన్‌లను బట్టి ఈశ్వరు డున్నాడని అనుకున్నారు. ఈ పూర్ణిమ (శ్రావణపూర్ణిమ నుండి ఈశ్వరతత్వం డిసెండు కావటం ఆరంభించి, డీప్ ఫీలింగు చాలా తీవ్రంగా కలిగి, తర్వాత అవిట్టము (ధనిష్ఠ) నాటికి (మాస్టరుగారి జన్మనక్షత్రం) ఒకడుకాని,అనేకులుకాని అంతరంగంలో గుర్తించే పూర్ణచంద్రోదయ మవుతుంది. 1948 నాటికి దాన్ని లోకమంతా గుర్తించవచ్చు. ఈ విషయాలను గూర్చిన ఫీలింగ్స్ చాలా తీవ్రంగా ఉన్నాయి. ఇలా

'ఇంతవరకు నేను మీకు ఏమి జబ్బుచేసినా మందుపుచ్చుకోవద్దని, నాకు టెలిగ్రామో, జాబో వ్రాయవలసిందని తెలిపాను. ఇకనేను అలా ట్రీట్‌మెంటు చేయ టానికి వీలుండదు. మీ మంచిచెడ్డలు మీరే అనుభవిస్తూ చక్కదిద్దు కోవల్సిందే. నేను ఇచ్చేదంతా ఇవ్వటం అయింది. నా మాటలన్నీ అవిశ్వాస్యములుగా, అబద్ధములుగా కూడా మీకుతోచే రోజులు వస్తవి. మందే పుచ్చుకుంటారో, మాకులే పుచ్చుకుంటారో ఏమి చేస్తారో మీ మనోనిబ్బరం ప్రకారం చేయండి. ఏమైనా రాబోయే ఆపత్సముద్రాన్ని దాటటానికి మీకు నామీది నిర్వికల్పప్రేమ, భక్తివిశ్వాసాలు నావగా ఉంటాయి. మీ మనస్సు నాపై నిశ్చలవిశ్వాసముతో ఉండగలగ టానికి ఈనాడు కోర్సు ఇస్తున్నాను. ఇది చేయండి. రాబోయే చీకాకులలో మీరు నన్ను నిందించే స్థితి కూడా ఏర్పడవచ్చు మీరేంచేసినా నా వల్ల మీకు మేలే కలుగుతుంది గాని, కీడు కలుగదు. నేను విశ్వామిత్రుడుగాను, దుర్వాసుడుగాను వర్తింపను. ఈ యోగమార్గంలో శపించటం అనేది ఉండనే ఉండదు. అంతా అనుగ్రహమే. ఈ యోగంలో Destructive Quality (విధ్వంసక గుణం) Work చేయదు. Creative Quality (సృజనాత్మక క్రియ) యే పని చేస్తుంది. ఈ యోగంలోని వారంతా ఋష్య శృంగులుగా ఉండాలేగాని, విశ్వామిత్రులు గాను, దుర్వాసులుగాను ఉండరాదు. ఇక మీద ఈ యోగంలో చేరిన వారిలో ఎవరో కొందరు Perfection కాలందాకా కంటిన్యూ కాలేకపోవటం, మరణించటం సంభవిస్తుంది. వారెవరో నేను చెప్పలేను. అది నాకే తెలియనియ్యలేదు. ఆ లిస్టు కావలెనని యం.టి.ఏ.ను అడిగాను. ఆ లిస్టు ఇవ్వను. నీవు దుఃఖపడతావు - వారిని నీవిపుడు నిలుపగలస్థితిలో ఉంటేతెలియ గోర వచ్చును. అది ఇప్పుడు అసాధ్యము. కనుక నీవు తెలుసుకో కోరవద్దు అని బదులువచ్చింది' అని శ్రీ మాస్టరుగారు చెప్పిరి.

తరువాత జగిరిన సందర్భాలను బట్టి చూడగా అలా శరీరము విడిచిన వారిలో ముఖ్యులు శ్రీమాస్టరుగారే అయినారు. ఇంకెందరో అయినారు. వారన్నట్లుగానే అనేకుల భావాలు అనేక విధాలుగా మారనూమారినవి! ఇది 1921లో జరిగిందని శ్రీ శాస్త్రిగారి జ్ఞాపకము శ్రీమాస్టరుగారు రెన్నాళ్ళలో తాము ఫిజికల్ విడవడం జరుగుతుందనగా



(1922) రాత్రి 10గం॥ల వేళ శ్రీ పి. యన్. గారిని పిలిపించి ఇలా చెప్పారట. "నరశింహ! ఆరంభంలో ఈ యోగసిద్ధి 16 గురులో జరుగుతుంది. అందులో నీవొకడవు'' అని.

ఇంకో సందర్భములో వారు " నేను ఇనిషియేషన్ చేసిన శిష్యుల్లో ఒకడైన కడతేరితే లోకమంతా కడతేరినట్లే! అలా ఒకడైనా కడతేరేదెప్పుడా అని చూస్తున్నాను. నేనిక ఈ యోగసిద్ధినంతా మీ ద్వారానే లోకానికి వెల్లడించ వలసి ఉన్నాను, కాని నేనుగా చేసేదేమి లేదు'' అని అన్నారు.

3. అలా Stand అయినవాడూ, మనమందరమూ (ఒకటి) అయి మనకు అనుగుణంగా "కాస్మిక్ లాస్'' ను (విశ్వధర్మాలను) తయారు చేసుకొనవలెను. అంతవరకూ మనకిచ్చిన చీటీ ప్రకారము మనము పోతూ ఉండవలసిందే. మాస్టరు డిసైపుల్స్‌లో పదవవంతు అయినా స్టాండ్ అయితే సెంటరు ఫిక్సయిన తర్వాత సర్కంఫరెన్సులో ఎన్నో సెంటర్లు ఫారం అవుతాయి. అలా ఫారం అయ్యే సెంటర్లలో గుంటూరు కూడా ఒకటి కావచ్చు. (అసలీ ప్రసంగమంతా స్వాతంత్ర్యదినం నాడు గుంటూరులో యోగమిత్రులు Independence Course చేస్తారని, అక్కడకు శ్రీ శాస్త్రిగారిని రమ్మని శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఆహ్వానించట మును గూర్చి జరిగింది. అందరూ కుంభకోణం వెళ్లాలి. అక్కడ సెంటరు ఫిక్స్ చేయాలి అని శ్రీ శాస్త్రిగారి అభిప్రాయం) - అలా ఫారమయ్యే సెంటరులన్నీ మళ్లీ సర్కంఫరెన్సులను ఫారం చేసుకొంటవి. సెంటరును రేడియేట్ చేస్తుంది అట్టిదానికిది సహానుభూతం కావచ్చు. అసలింతకూ సరుకుండాలె కదా! సరుకుండేటట్లుగా తయారయ్యేటందుకు ప్రయత్నం చేయాలి కదా! ఆ ప్రయత్నంలో ఉందాము.

## మూడో ఉపన్యాసము

6-8-47
సాయంత్రం

ఇది 1 1/2 పేజీల ఉపన్యాసం - శ్రీ శాస్త్రిగారు చేసినదిద్దుబాట్లు ఉన్నాయి - దీని సారాంశము రాజకీయ స్వాతంత్ర్య సమరము వలెనే, యోగమార్గంలో ఆత్మస్వాతంత్ర్యము కోసం పోరాడాలని.

నిశ్చయించుకోవటం జరిగింది. ఈ భావం శ్లేషకవితా రచన, శ్లేషచిత్రరచనలను పోలినది. మాస్టరంటే ఏమిటి? మాస్టరు గారి నామస్మరణతోనే ఇలా యాక్షన్ జరగటానికి కారణం ఏమిటి? చెట్టు మొలిచేటప్పుడు విత్తనంనుండి మొట్టమొదట భూమిలోకిదిగే వేరు - కూకటివేరు నుండి అనేక వేళ్లు వేరుపడతాయి. అలాగే క్రియేషన్ స్టార్టయినపుడు - అనగా మానవ, జంతు, వృక్ష, ధాతువర్గాల పరిణామాలకు పూర్వం, భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము అనే పంచభూతాల పరిణామానికి పూర్వం - పరమాత్మలో కలిగిన స్పందన వలన మొట్టమొదటగా వేర్పాటయిన ఏటమే'' (Atom = అణువు) మొట్టమొదట జీవుడుగా వచ్చిన అణువే డెవలప్ అయి (పరిణామం పొంది) మానవ వర్గంలో మాస్టరుగా అయింది.

ఆ అణువు అనేకంగా విడిపోయి. అనేక జన్మలెత్తినాయి. అలా మాస్టరు అనే తొలిజీవాణువునుండి ఉత్పత్తి అయిన అనేక జీవాణువులే ఈ జన్మంలో వారిని చుట్టుకొని ఉన్నాయి. కూకటివేరునుండి వేరుపడిన వేళ్ళన్నీ తమ రసగ్రహణమునంతా కూకటి వేళ్ళద్వారానే పరమాత్మావిష్కరణము చేయసాగినవి. ఈ తొలిజీవాణువు (మాస్టరుగారు) తననుండి వేరయిన అనంత జీవాణువుల నన్నింటినీ కూడగట్టుకొని, నిర్గుణమైన తన పరమాత్మను సగుణముగా నామరూప క్రియాత్మకంగా వెలయించుకోవటానికే యీ పాటంతాపడుతున్నది. అంతరన్వేషణలు - మనయోగం. చెట్టు పైపైకి ఎగబ్రాకుతూ ఉండగా దానివేళ్ళు క్రిందికి క్రిందికి దిగబ్రాకినట్లు, ఈ జీవాణువులు బాహ్యప్రపంచంగా (ధాతు, వృక్ష, జంతు, మానవ వర్గములలో) విరివి చెందుతూ, సృష్టిమూలాన్ని గుర్తించడానికి లోలోనికి పోసాగినవి. మానవుడై పుట్టటమే దుఃఖమూల మని, గార్హస్థ్యము వల్ల సృష్టి పెరుగుతుంది అనీ, కాబట్టి సన్యాసము కావాలని బౌద్ధులన్నారు. ఈ సన్యాస సంకల్పాన్నే త్రిమతాల వారు కొన్ని మార్పులతో గ్రహించారు. గార్హస్థ్యం తగదనేటప్పటికి ఒక Separation (వేర్పాటు)కు చోటిచ్చినట్లయింది. వెంటనే గార్హస్థ్యం ఉంటేనే గాని Realise చేయ (సాక్షాత్కరించుకో) లేమని ఇంకో వ్యూ (చూపు), వర్కు (పని) చేసింది.



ఇలా అనేకులు అనేక మార్గాలనవలంబించి బ్రహ్మాన్నిచూడవలెనని Attempt (ప్రయత్నం) చేస్తూ ఉంటే, వాటి సారమంతా (ఇతర వేళ్లు గ్రహించిన సారమంతా కూకటివేరులోనికి చేరినట్లు) ప్రధానకుండలిని లోనికి చేరింది. అందరి Experience (అనుభవము) యొక్క రిజల్ట్సు (ఫలితములు) ఒక ప్రధానవ్యక్తిలోనికి చేరినవి.

పరమార్థం లోకాంతరానగాని పొందలేమని కొందరనగా, ఉపనిషత్తులు కంటికి కనిపించే వెలుగే బ్రహ్మమని, ఘంటానాదమే బ్రహ్మమని అన్నవి. పరమార్థసాధనకనేక విద్యలను రూపొందించినవి. ఇందుకోసమే హఠ, రాజ, మంత్ర, భక్తి, ధ్యాన, జ్ఞానయోగాలు వెలసినాయి. ఈ విధంగా ఎన్నో జన్మములు గడచినవి. వారు వారు పొందిన అనుభవాలు రికార్డు చేయబడినాయి. అందుకే మాస్టరుగారు "ఇదివరకెన్ని సాధనమార్గములున్నవో వాటిసారమంతా నా పాదం క్రింద ఉంచుకొని ఈ Line Start (మార్గ ఆరంభం) అయింది అన్నారు.

**ఈశ్వరుడు:** ఈ Line నిశ్చయమేమంటే ఎవరైనా ఈశ్వరుణ్ణి (బ్రహ్మాన్ని) చూశామనంటే, వాడు ఈశ్వరుడుగా మారితేగాని అది నిశ్చయం కాదు. మొట్టమొదట దాన్ని చూచిన వాడే కనబడే ఈశ్వరుడు.

అవతల ఆనందమయస్థితి ఉందని దాన్నిపొందాలని అనేకులు అనేక విధములుగా Atempt చేస్తున్నారు. అయితే అంతరంగంగా జరిగే స్థితి అవుటర్‌గా తెలియాలి. ఎవరైనా ఒకరు అవుటర్ రియలైజ్ చేయగలిగితే (బహిరంగంగా కూడా తెలిసేట్టుండాలి) వాడు ప్రపంచ మంతటిని తనతోపాటు మార్చగలిగి ఉండాలి. అందరూ ఒకటే అన్న అనుభవం కలిగితే గాని ఆ స్థితి పొందలేడు.

**శ్రీ శాస్త్రిగారి అంతరంగ ఉద్బోధలు:** పదేండ్ల తరువాత నాకు కలిగిన అనుభవాలు చాలా విచిత్రమైనవి. అప్పటినుండి నాకు నాలో నుండి ఉద్బోధమనే ఊట సాగింది. ప్రశ్నలకు సమాధానం రాసాగింది. సమాధానం వచ్చే, ఉద్బోధ ఉత్పత్తి అయ్యేచోటికి వెళ్ళి చూడకపోయినా అక్కడి

## ఆరో ఉపన్యాసము

15-8-47 రాత్రి

**స్వాతంత్ర్యమంత్రం:** ఈ యోగంలో చేరినవారికి మాస్టరుగారు ఫస్ట్ ప్రేయరుగా ఇచ్చినది స్వాతంత్ర్యమును గూర్చే. ఆ వాక్యాన్ని First Six Months ధ్యానం చేయమన్నారు వారు. Please make me fit to find out Brahman and liberate me to realise independency in this life" అని ఆ వాక్యం. ఇంగ్లీషు తెలియనివారికి దీన్ని తెలుగులోకి తర్జుమాచేసి ఇలా ఇచ్చేవారు.

"నన్ను భృక్తరహిత తారకరాజయోగమార్గమున...."

(ఇది ఇచట పూర్తిగా వ్రాయలేదు.)

(చూ. శ్రీమాస్టరు గారిచ్చిన యోగప్రవేశానుగ్రహపత్రంలో ఈ ప్రార్థన పూర్తి పాఠమున్నది.సం॥)

Master C.V.V Centre Point (కేంద్రబిందువు - Enternity శాశ్వతత్వము)

Master C.V.V. అని స్మరించేటప్పటికి అది కుండలినిలో ఉన్న Life కు Centre Point ను తాకి శరీరమంతా వైబ్రేటు (స్పందింప) చేస్తుంది, Action జరుపుతుంది. Life కు Centre Point మాస్టరు. ఫస్టు ఆ Level ను Bore చేసుకొంటూ చూస్తూ పోతే శూన్యంగా ఉందేగాని వేరేమిలేదు. అది ట్రిక్కు (మాయ) సర్కిలు. అక్కడకు వెళ్ళిచూస్తే తనను తానే చూడటమయింది. ఆ సెంటరును Vibrate చేయడానికి ఆ పేరు తలిస్తేగాని అక్కడకు పోవడానికి వీలులేదు. మనకెంతవరకూ ఇవ్వవలెనో అంత వరకూ ఆయన ఇస్తారు.

ఇనీషియేషన్ జరిగిన రోజున ఎంతో ఏక్షన్ జరిగింది. Action ఎక్కడరా అని చూస్తే శరీరంలోని అన్ని భాగాలలోను Work చేస్తూ ఉన్నట్లుండేది. కళ్ళు మూసుకుంటే గాఢాంధకారంగా ఉండేది. వెలుగును చూపుతూ శరీరానికంతకూ రేడియేటు చేస్తూ ఉండేది ఆ తత్త్వమే. దాని



అనుగ్రహం Fullfill (పరిపూర్ణం) అయ్యేటప్పటికి అది Eternal కాబట్టి మనలనూ ఎటర్నల్‌గా చేస్తుంది.

**యోగం పేరు:** ఈ యోగానికి "భృక్తరహిత తారకరాజయోగం" అని పేరు. భృక్త అంటే మాయ. మాస్టరుగారు దానిని deluding one (భ్రాంతిని కలిగించే ఒకటి - ఒకడు) అని చెప్పారు. అది (దాన్ని) లేకుండా చేసేది తారక రాజయోగం. వాటి విశేషాలు రేపు.

(మర్నాడు ఏం చెప్పారో తెలియదు)

( ఈ ప్రసంగాంశం తరువాత 'ఏడవ ఉపన్యాస' మనే శీర్షిక లేదుకానీ తరువాత అంశమున్నది. దానినే Deluding one అని యోగమిత్రులు ఏడవ ఉపన్యాసంగా పేర్కొన్నట్లున్నారు - సం॥)

## ఏడవ ఉపన్యాసం

Nil (శూన్యం), full (పరిపూర్ణం)

Nill లో నుండి Creiation (సృష్టి) Start (ఆరంభం) అయింది. అది Full గా Stand కాబోతున్నది. Centre Fixing (కేంద్రస్థాపన) మనలోనుండి పుట్టే సంకల్పం అంతా కూడుకొనే Centre Fix చేస్తుంది. Centre ఇంకా ఫారం కాలేదు. అట్లా ఫారం అయి కండెన్సు కావడానికి (ఘనీభవించడానికి) ఇండిపెండెన్సు అనేది లోకంలో నిత్యంగా ఉండటమే. ఎటర్నిటీ Establish అయేటప్పటికి (శాశ్వతత్వం స్థాపించబడేటప్పటికి) దేవాలయాల్లో విగ్రహాలన్నీ హ్యూమన్ (మనుష్య) షేప్ (ఆకారం) తీసుకొని అవి ఎటర్నిటీని పొందుతాయి. ఇది ఇలా వస్తుందని చెప్పడానికి కారణం మాస్టరు Level అంత హయ్యరుగా ఉండటమే.

## ఎనిమిదో ఉపన్యాసం

22-11-47 సాయంత్రము

**పూర్వజన్మ జ్ఞానం:** పూర్వజన్మల విశేషాలను గుర్తించటానికి All Side Conscience (సర్వతోముఖ ప్రజ్ఞ) అవసరం. అది మనకు మాస్టరుగారి

జరుగుతున్నట్లు తోచింది. గుండెనిలిచి పోయినట్లయింది. చేయిపెట్టి చూశాను. ఎక్కడో నిమిషానికొకసారి కొట్టుకుంటోంది. రక్తంలేదు. అలా ఉదయం 9గం॥ల వరకు బాధపడుతూనే ఉన్నాను.

**శ్రీ శాస్త్రిగారు**: 1914-18 యుద్ధంలో నాకు అట్లాగే ఉండేది. ఆ యుద్ధాలు, మరణాలు నాలో జరిగినట్లుండేవి. పేపరు చూడకుండా ఉంటే బాధ. చూస్తే బాధ. ఏమి చేయగల శక్తిలేదు. ఈ దౌర్జన్యము, హింసా ఎన్నాళ్ళనుంచో ఇట్లాగే సాగుతున్నాయి. జినుడు, బుద్ధుడు 2500 ఏళ్ళనాడే మొత్తుకున్నా వెంట్రుకముక్క తెగలేదు. తరువాత క్రీస్తు, శంకరులు, రామానుజులు, వాళ్ళూ ఏంజేయలేకపోయారు. అది ఇంకా సాగుతూనే ఉన్నది. నిన్న మొన్నటి యుద్ధం అంతా అదేగదా! ఇప్పుడు మనదేశంలోని హిందూ-ముస్లిముల తగాదాలన్నీ అదేకదా! మనిషి మనిషివేరు, అనే పృథగ్భావంవల్లనే ఈ ఆటలు సాగుతున్నాయి. ఒక్కొక్క జీవిలో ఒక్కొక్కDome (ఆవరణ) వేసి ఇతరులనుండి వేరుచేస్తుంది, ఈ మాయ. ఆ ఆటే హింస-అహింసలకు జరుగుతున్న ఘర్షణ.

మన యోగంలో We are all one (మనమంతా ఒకటి) అనే భావంrealise చేసి (సాక్షాత్కారించుకొని) తద్వారా అమృతత్వాన్ని పడయటమే పరమార్థం. ఇది మన యోగతత్త్వానికొక ముఖమనుకోండి! హింస అంటే పరాయివాళ్ళకు బాధ కలిగించటమే కదా! సరయిన బుద్ధిగల వాడెవడూ తనను తాను హింసించుకోడు కదా! మనమంతా ఒకటయితే హింస ఉండదు కదా! అదే అహింస. ఈ అహింసే మనయోగానికి మరో ముఖం అనుకోండి. ఈ జగద్వ్యాపారంలో ఈ పృథగ్భావమే, అహింస-హింసల మధ్య; అమృతత్త్వం - మృత్యువులకి మధ్య; పోరాటంగా వెల్లడవుతుంది. ఈ ఆట కట్టాలనంటే మన ప్రజ్ఞ bottomకు (అట్టడుగుకు) పోవాలి. అక్కడ అందరి కుండలినులు ఒకటే. అక్కడినుండి ఏ ఏ పాయింట్లను ఎట్లా ఎట్లా పట్టుకోవాలో చూచి Control నియమించవచ్చు.

ఇప్పుడు బీహార్‌లో ఈ ఘాతుకచర్య జరిగేప్రతిచోట గాంధీ, బుద్ధులు కనిపించాలి. కనిపించగానే హంతకులకు వణుకుపుట్టి హస్తాల



నుండి కత్తులు జారిపోవాలి. ఈ భేదాలన్నింటికి మూలకారణమైన నాయకులకు తమ విద్వేషకరనాయకత్వం వల్ల ఎంతమంది దారుణ మరణం చెందుతున్నారో ఎరుకకలగాలి. ఇవన్నీ మాస్టరుగారి అనుగ్రహం వల్ల జరగాలి. ఈ Capacity (శక్తి) ఇతరులకు లేదు. ఈయన Bottom లోకి వెళ్ళారు. ఔటు (మతాబా) ను కాల్చి ఆకాశంలోకి విడిచినప్పుడు అది మొదట తుస్‌మని శబ్దం చేస్తుంది. ఆకాశంలోకి ఎగిరి Burst (పగిలి)అయిన చోట ఆకర్షవంతమైన రంగులు కనిపిస్తాయి. తుస్ అన్నప్పుడు దాని Starting point (ఆరంభస్థానము) ఎవరికీ తెలియదు. పైన Burst అయినదాన్ని బట్టి తెలుసుకుంటారు. ఆ విధంగానే ఈ హింసనుControl చేసే సంకల్పం ఇక్కడ కలిగినపుడది ఏదో అపాన వాయువు వెళ్లినట్లు ఉంటుంది. Circumference (వలయపు అంచులకు) వెళ్లినపుడు దాని Action (క్రియ) పరిణామం చెప్పనలవి కాదు. ఇలా చూస్తే, మనం అందరం ఒకటే అనే భావాన్ని వ్యక్తం చేయటానికి Origin (మూలతత్త్వం) ఎంత తంటాలుపడుతున్నదో, ఎట్టి వత్తిడుల(Pressures) వలన లోకంలో ఆ భావం వ్యక్తమవుతున్నదో - ఆ Plan (ప్రణాళిక) ఎంత అద్భుతమయినదో తెలుస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ గారు, శ్రీరాములుచెట్టిగారు (అక్కడకాపూట ట్రీట్‌మెంటు కోసం వచ్చి పృథగ్భావాన్నే సమర్థించిన ఒక దేవస్థాన ఉద్యోగి) మనమూ అంతా వేరువేరు అంటాం. మనందరికీ ఈ Action ఇప్పుడు తెలియదు. లోకంలో Work out (కార్యసిద్ధి) అయిన తర్వాత అందరూ Appreciate చేస్తారు. (ప్రశంసిస్తారు) సరే ఏం జరుగుతుందో చూద్దాములేవయ్యా! భోజనాలకు పదండి.

-ఈ సంభాషణవల్ల మనకు యోగతత్త్వానికి, అహింసాతత్త్వానికి, గాంధీగారియత్నానికి, శాస్త్రిగారి తపస్సుకుగల అవినాభావసంబంధం తెలుస్తుంది.

గాంధీగారి అహింసా సంకల్పం ఎలా వర్కవుటు అయిందో ఆ రోజుల్లో బీహార్, కలకత్తా, నౌఖాళీ వృత్తాంతాలను పరిశీలిస్తే తెలుస్తుంది. మనమన అంచనాలను అలా ఉంచి ఆనాటి రాజప్రతినిధి, గవర్నరు జనరల్ అయిన లార్డ్‌మౌంట్‌బాటన్ సాక్ష్యం దీన్ని సరిగా అంచనా వేస్తుంది. ఆయన

## మాస్టరు గారి మరియు మాతృశ్రీ గారి కుటుంబము

కుప్పుస్వామి అయ్యర్
(కామమ్మను పరిణయమాడిరి)

వెంకాస్వామి రావు సి.వి.వి. (మాస్టరుగారు)
(కంచుపాటి వెంకటరావు గారి దత్తపుత్రుడు)

× × ×

మద్దూరి అప్పయ్య
(భార్య సుబ్బమ్మ)

వెంకమ్మ (మాతృశ్రీగారు)
(మాష్టరు సి.వి.వి. గారిని
పరిణయమాడినారు)

శ్రీనివాస రావు
(భార్య కామమ్మ, మాష్టర్
సి.వి.వి.గారి మొదటి
భార్యయైన రుక్మిణమ్మగారి కుమార్తె)



**కంచుపాటి రంగారావు**
(భార్య అమ్మణమ్మ)
**కంచుపాటి వెంకటరావు**
(భార్య సుబ్బమ్మ)

వెంకాస్వామిరావు సీ.వీ,వీ.మాస్టారుగారు కంచుపాటి వెంకటరావు భార్యయైన ఈ సుబ్బమ్మ కుప్పుస్వామి అయ్యరుగారి సోదరి.

× × ×

### సి.వి.వి. మాస్టరు మొదటి భార్య రుక్మిణమ్మ

(ఈ క్రింది వారు పై దంపతుల సంతానము)

1. వెంకటరావు 1888
2. అమ్మణమ్మ 1893
3. కామమ్మ 1894
4. వెంకమ్మ 1896
5. కృష్ణమూర్తి 1898
6. రామచంద్ర రావు 1904

× × ×

### సి.వి.వి. మాస్టరు రెండవ భార్య మాతృశ్రీ వెంకమ్మ

(ఈ క్రింది వారు పై దంపతుల సంతానము)

1. చందు 13.04.1909
2. కమలమ్మ (భర్త కృష్ణస్వామి)
3. భృక్తా రావు 30.04.1916